www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★




రాజ్యాంగం ప్రమాదంలో...

మరో 400 ఇండిగో విమానాలు రద్దు

విమాన ప్రయాణానికి మంగళం 05

సంపుటి 09, సంచిక: 11 | ఆదివారం | 07-12-2025 | కరీంనగర్ | Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00



## సుప్రీంకోర్టు 'సామాన్యుల కోసమే'

- భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్
- 'హిందుస్థాన్ టైమ్స్ లీడర్‌షిప్' సమావేశంలో కీలక ప్రసంగం
- డిజిటల్ అరెస్ట్, సైబర్ నేరాల విషయంలో న్యాయవ్యవస్థ సరికొత్త సవాళ్లను ఎదుర్కొంటోందని వెల్లడి

**న్యూఢిల్లీ :** 'సుప్రీంకోర్టు సామాన్యుల కోసమే' అనే బలమైన సందేశాన్ని భారత ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) సూర్యకాంత్ అందించారు. ఆయన మాట్లాడుతూ 'పెండింగ్ కేసుల ముందస్తు నిర్ణయం ఆధారంగా ఊహించదగిన కాలక్రమం, ఏకీకృత జాతీయ న్యాయవిధానం తన ప్రాధాన్యత' అని అన్నారు.శనివారం ఇక్కడ 'హిందుస్థాన్ టైమ్స్ లీడర్‌షిప్' శిఖరాగ్ర సమావేశంలో సూర్యకాంత్ మాట్లాడుతూ న్యాయాన్ని పొందడం గురించి ప్రధాన న్యాయమూర్తి ప్రస్తావించారు. వ్యాజ్యాల ఖర్చును తగ్గించడం, విషయాలు నిర్ణయించబడే సహేతుకమైన కాలక్రమాన్ని ఎలా సూచించాలో నిర్ధారించడం తన ప్రాధాన్యతగా సిజెఐ సూర్యకాంత్ వెల్లడించారు. న్యాయవ్యవస్థ స్వతంత్రత గురించి తరువాయి 12లో

# ఎస్ఎల్‌బిసి పూర్తిచేస్తాం

> బిఆర్ఎస్ హయాంలో డబుల్ బెడ్రూమ్‌ల పేరుతో పదేళ్లు కాలం గడిపారు. ఏ ఒక్క ఊళ్లో కూడా ఇండ్లు ఇవ్వలేదు. కెసిఆర్, కెటిఆర్, హరీశ్‌రావులు మాత్రం గడీలు నిర్మించుకున్నారు. పేదల పట్ల బిఆర్ఎస్‌కు చిత్తశుద్ధి లేదు. లంబాడీలకు రిజర్వేషన్లు కల్పించింది ఇందిరమ్మ అంటూ గిరిజనుల మధ్య పంచాయితీ పెట్టాలని చూస్తున్నారు. ప్రజా పాలనలో అలాంటి ఆటలు సాగవు. రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదే. బిఆర్ఎస్ కాలంలో రుణమాఫీ కేవలం వడ్డీలకే సరిపోయింది.
>
> – సిఎం రేవంత్‌రెడ్డి

## దేవరకొండ, మునుగోడు ప్రాంతాలను సస్యశ్యామలం చేస్తాం



- ఎస్ఎల్‌బిసిని పదేళ్లపాటు పడావు పెట్టారు
- గతంలో మంత్రులు, ఎమ్మెల్యేలను కెసిఆర్ కలవలేదు
- ప్రజాపాలనలో అభివృద్ధి, సంక్షేమం జోడెడ్ల వలే సాగుతోంది
- దేవరకొండలో ప్రజాపాలన విజయోత్సవ సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

ప్రజాపక్షం/దేవరకొండ

రాష్ట్రంలో గడీల పాలనను అంతం చేసి ప్రజాపాలన తీసుకువచ్చిన ప్రజలకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ప్రజా ప్రభుత్వంలో అభివృద్ధి సంక్షేమం జోడెద్దుల వలె పాలన సాగుతుందని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అన్నారు. 'గతంలో మంత్రులు, ఎమ్మెల్యేలను కూడా కెసిఆర్ కలవలేదు. ప్రగతి భవన్, ఫామ్‌హౌస్‌లోకి మంత్రులు సహా ఎవరినీ రానివ్వలేదు. ఇప్పుడు ఫామ్‌హౌస్‌లో సర్పంచ్‌లు, వార్డు మెంబర్లను కూడా కెసిఆర్ కలుస్తున్నారు. కెటిఆర్ ఒక్కడు చాలు కెసిఆర్‌ను నాశనం చేయడానికి. కాంగ్రెస్ ప్రభుత్వం మంజూరు చేసిన ఎస్ఎల్‌బిసి ప్రాజెక్టును పదేళ్లపాటు పట్టించుకోలేదు. నల్లగొండ జిల్లా ప్రజల మీద పగబట్టి ఎస్ఎల్‌బిసి ప్రాజెక్టును పడావు పెట్టారు. ఎస్ఎల్‌బిసి పనులు మేం ప్రారంభించగానే సొరంగంలో దురదృష్టవశాత్తు ప్రమాదం జరిగింది. ప్రమాదం జరిగితే బిఆర్ఎస్ నేతలు సంబరపడ్డారు. ఏదేమైనా టన్నెల్‌ను పూర్తి చేసి నీరు అందిస్తాం. ఈ ప్రభుత్వ హయాంలోనే ఎస్ఎల్‌బిసి ప్రాజెక్టును పూర్తి చేస్తాం' స్పష్టంచేశారు. శనివారం ముఖ్యమంత్రి నల్లగొండ జిల్లా దేవరకొండ నియోజకవర్గంలో పర్యటించారు. నియోజకవర్గంలో రూ.23 కోట్ల విలువైన పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ప్రజాపాలన ప్రజా విజయోత్సవ సభలో తరువాయి 2లో



# ధరలపై పరిమితి

## ఇండిగో సంక్షోభంతో రంగంలోకి కేంద్రం

500కి.మీ వరకు రూ.7,500లు

1500కి.మీ.దాటితే రూ.18,000గా ఖరారు

**న్యూఢిల్లీ :** దేశీయ విమానయాన సంస్థ ఇండిగో సేవల్లో అంతరాయం వల్ల ప్రయాణికులు గమ్యస్థానాలు చేరుకోలేక ఇబ్బంది పడుతున్నారు. ఈ పరిస్థితిని కొన్ని విమానయాన సంస్థలు ఆసరాగా తీసుకోవడంతో టికెట్ ధరలు ఆకాశన్నంటుతున్నాయి. ధరల పెంపు విషయం తన దృష్టికి రావడంతో శనివారం కేంద్రం రంగంలోకి దిగింది. ప్రయాణికులను అధిక ఛార్జీల భారం నుంచి రక్షించేందుకు చర్యలు చేపట్టింది. ధరల నియంత్రణను తీసుకువచ్చామని, వాటిని పాటించాలని ఆదేశించినట్లు పౌర విమానయాన మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఎకానమీ క్లాస్‌లో కి.మీ. వారీగా గరిష్ఠ ఛార్జీలను పరిశీలిస్తే... 500కి.మీ వరకు రూ.7,500. 500–1000కి.మీలకు రూ.12,000, 1000–1500కి.మీ రూ.15,000, 1500కి.మీ. దాటితే రూ.18,000గా విధించారు. 'అంతరాయాల సమయంలో అసాధారణంగా ఛార్జీలను పెంచడాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నాం. ఈ తరహా అవకాశవాద ప్రవర్తన నుంచి ప్రయాణికులను రక్షించేందుకు చర్యలు చేపడుతున్నాం. ప్రభావిత మార్గాల్లో న్యాయబద్ధమైన ఛార్జీలను నిర్ధరించేందుకు మంత్రిత్వశాఖ తన నియంత్రణ అధికారాలను ఉపయోగించుకుంది. కార్యకలాపాలు సాధారణ స్థితికి చేరుకునేవరకు కొత్తగా సూచించిన పరిమితులను కచ్చితంగా పాటించాలి. వందల సంఖ్యలో విమాన సర్వీసులు రద్దయిన నేపథ్యంలో సీనియర్ సిటిజన్లు, విద్యార్థులు, వైద్యసహాయం అందాల్సిన ప్రయాణికులు సీట్లు దొరక్క ఇబ్బంది పడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ధరలపై నియంత్రణ ఉండేలా, దోపిడీని నిరోధించాల్సిన అవసరం ఉంది' అని మంత్రిత్వశాఖ వెల్లడించింది. ఆర్‌సిఎస్‌యుడిఎఎన్ విమానాలు, బిజినెస్ క్లాస్‌కు ఈ ఛార్జీలు వర్తించవని కేంద్రం వెల్లడించింది. ధరల స్థిరీకరణ జరిగేవరకు లేక తదుపరి సమీక్ష జరిగేవరకు ఈ పరిమితులు అమల్లో ఉంటాయని వెల్లడించింది. ఈ నిబంధనలను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని పేర్కొంది. కేంద్ర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడు అధికారులతో తరువాయి 12లో



# గ్లోబల్ సమ్మిట్‌తో ఆర్థిక ప్రయోజనాలు

- ఈనెల 8, 9 తేదీలలో 'తెలంగాణ గ్లోబల్ రైజింగ్ - 2025 ఎకానమిక్' సమ్మిట్
- హాజరుకానున్న 6 ఖండాలు 44 దేశాలు 154 మంది ప్రతినిధులు
- సమ్మిట్‌ను ప్రారంభించనున్న రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ
- మీడియా సమావేశంలో సమ్మిట్ వివరాలు వెల్లడించిన డిప్యూటీ సిఎం భట్టి

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రాన్ని 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా 'తెలంగాణ గ్లోబల్ రైజింగ్ 2025 ఎకానమిక్' సమ్మిట్‌ను ఈ నెల 8, 9 తేదీల్లో భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్వహిస్తోందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. ఇది పూర్తిగా రాష్ట్ర భవిష్యత్తు, ఆర్థిక ప్రయోజనాలకు ఉద్దేశించిన సమ్మిట్ అని ఆయన చెప్పారు. హైదరాబాద్ మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో శనివారం మంత్రులు డి.శ్రీధర్ బాబు, మహ్మద్ అజారుద్దీన్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావులతో కలిసి భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్వహించనున్న తెలంగాణ గ్లోబల్ రైజింగ్ 2025 ఎకనమిక్ సమ్మిట్‌కు సంబంధించిన వివరాలు వెల్లడించారు. 2047 నాటికి తెలంగాణ 3 ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థను సాధించడమే లక్ష్యంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నీతి అయోగ్, ఐఎస్‌బి హైదరాబాద్ సలహాలు సూచనలతో విజన్ డాక్యుమెంట్ రూపొందించామని తెలిపారు. ఈనెల 8న మధ్యాహ్నం 1:30 గం.లకు తెలంగాణ గ్లోబెల్ రైజింగ్ 2025 సమ్మిట్‌ను రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రారంభిస్తారన్నారు. ముఖ్యమంత్రి రేవంత రెడ్డి నాయకత్వంలోని మొత్తం కేబినెట్ అంతా కలిసి ఆలోచనలు చేసి విజన్ డాక్యుమెంట్ రూపొందించినట్లు తరువాయి 2లో

# పార్ బాయిల్డ్ రైస్ అదనపు కోటా ఇవ్వండి



ప్రజాపక్షం/హైదరాబాద్

- మరో 12 లక్షల మెట్రిక్ టన్నులు కేటాయించండి
- ఎఫ్‌సిఐ చైర్మన్‌కు మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి విజ్ఞప్తి

ఈ ఏడాది రబీ (2024–25)కు సంబంధించి పార్ బాయిల్డ్ రైస్ కోట అదనపు కేటాయింపులు ఇవ్వాలని పౌర సరఫరాల శాఖమంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఆష్ తోష్ అగ్నిహోత్రికి విజ్ఞప్తి చేశారు. శనివారం సచివాలయంలోని తన కార్యాలయంలో మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఎఫ్‌సిఐ చైర్మన్‌తో మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పలు అంశాలపై ఇరువురు చర్చించారు. ప్రధానంగా పార్ బాయిల్డ్ రైస్ (కెఎంఎస్ 2024–25 రబీ) అదనపు కేటాయింపు కోసం విజ్ఞప్తి చేశారు. కెఎంఎస్ 2024–25 (ఖరీఫ్ , రబీ) కోసం కేంద్ర ప్రభుత్వం 30 లక్షల మెట్రిక్ టన్నుల బాయిల్డ్ రైస్ లక్ష్యాన్ని కేటాయించిందని అయితే 2024–25 రబీ నుండి ఇప్పటి వరకు 17.06 లక్షల మెట్రిక్ టన్నుల పార్ బాయిల్డ్ 0.8 లక్షల మెట్రిక్ టన్నులముడి బియ్యం సరఫరా చేయడం జరిగిందని వివరించారు. ఇంకా 2.34 లక్షల మెట్రిక్ టన్నుల పార్ బాయిల్డ్ ,14.26 లక్షల మెట్రిక్ టన్నుల ముడి బియ్యం సరఫరా చేయాల్సి ఉందని తెలిపారు. ఫిబ్రవరి 2026 నాటికి ప్రభుత్వం 18 లక్షల టన్నులు తీసుకోవాల్సి ఉన్నందున, 24–25 గాను 10 నుండి 12 లక్షల టన్నుల బాయిల్డ్ రైస్ అదనపు కోటా ఇవ్వాలని మంత్రి కోరారు. పార్ బాయిల్డ్ రైస్ తరలింపు కోసం అదనపు రేక్‌ల అవసరం ఉంటాయనిప్రస్తుత సంవత్సరం రేక్ తరలింపు గత సంవత్సరం (జనవరి నవంబర్) తో పోలిస్తే 13.5 లక్షల మెట్రిక్ టన్నుల కొరత ఉందని మంత్రి ఫుడ్ ఎఫ్‌సిఐ సిఎండికి వివరించారు. ఎఫ్‌సిఐ గోడౌన్లలో పార్‌బాయిల్డ్ బియ్యం నిల్వలు పేరుకుపోయాయని, దీంతో సిఎంఆర్ డెలివరీలు ఆలస్యం అవుతుందని మంత్రి పేర్కొన్నారు. తెలంగాణలోని ఎఫ్‌సిఐ డిపోల నుండి పార్ బాయిల్డ్ బియ్యం తరలింపును వేగవంతం చేయడానికి అదనపు రేక్‌లను వెంటనే కేటాయించాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. అలాగే ఖరీఫ్ 2024–25కు సంబంధించి సిఎంఆర్ బియ్యం డెలివరీ సమయం గత నెల11తో ముగియడంతో సరఫరా వ్యవధి తరువాయి 2లో

ఘనంగా గుమ్మడి నర్సయ్య బయోపిక్ సినిమా ప్రారంభం 03





# అంబేద్కర్‌కు సిపిఐ ఘన నివాళి

ప్రజాపక్షం/హైదరాబాద్

డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా ఆయనకు పలువురు సిపిఐ నాయకులు ఘనంగా నివాళి అర్పించారు. సిపిఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూం భవన్ శనివారం సిపిఐ జాతీయ కార్యదర్శి కె. రామకృష్ణ, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈటి నరసింహ, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు ఛాయాదేవి, తెలంగాణ దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్,సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి స్టాలిన్, ఎస్ టి యు రాష్ట్ర అధ్యక్షుడు సదానంద గౌడ్ , ఎఐవైఎఫ్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు ఎన్. శ్రీకాంత్, ఎఐటియుసి నాయకులు బొడ్డుపల్లి కిషన్, వెంకటయ్య, ఆఫీస్ కార్యదర్శి గోవింద్, బోయ శ్రీరాములు, మన్నె రాజేందర్,శివకుమార్, సత్తిబాబులు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు.

# నిర్మల్‌లో మెడికల్ మాఫియా

## డ్రగ్ ఇన్‌స్పెక్టర్ నిర్లక్ష్యంపై తీవ్ర ఆరోపణలు

ప్రజాపక్షం/నిర్మల్



నిర్మల్ జిల్లా కేంద్రంలో ప్రజారోగ్య వ్యవస్థ ప్రమాదంలో పడింది.ఒకవైపు మెడికల్ షాపుల యజమానుల ఇష్టారాజ్యం, మరోవైపు డ్రగ్స్ కంట్రోల్ అధికారుల పర్యవేక్షణ లోపం కలగలిసి జిల్లాను అక్రమాల అడ్డాగా మార్చేశాయి. జిల్లా డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ నిరంకుశత్వం, నిర్లక్ష్యం కారణంగానే స్థానిక మెడికల్ మాఫియా శక్తిగా ఎదిగి, బడా డాన్ దావూద్ శీనుగా మారిపోయిందని పలువురు డ్రగ్స్ అధికారిపై తీవ్ర స్థాయిలో ఆరోపణలు గుప్పిస్తున్నారు. డ్రగ్స్ అధికారిని చూసి మెడికల్ షాపుల యజమానులు ఏమాత్రం భయం లేకుండా చట్టాలను తుంగలో తొక్కుతున్నారు.జిల్లా కేంద్రంలోని మెడికల్ షాపులపై డ్రగ్ ఇన్స్పెక్టర్ ఏనాడు కూడా తనిఖీలు చేసిన సందర్భాలు లేకపోవడం ఈ మాఫియాకు అక్రమ కార్యకలాపాలు సాగించడానికి లైసెన్స్ ఇచ్చినట్టే ఉందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.మెడికల్ యూనియన్ల నుంచి భారీగా ముడుపులు అందుకుని,కనీసం ఆ వైపు కన్నెత్తి కూడా చూడడం లేదనే విమర్శలు తీవ్రమవుతున్నాయి. జిల్లా కేంద్రంలోని డ్రగ్స్ కంట్రోల్ కార్యాలయం ఎప్పుడూ తాళం వేసే ఉంటుందని, ఇన్‌స్పెక్టర్ ఏనాడు అందుబాటులో ఉండరని ఫిర్యాదుదారులు వాపోతున్నారు. ఫిర్యాదు చేసేందుకు వెళ్ళిన ప్రతిసారీ కార్యాలయానికి తాళం వేసి ఉండడంతో, తరువాయి 2లో

# 'శాంతి' భారం రష్యాదే

## ఫ్లోరిడా చర్చల్లో అమెరికా–ఉక్రేన్ ఉమ్మడి పిలుపు



**ఫ్లోరిడా:** శాంతి సాధన నిర్ణయం ఇక రష్యాదేనని, భారమంతా పుతిన్‌పైనే ఉందని ఫ్లోరిడాలో జరిగిన చర్చల్లో అమెరికా–ఉక్రేన్ ప్రతినిధులు ప్రకటించారు. ఉక్రేన్‌లో దీర్ఘకాలిక శాంతి సాధనకు చిత్తశుద్ధి చూపించాలని రష్యాకు వారు ఉమ్మడి పిలుపు ఇచ్చారు. రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో ట్రంప్ ప్రత్యేక దూత స్టీవ్ విట్‌కాఫ్, అల్లుడు కుష్నెర్ డిసెంబరు రెండో తేదీన మాస్కోలో ఐదు గంటలు చర్చల తర్వాత తిరిగివెళ్ళి డిసెంబరు 4,5,6 తేదీల్లో ఫ్లోరిడాలో ఉక్రేన్ ప్రతినిధులతో సంభాషణలు జరిపారు. ఈ సంభాషణల్లో ట్రంప్ అల్లుడు జారెడ్ కుష్నెర్ కూడా పాల్గొన్నారు. రష్యా వైఖరి కారణంగా మాస్కో చర్చల్లో శాంతి ఒప్పందం ముందుకు వెళ్ళకుండా స్తంభించిందని బ్రిటన్ మీడియా విమర్శించగా, చర్చలు విఫలం కాలేదని, తమకు ఆమోదయోగ్యం కాని కొన్ని అంశాలు ఇందులో ఉన్నాయని, ట్రంప్ ప్రతిపాదించిన ప్రణాళికలోని ప్రతి అంశంపైన, పదజాలం–వాక్య నిర్మాణంపైన క్షుణ్ణంగా పరిశీలన చేయాల్సి ఉందని, ముసాయిదా ప్రణాళికపై ఎలాంటి రాజీ పరిష్కారం కుదరలేదని మాత్రమే పుతిన్ చెప్పారని రష్యా అధికార మీడియా ప్రకటించింది. కానీ ఫ్లోరిడా చర్చల్లో పాల్గొన్న విట్‌కాఫ్, ఉక్రేన్ జాతీయ భద్రతా మండలి కార్యదర్శి రుస్టెమ్ ఉమ్రోవ్ శనివారం ఉమ్మడి ప్రకటన చేస్తూ, యుద్ధ పరిష్కారానికి రష్యా చిత్తశుద్ధి చూపించాలని తరువాయి 12లో

## రిలయన్స్ పవర్, మరో పది అనుబంధ సంస్థలపై ఇడి ఛార్జిషీటు

**న్యూఢిల్లీ:** నకిలీ బ్యాంకు గ్యారంటీలు ఇచ్చారన్న కేసులో వ్యాపారవేత్త అనిల్ అంబానీ గ్రూప్‌కు చెందిన రిలయన్స్ పవర్ లిమిటెడ్, దానికి అనుబంధంగా ఉన్న మరో పది సంస్థలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇ డి) పటియాలా హౌస్ కోర్టులో ఛార్జిషీటు దాఖలు చేసింది. లెక్కలో చూపించకుండా ధనాన్ని అక్రమంగా ఇతర అవసరాలకు మళ్ళించారన్న ఆరోపణలపై ఈ ఛార్జిషీటు దాఖలు చేసినట్లు శనివారం ఇడి అధికారులు చెప్పారు. ఒక టెండరు సంపాదించేందుకు రూ.68 కోట్ల మేరకు నకిలీ బ్యాంకు గ్యారంటీలు చూపించారు.. ఈ కేసులో రిలయన్స్ వపర్‌కు అనుబంధంగా ఉన్న ఎలాంటి పెట్టుబడులూ లేని డొల్ల కంపెనీ బిస్వాల్ ట్రేడ్‌లింక్ ప్రైవేట్ లిమిటెడ్, రిలయన్స్ పవర్, రిలయన్స్ ఎన్‌యు బెస్ లిమిటెడ్, రోసా పవర్ సప్లయ్ కంపెనీ లిమిటెడ్ మాజీ సిఎఫ్ఓ అశోక్ కుమార్ పాల్, ఒడిశా కేంద్రంగా పనిచేస్తున్న తరువాయి 2లో





## దక్షిణాఫ్రికాలో కాల్పులు : 11 మంది మృతి

**ప్రిటోరియా:** దక్షిణాఫ్రికాలో శనివారం జరిగిన సామూహిక కాల్పుల దాడిలో 11మంది మరణించారు. మరో 14మంది గాయపడ్డారు. దేశరాజధాని ప్రిటోరియాకు పశ్చిమంగా ఉన్న సెత్ విల్లే పట్టణంలో ఒక హాస్టల్‌లోకి శనివారం తెల్లవారుజామున గుర్తుతెలియని దుండగులు చొరబడి లోపల కూర్చుని ఉన్న ఒక బృందంపై విచక్షణారహితంగా కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో మరణించినవారిలో ఒక బాలుడు, ఒక టీనేజ్ బాలిక కూడా ఉన్నారు. పోలీసు ప్రతినిధి బ్రిగేడియర్ అథ్లెండా మాథే ఈ విషయం చెప్పారు. ఈ కాల్పులు ఎవరు జరిపారో, ఎందుకు జరిపారో, దీని వెనుక గల కారణం ఏమిటో తెలియరాలేదు. కానీ ఇటీవలికాలంలో దేశంలో కాల్పుల సంఘటనలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. ఈ పరంపరలో ఇది మరో తాజా సంఘటన. ఈ హాస్టల్ అక్రమ మద్యం కార్యకలాపాలకు కేంద్రంగా ఉందని, ఇటీవల అనేక ఘటనలు ఇలాంటివే ఈ హాస్టల్‌పై జరిగాయని మాథే చెప్పారు. ప్రజలు కూడా కాల్పుల్లో మరణిస్తున్నారన్నారు. ఐక్యరాజ్యసమితి డ్రగ్స్-క్రైమ్స్ నివేదిక ప్రకారం ప్రతి ఏటా దక్షిణాఫ్రికాలోనేకువగా హత్యలు జరుగుతున్నాయి.

# పాక్–అఫ్ఘాన్ సరిహద్దుల్లో మళ్లీ కాల్పులు

### ఐదుగురు పౌరులు మృతి



**కాబూల్:** పాకిస్తాన్-ఆఫ్ఘనిస్తాన్ మధ్య కీలకమైన ఉమ్మడి ఛామన్ సరిహద్దుల్లో సైన్యాలమధ్య మళ్ళీ కాల్పులు యుద్ధం చెలరేగింది. పాకిస్తాన్ దాడుల్లో తమ దేశ పౌరులు ఐదుగురు మరణించినట్లు ఆఫ్ఘనిస్తాన్ శనివారం ప్రకటించింది. గాయపడినవారిని జిల్లా ఆసుపత్రికి తరలించారు. సౌదీ అరేబియాలో రెండు దేశాల ప్రతినిధులమధ్య జరుగుతున్న చర్చలు పురోగతి లేకుండా ప్రతిష్టంభనతో విఫలమయ్యాయి. తాజా కాల్పులు కవ్వింపు పులకు మీరంటే మీరే కారణమని రెండు దేశాల సైన్యాలూ పరస్పర ఆరోపణలు చేసుకుంటున్నాయి. ఛామన్ సరిహద్దు ప్రదేశాన్ని ఫ్రెండ్‌షిప్‌గేట్ అని కూడా పిలుస్తారు. ఆఫ్ఘనిస్తాన్ కాందహార్‌కు వెళ్ళే మార్గంలో పాకిస్తాన్ బలూచిస్తాన్ రాష్ట్రానికి ఇది ప్రధాన రహదారిగా ఉంది. సరిహద్దుల్లో కాల్పులకు మీరంటే మీరే మొదటి కారకులని రెండు దేశాలూ మొదటినుండీ ఆరోపణలు చేసుకుంటున్నాయి. ఇప్పుడు కూడా అవే ఆరోపణలు పునరావృతమయ్యాయి. బలూచిస్తాన్ రాష్ట్రం వద్ద సరిహద్దుల్లో శుక్రవారం అర్ధరాత్రి ఈ కాల్పులు ప్రారంభమయ్యాయి. ఆఫ్ఘనిస్తాన్ సైన్యాలు బదిలీ ప్రాంతంపై మోర్టార్ షెల్స్‌ను ప్రయోగించాయని పాకిస్తాన్ అధికారులు ఆరోపించారు. కానీ స్పిన్ బాల్డాక్‌పై దాడులు ప్రారంభించడంతో తమ సైన్యాలు ప్రతిస్పందించాల్సి వచ్చిందని అఫ్ఘానిస్థాన్ తాలిబన్ అధికార ప్రతినిధి జబిహుల్లా ముజాహిదీన్ చెప్పారు. ఆఫ్ఘనిస్తాన్ సైన్యాల దురాక్రమణ చర్యలను తిప్పికొట్టిందుకే తమ సైన్యాలు ప్రతిస్పందించాయని పాకిస్తాన్ అధికార వర్గాలు చెబుతున్నాయి. ఛామన్-కాందహార్ జాతీయ రహదారిపై కూడా ఘర్షణలు జరిగాయి. ఐతే వీటిని ఇంకా ధృవీకరించలేదు. పాకిస్తాన్ విరామం లేకుండా నిరంతరం ఆఫ్ఘనిస్తాన్‌పై ఆరోపణలు చేస్తోంది. దీంతో ప్రతీకార దాడులు కూడా తరచు జరుగుతున్నాయి. తెహ్రీక్-ఎ-తాలిబన్ పాకిస్తాన్ ఉగ్రవాదులకు అఫ్ఘానిస్థాన్ ఒక స్వర్గధామంలా మారిందని, వారంతా తమ దేశంలోకి వచ్చి దాడులు చేసి అఫ్ఘాన్ భూభాగంలోకి పారిపోతున్నారని పాకిస్తాన్ ఆరోపిస్తున్నది. గతనెలలో తీవ్ర ఉద్రిక్తతలు చెలరేగడంతో రెండు దేశాలమధ్య కాల్పు విరమణ ప్రాతిపదికపై ఒక అంగీకారం కుదిరింది.

### తొమ్మిదిమంది భారత్ ప్రేరేపిత ఉగ్రవాదులు హతం

భారత్ ప్రేరేపిస్తున్న తొమ్మిదిమంది ఆఫ్ఘనిస్తాన్ ఫిత్నా అల్‌ఖవారిజ్ ఉగ్రవాదులను హతమార్చినట్లు పాకిస్తాన్ ఇంటర్ సర్వీసెస్ పబ్లిక్ రిలేషన్స్ విభాగం శనివారం ప్రకటించింది. ఖైబర్‌పఖ్తూంఖ్వారాష్ట్రంలోని తాంక్, లక్కీ మార్వాత్ జిల్లాలో జరిగిన దాడుల్లో శుక్రవారం ఈ ఉగ్రవాదులను మట్టుపెట్టినట్లు పేర్కొంది. పాకిస్తాన్‌లో నిషేధించిన తెహ్రీక్-ఎ-తాలిబన్ పాకిస్తాన్ ఉగ్రవాద సంస్థను పాక్ సైన్యాలు "ఫిత్నా అల్ ఖవారిజ్"గా నామకరణం చేశాయి. ఆ పేరుతోనే దానిని పిలుస్తున్నారు. కాగా భద్రతా దళాలలపై ఉగ్రవాదుల దాడిని పాకిస్థాన్ అధ్యక్షుడు ఆసిఫ్ అలీ జర్దారీ ఖండించారు.

## వినోదరంగంలో మహాశక్తిగా ఎదిగిన నెట్‌ఫ్లిక్స్

### వేలంపాటలో 'వార్నర్ బ్రదర్స్' స్వాధీనం

### ఇక 25 శాతం సినిమాలు గల్లంతు

**హాలీవుడ్:** వారంరోజులుగా జరిగిన వేలంపాట పోరులో ప్రపంచ ప్రఖ్యాత ఆన్‌లైన్ వేదిక "నెట్‌ఫ్లిక్స్" వార్నర్ బ్రదర్స్ డిస్కవరీని స్వాధీనం చేసుకుంది. దీంతో నెట్‌ఫ్లిక్స్ వినియోగదారుల సంఖ్య ఒక్కసారిగా అనేక లక్షలు పెరిగిపోయింది. హాలీవుడ్‌కు చెందిన 128 మిలియన్ల సబ్‌స్క్రైబర్లు దీనికి జతకలుస్తారు. ఇప్పటికే నెట్‌ఫ్లిక్స్‌కు ప్రపంచవ్యాప్తంగా 300 మిలియన్లకు పైగా సబ్‌స్క్రైబర్లు ఉన్నారు. ఈ ఒప్పంద ప్రక్రియ పూర్తి కావడానికి 18 నెలల పడుతుందని నెట్‌ఫ్లిక్స్ అంచనావేసింది. దీంతో హాలీవుడ్‌లో, అమెరికా,అంతర్జాతీయ సినిమా,సబ్‌స్క్రిప్షన్‌లో మహాశక్తిగా ఎదిగింది. మొత్తం 72 బిలియన్ డాలర్లకు వేలంపాటలో దీనిని నెట్‌ఫ్లిక్స్ స్వాధీనం చేసుకుంది. దీంతో హాలీవుడ్ సృజనాత్మక కళాకారులు, వృత్తినిపుణులు, కార్మికులలో భయాలు పెరుగుతున్నాయి. ఉద్యోగాల్లో కోతలు పెడతారని కార్మికులు ఆందోళన చెందుతున్నారు. ఒప్పందంపై పూర్తిస్థాయిలోసంతకాలు జరిగితే ఇక థియేటర్లలో విడుదలయ్యే సినిమాల సంఖ్య గణనీయంగా తగ్గిపోతుందని కార్మికులు ఆందోళన చెందుతున్నారు. ఇక ప్రతి సంవత్సరం దాదాపు 25 బాక్సాఫీస్ చిత్రాలకు కాలం చెల్లినట్లే అవుతుంది. ప్రతి సంవత్సరం అంతర్జాతీయ 26,000 సినిమాలకు, అమెరికాలో 30,000 సినిమాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న ట్రేడ్ గ్రూప్ 'సినిమా యునైటెడ్' శనివారం ఈ విషయం ప్రకటించింది. ఐతే నెట్‌ఫ్లిక్స్ మాత్రం ఈ వాదనలను కొట్టిపారేసింది.

# ఇక ఏటేటా 'నోబెల్'కు పోటీ

## ట్రంప్‌కు 'ఫిఫా–2025 తొలి శాంతి బహుమతి




**వాషింగ్టన్ డిసి:** నోబెల్ శాంతి బహుమతికోసం ట్రంప్ఎంతగా తహతహలాడినప్పటకీ ఆ అవార్డు –2025 ట్రంప్‌కు దక్కలేదు. కానీ' 'ఫిఫా' (ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఫుట్ బాల్ అసోసియేషన్) నెలకొల్పిన మొట్టమొదటి శాంతి బహుమతి మాత్రం ట్రంప్‌కే దక్కింది. ఫిఫా–2026 ప్రపంచ కప్ పోటీల నిమిత్తం వాషింగ్టన్ డి.సి కెన్నడీ సెంటర్‌లో డ్రా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఫిఫా ట్రోఫీని ఆవిష్కరించిన కార్యక్రమంలో పాల్గొన్న ట్రంప్‌కు ఈ శాంతి బహుమతి ఇచ్చి సత్కరించారు. ట్రంప్‌కు శాంతి బహుమతి ఇస్తున్నట్లు ఈ సభలో 'ఫిఫా' అధ్యక్షుడు గియాని ఇన్‌ఫాంటినో ప్రకటించి ఆయనకు బహుమతిని ఇచ్చి సత్కరించారు.ప్రపంచవ్యాప్తంగా ఉన్న వందల కోట్లమంది ఫుట్‌బాల్ అభిమానుల గౌరవానికి చిహ్నంగా, పిఫా కీర్తి ప్రతిష్ఠలను ఇనుమడింపజేసేలా ఇకమీదట ప్రతి సంవత్సరం ఈ శాంతి బహుమతినిప్రకటిస్తామని ఇన్‌ఫాంటినో చెప్పారు. ప్రనపంచంలో శాంతి సాధనకు ట్రంప్ ఎంతగానో పరితపించి సేవలు అందించారని, ఆయన ఈ బహుమతికి తగిన అర్హుడని ఇన్‌ఫాంటినో ప్రశంసించారు. వచ్చే ఏడాది జూన్ 11 నుండీ ప్రారంభం కానున్నఫుట్‌బాల్‌కప్–2026 పోటీ లకు ఈసారి అమెరికా, మెక్సికో, కెనడా దేశాలు ఆతిథ్యం ఇస్తున్నాయి. ట్రంప్ మాట్లాడుతూ, ఇది తనకు దక్కిన గొప్ప గౌరవమని అన్నారు.

### ఫిఫా–25 పై విమర్శలు

ట్రంప్‌కు ఫిఫా–2025 శాంతి బహుమతి ప్రకటించడంపై అప్పుడే విమర్శలు ప్రారంభమయ్యాయి. అసలీశాంతి బహుమతికి ఉన్న చెల్లుబాటు ఏమిటని పలువురు ప్రశ్నించారు. నామినేషన్లు కోరకుండా, ఎవరికీ బహురంగ ప్రకటనలు చేయకుండా, న్యాయ నిర్ణేతలు సమావేశమైన చర్చించి నిర్ణయం తీసుకోకుండా ఫిఫా–2025 శాంతిబహుమతి ఇవ్వడం హాస్యాస్పదమని మానవహక్కుల సంఘం హ్యూమన్ రైట్స్ వాచ్ సంస్థ విమర్శించింది. ఈ శాంతి బహుమతి ప్రకటించడంలో ఒక ఆచరణాత్మక విధానం, కార్యాచరణ లేదని విమర్శించడంతో ఈ బహుమతి ట్రంప్ పట్టుదలతో రూపుదిద్దుకునందనే రాజకీయరంగు పులుముకుంది. ప్రపంచంలో అనేకచోట్ల దాదాపు ఏడు యుద్ధాలు జరగకుండా నివారించినందుకు గాను తనకు ఈ ఏడాది నోబెల్ శాంతి బహుమతి రావాలని డోనాల్డ్ ట్రంప్ నెలరోజులు ముందునుండీ రాగం అందుకున్నారు. ఆయనఆశ నెరవేరలేదు.వెనిజులా ప్రజాస్వామ్య ఉద్యమ నాయకురాలు మారియా కోరినా మఛాడోకు ఈ అవార్డు లభించడంతో ట్రంప్ భంగపాటుకు గురయ్యారు. ఈ అవార్డు 2024లో చేసిన కృషికి చిహ్నంగా మఛాడోకు లభించిందని ఆయనతనకుతాను సర్దిచెప్పుకున్నారు. 2025లో శాంతికోసం జరిగిన కృషికి 2026లో తనకు శాంతి బహుమతి లభించగలదన్నఆశాభావం వ్యక్తం చేశారు. ఐతే మఛాడోకు నోబెల్‌శాంతి కమిటీ అవార్డు ప్రకటించిన తర్వాత ట్రంప్ మాట్లాడుతూ, నోబెల్ కమిటీ సభ్యులతో మాట్లాడాననీ, వారు, "ఉక్రేన్‌యు మీరు యుద్ధాన్ని ఆపండి, అప్పుడు ఆలోచిస్తాం"అని చెప్పారని అన్నారు. ట్రంప్‌శాంతిఒప్పందంకుదిర్చిఉక్రేన్‌లో కాల్పుల విరమణ అమలులోకి తెచ్చే పనిలోతలమునకలై ఉన్నారు.

## అంబేద్కర్ ఆశయాలను బిజెపి ప్రభుత్వం కాలరాస్తోంది



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** అంబేద్కర్ ఆశయాలను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కాల రాస్తోందని సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ అన్నారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 69వ వర్ధంతి సందర్భంగా సిపిఐ(ఎం) తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో శనివారంహైదరాబాదు ట్యాంక్‌బండ్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి, నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జాన వెస్లీ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని బలహీనపరిచి, మనుధర్మ శాస్త్రాన్ని అమలు చేస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజాస్వామిక, లౌకిక, ప్రజాతంత్ర, సామాజిక న్యాయం కోరే శక్తులన్ని ఏకమై పోరాడాలని సిపిఐ(ఎం) పిలుపునిస్తుందని. అలాంటి పోరాటాల్లో అగ్రభాగాన నిలబడుతుందని ఆయన తెలిపారు.తెలంగాణలో బిసిలకు 42శాతం రిజర్వేషన్స్ అమలుకు అన్ని పార్టీలతో పాటు, రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నం చేసినప్పటికీ, కేంద్రం దీన్ని అడ్డుకుంటుందన్నారు. రిజర్వేషన్ల అమలుపై నిరాశ చెంది ఈశ్వరచారి ఆత్మహత్య చేసుకున్న దుర్ఘటనకు పూర్తి బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదే బాధ్యత అన్నారు. ఎవరూ ఆత్మహత్యలకు పూనుకోవద్దని సిపిఐ(ఎం) విజ్ఞప్తి చేస్తోందనిఆత్మహత్యలకు పాల్పడంఅది పూలే, అంబేద్కర్ ఆశయాలకు విరుద్ధమని ఆయన పేర్కొన్నారు.. ఈ కార్యక్రమంలోసిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బండారు రవికుమార్, ఎండీ అబ్బాస్, రాష్ట్ర కమిటీ సభ్యులు స్కైలాబ్‌బాబు, నగర నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## 21న జాతీయ లోక్‌అదాలత్

### జస్టిస్ పి.సామ్ కోషి




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** న్యూఢిల్లీలోని నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ సూచనల మేరకు రాష్ట్రంలో ఈనెల 21న జాతీయ లోక్ అదాలత్‌ను తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి, తెలంగాణ రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ జస్టిస్ పి.సామ్ కోషి తెలిపారు. జాతీయ లోక్ అదాలత్‌ను ఏర్పాట్లకు సంబంధించి శనివారం తెలంగాణ రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యాలయంలోజస్టిస్ పి. సామ్ కోషి అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈసమావేశంలో డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ డి.శివధర్ రెడ్డి, అదనపు డిజిపి మహేశ్ భగవత్, అడిషనల్ డిజిపి చారు సిన్హా,హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పోలీస్ కమిషనర్లు, జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ట్రాఫిక్), ఎక్సైజ్ కమిషనర్, డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్‌తో పాటు ఆర్‌టిసిఅధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జస్టిస్ పి.సామ్ కోషి మాట్లాడుతూ పెద్ద సంఖ్యలో ఉన్న అన్ని కేసులను పరిష్కరించడం వల్ల కోర్టులపై భారం తగ్గించడమే లక్ష్యంగా . జాతీయ లోక్ అదాలత్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న క్రిమినల్ కాంపౌండబుల్ కేసులు, ఎక్సైజ్ కేసులు, ఆర్‌టిసి కేసులు, చెక్ బౌన్స్ కేసులను పరిష్కరించనున్నట్లు జస్టిస్ పి.సామ్ కోషి వెల్లడించారు. టిఎస్ఎల్ఎస్ఎసభ్య కార్యదర్శి పంచాక్షరి, ఎఒఎం.రాజు పాల్గొన్నారు.

## ఇడి ఛార్జిషీటు

(మొదటి పేజీ తరువాయి)

రిలయన్స్ గ్రూపు కార్యనిర్వాహకుడు పునిత్ నరేంద్ర గార్గ్, దాని ఎండి పథసారథి బిస్వాల్, ట్రేడ్ ఫైనాన్సింగ్ కన్సల్టెంట్ అమర్‌నాథ్ దత్తలు ఈ ఛార్జిషీటులో నిందితులుగా ఉన్నారు. ఇ డి అధికారుల సమాచారం ప్రకారం, బయోథాన్ కెమికల్స్ ప్రైవేట్ లిమిటెడ్, రవీంద్ర పాల్ సింగ్ ఛధా, మనోజ్ భయాసాహెబ్, పాంగ్దే కూడా ఛార్జిషీటులో నిందితులుగా ఉన్నారు. ధనాన్ని లెక్కల్లో చూపించకుండా అక్రమంగా ఇతర అవసరాల నిమిత్తం మళ్ళించేందుకు ప్రయత్నం చేసినందుకు పిఎంఎల్ఏ (ప్రివెన్షన్ ఆఫ్ మనీ లాండరింగ్ యాక్ట్)లోని నిబంధల కింద ఈ ఛార్జిషీటును దాఖలు చేశారు. సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఎస్ఇసిఐ) నుండి టెండరు సంపాదించేందుకు రూ.68.2 కోట్ల మేరకు బ్యాంకు గారంటీలను సమర్పించడంకోసం నకిలీ పత్రాలు సమర్పించారు. రిలయన్స్ ఎన్‌యు బెస్ లిమిటెడ్ తరపున ఈ పత్రాలు సమర్పించారు. ఈ కంపెనీ గతంలో మహారాష్ట్ర ఎనర్జీ జనరేషన్ లిమిటెడ్ పేరుతో ఉండేది. ఇది నకిలీ పత్రాలు సమర్పించారని రిలయన్స్ కార్పొరేషన్‌అధికారులకు బాగా తెలుసుననే విషయాన్ని ఇడి అధికారులు తమ దర్యాప్తులో గుర్తించారు. ఆ తర్వాత కంపెనీ వాస్తవ ప్రాతిపదికపై ఎలాంటి మోసం లేకుండా ఐడిబిఐ నుండి బ్యాంకు గ్యారంటీలు తీసుకువచ్చినప్పటికీ కూడా సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఆ గ్యారంటీని అంగీకరించేందుకు తర్వాత తిరస్కరించింది.

## అదనపు కోటా ఇవ్వండి

(మొదటి పేజీ తరువాయి)

మరో 60 రోజులు పొడిగించాలని, వివిధ కారణాల వల్ల ఇప్పటికీ 2.27 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం పెండింగ్‌లో ఉందని మంత్రి తెలిపారు. అలాగె తెలంగాణలో ప్రస్తుతం ఎస్‌డబ్లూసి, సిడబ్లూసిలనిల్వ సామర్థ్యం 65.00 లక్షల మెట్రిక్ టన్నులుగా ఉందని వివిధ ప్రభుత్వ సంస్థలు పూర్తిగా వీటిని ఉపయోగించుకుంటుడడంతో కింద ఎఫ్‌సిఐ ద్వారా అదనంగా 15 లక్షల మెట్రిక్ టన్నులల నిల్వ సామర్థ్యాన్ని మంజూరు చేయాలని మంత్రి కోరారు. మరింత పెంచాలని కోరారు. మిల్లర్లు ప్రస్తుత ధాన్యం సేకరణ విషయంలో వెనుకాడుతుండటం, మిల్లుల వద్ద స్థలం లేకపోవడం వల్ల కొత్త ధాన్యం సేకరణ మీద ప్రభావం చూపుతుందని అన్నారు. 78 సంవత్సరాల హామీతో ప్రైవేట్ భాగస్వామ్యం ద్వారా రాష్ట్రం మరిన్ని గోడౌన్లను నిర్మాణం చేయడానికి PEG పిఇజి పథకాన్ని పునరుద్ధరించాలని మంత్రి సూచించారు. రాష్ట్రం రెండేళ్లు, ఎఫ్‌సిఐ 6 ఏళ్ల హామితో ప్రైవేట్ భాగస్వామ్యంతో ఇస్తే నిలువ సామర్థ్యము పెంచుకోవచ్చని అన్నారు. తదుపరి 4 నెలలకు నెలకు 0.5 లక్షల బాయిల్డ్ రైస్ తరలించవచ్చు అని అన్నారు.

## ఆర్థిక ప్రయోజనాలు

(మొదటి పేజీ తరువాయి)

చెప్పారు. ఈ కార్యక్రమంలో అంతర్జాయ స్థాయి లో పేరొందిన ఎకనమిస్టులు ప్రసంగిస్తారని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చెప్పారు. ఈ తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2025 అనేది తెలంగాణ భవిష్యత్తును నిర్మించేదిగా, రా ష్ట్రానికి భారీ పెట్టుబడులు రాబట్టేదిగా, ప్రపంచ దృష్టిని రాష్ట్రంపై నిలిపేదిగా భట్టి విక్రమార్క అభివర్ణించారు. ఈ ఎకనమిక్ సమ్మిట్ రాష్ట్ర ప్రయోజనాలకు ఎతంగానో ఉపయోగ పడుతుందన్నారు. ఎవరి స్థాయిలో వాళ్ళు సమ్మిట్ విజయవంతానికి సహకరించాలని భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు.

### హాజరు కానున్న ప్రముఖులు..

సమ్మిట్ మొదటిరోజున నోబెల్ పురస్కార గ్రహీత అభిజిత్ బెనర్జీ, శిశు హక్కుల కార్యకర్త కైలాశ్ సత్యార్థి, బిజినెస్ లీడర్ కిరణ్ మజుందార్, అమెరికా నుండి ట్రంప్ మీడియా అండ్ టెక్నాలజీస్ గ్రూప్ డైరెక్టర్ ఎరిక్ స్వేడర్, కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డి.కె. శివకుమార్, కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డితో పాటు రాష్ట్ర మంత్రులు పాల్గొని ప్రసంగిస్తారన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, తాను, మంత్రి శ్రీధర్ బాబు ప్రసంగిస్తామని చెప్పారు.

### 27 ప్రత్యేక సెషన్లు..

గ్లోబెల్ సమ్మిట్‌లో పలు శాఖలకు సంబందించిన మొత్తం 27 సెషన్లు జరుగనున్నాయని తెలిపారు. వీటిలో విద్యుత్, సెమీకండక్టర్లు, గ్రీన్ ఎనర్జీ, ఎరోస్పేస్, ఎడ్యుకేషన్ వంటి కీలక రంగాలపై చర్చలు జరుగుతాయని భట్టి విక్రమార్క చెప్పారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి 4 వరకు సెషన్‌లు ప్రారంభమవుతాయన్నారు. సెషన్ అంశానికి సంబంధించిన శాఖ మంత్రి, ఆ శాఖ ముఖ్యకార్యదర్శులు పాల్గొంటారన్నారు. 9వ తేదీ కూడా ఇలాగే సెషన్స్ ఉంటాయని చెప్పారు. ఉదయం 9 గంటలకు కార్యక్రమాలు మొదలవుతాయని, సాయ ంత్రం 6 గంటలకు ముగింపు కార్యక్రమం ఉంటుందన్నారు. ముగింపు కార్యక్రమంలో ఎవరెవరు పాల్గొంటారో తరువాత చెప్పుతామన్నారు.

### 6 ఖండాల నుంచి ప్రతినిధులు..

44 దేశాల నుండి 154 మంది ప్రతినిధులు పాల్గొంటున్నారని ఉప ముఖ్యమంత్రి వివరించారు. అందులో అమెరికా నుంచే 46 మంది రా వడం ప్రాధాన్యతను చాటుతోందన్నారు. రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలను ఈ కార్యక్రమానికి ఆహ్వానిస్తున్నామని చెప్పారు. స్వయంగా అధికారులే వెళ్లి వారిని ఆహ్వానించడం జరుగుతుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, తాను, సహచర మంత్రులు అందరం స్వయంగా వెళ్లి ముఖ్యులను ఆహ్వానించడం జరిగిందన్నారు. అన్ని రాష్ట్రాలకు సమాచారం ఉండాలని, అందరిని పిలవడం జరిగిందన్నారు.

### ఇండిగో సమస్యకు ప్రత్యామ్నాయాలు

ఎయిర్‌లైన్స్ సమస్యల నేపథ్యంలో ప్రతినిధులకు ఇబ్బంది లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు, అవసరమైతే ప్రత్యేక విమానాలు కూడా సిద్ధం చేస్తున్నామని భట్టి విక్రమార్క వెల్లడించారు. ఎయిర్ లైన్స్ సమస్యకు వెసులుబాటు కలుగుతుందనే ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు.

## మెడికల్ మాఫియా

(మొదటి పేజీ తరువాయి)

ఎక్కడికి వెళ్ళి తమ గోడు వెళ్లబోసుకోవాలి అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ పూర్తి లోపించడంతోనే ఈ మెడికల్ మాఫియా డాన్ దావూద్ శీనుగా మారి, తమ ఇష్టారాజ్యాన్ని కొనసాగిస్తూ, ప్రజల జీవితాలలో చెలగాటం ఆడుతోందని ఆరోపిస్తున్నారు. డాక్టర్ ప్రిస్కిప్షన్ లేకుండా మందులు అమ్మకూడదనే ప్రాథమిక నియమం కూడా ఇక్కడ అమలు కావడంలేదు. దీనివల్ల నిస్సహాయ ప్రజలు తప్పుడు వైద్యంతో ప్రాణాలు కోల్పోయే ప్ర మాదం ఏర్పడింది.ఇప్పటికైనా రాష్ట్ర డ్రగ్స్ కంట్రోల్ ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని,జిల్లా అధికారిపై చర్యలు తీసుకుని,మెడికల్ మాఫియాను అరికట్టాలని ప్రజలు డిమా ఒడ్ చేస్తున్నారు.

### కార్యాలయానికి తాళం.. మాఫియాకు అడ్డా..!

నిజానికి,ఈ పరిస్థితికి మూల కారణం డ్రగ్స్ కంట్రోల్ అధికారుల నిర్లక్ష్యమే మెడికల్ షాపుల యజమానులు తమ షాపులకు మందులు కొనుగోలు చేసేందుకు వచ్చే కస్టమర్లను కేవలం వ్యాపార దృష్టితో చూస్తూ,రోగిని మోసం చేసే విధంగా వ్యవహరించడం అలవాటుగా మార్చుకున్నారు.పర్యవేక్షణ లేకపోవడంతో ప్రిస్కిప్షన్ ఉన్న మందులను కూడా డాక్టర్ రాసినంత మోతాదులోనే అమ్మాలనే నిబంధనను కూడా పాటించడం లేదు. మందులు విక్రయించేటప్పుడు తప్పనిసరిగా రసీదు ఇవ్వాలనే చట్టాన్ని కూడా గాలికి వదిలేశారు.

### అనధికారిక వైద్యం.. ప్రజారోగ్యంతో చెలగాటం

ఈ ఉల్లంఘనల పరంపరలో అత్యంత ప్రమాదకరమైన విషయం ఏమిటంటే,అర్హత లేని వ్యక్తులు సైతం మెడికల్ షాపులు నడుపుతూ,డాక్టర్ మాదిరిగా రోగులకు మందులు ఇచ్చి చికిత్స అందిస్తున్నారు.వారికి తోచిన విధంగా రోగులకు మందులు ఇచ్చి,అమాయక రోగులను తప్పుదోవ పట్టిస్తున్నారు.దీనివల్ల చాలామంది అనారోగ్యం పాలవుతున్నారు.ప్రిస్కిప్షన్ లేకుండానే యథేచ్ఛగా యాంటీ బయాటిక్స్,నిద్రమాత్రలు,గర్భనిరోధక మందులు వంటి అత్యంత కీలకమైన మందులను సైతం అమ్ముతున్నారు.

### నకిలీ మందుల దందా..!

### ఆర్.పి.లేకుండానే వ్యాపారం..

కొంతమంది యజమానులు కంపెనీల నుంచి వచ్చే శాంపిల్స్‌ను,నాణ్యత లేని మందులను అధిక ధరలకుఅమ్ముతున్నారు.నాణ్యత లేని మందులను విక్రయిస్తున్నారసీదులు పనిచేయకపోతే రోగి ఎవరిని నిందించాలో తెలియని గందరగోళం ఏర్పడుతోంది.ముఖ్యంగా రిజిస్టర్డ్ ఫార్మసిస్ట్(ఆర్.పి) లేకుండానే కొన్ని షాపులు నడుస్తుండగా లెసెన్స్ ఒకరి పేరుపైఉండి, షాపును వేరొకరు నడుపుతున్నారు.


### ప్రజల డిమాండ్ .. తనిఖీలు చేపట్టాలి

డాక్టర్ ఫీజులు భరించలేక మెడికల్ షాపులను ఆశ్రయిస్తున్నపేదప్రజలఆరోగ్యం ఈ మాఫియా చేతిలో ప్రమాదంలో పడింది.ఇప్పటికైనా జిల్లా డ్రగ్స్ అధికారి వెంటనే తనిఖీలు చేసి,ఈ మెడికల్ మాఫియాను ఆరికట్టాలని, ప్రజారోగ్యాన్ని కాపాడాలని నిర్మల్ ప్రజలు తీవ్ర ఆవేదనతో వాపోతూ డిమాండ్ చేస్తున్నారు.

## ఎస్ఎల్‌బిసి పూర్తిచేస్తాం

(మొదటి పేజీ తరువాయి)

మాట్లాడారు. ఓటును ఆయుధంగా మార్చి గడీల పాలనను అంతమొందించి ప్రజా పాలన తీసుకొచ్చిన ప్రజానీకానికి ప్రజా ప్రభుత్వం అండగా ఉంటుందని అన్నారు. నిజాం నవాబు ప్రజలను పీడిస్తూ దోపిడీకి పాల్పడుతుంటే మట్టి మనుషులే మర ఫిరంగులై భూమి కోసం, భుక్తి కోసం,వెట్టిచారికి విముక్తి కోసం సాయుధ రైతాంగ పోరాటం చేసి నిజాంను తరిమికొట్టిన చరిత్ర నల్గొండ జిల్లా ప్రజలదని ఆయన అన్నారు. రావి నారాయణరెడ్డి, ఆరుట్ల కమలాదేవి, రామచంద్రారెడ్డి, దొడ్డి కొమురయ్య, చాకలి ఐలమ్మ, మల్లు స్వరాజ్యం లాంటి వ్యక్తుల జీవితం స్ఫూర్తిదాయకంఅనిఆయన అన్నారు. సోనియా గాంధీ త్యాగం, అంబేద్కర్ స్ఫూర్తితో ఆర్టికల్ 3 ప్రకారం తెలంగాణ సాధించామని సంక్షేమం అభివృద్ధి ప్రజాపాలనలో జోడెద్దుల వలె పాలన సాగుతుందని అన్నారు. పదేళ్ల బిఆర్ఎస్ కాలంలో రాష్ట్రంలో నూతనంగా ఏ ఒక్కరికి రేషన్ కార్డు ఇవ్వలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలో నూతన రేషన్ కార్డులు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదని అన్నారు. పేదలకు 200యూనిట్ల ఉచిత కరెంట్, సన్న బియ్యం, మహిళలకు వడ్డీ లేని రుణాలు, రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదని సిఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. గతంలో దొడ్డు బియ్యం ఇవ్వడం ద్వారా ప్రజలకు ఉపయోగంలేకుండా పోయి దళారులకు అమ్ముకునే వారని అలాంటి పేదల ఆకలి తీర్చేందుకు సన్నబియ్యం పథకం దేశానికి ఆదర్శం అని అన్నారు. ప్రధాని మోదీ బిజెపి ప్రభుత్వ రాష్ట్రాల్లో సైతం ఎక్కడ సన్న బియ్యం పథకం అమలు చేయడం లేదని అన్నారు.



2004 నుండి 2014 వరకు స్వర్గీయ వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయంలో 25 లక్షల ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వడం జరిగిందని, ప్రస్తుతం ప్రజా పాలనలో ప్రతి నియోజవర్గానికి 3500 ఇందిరమ్మ ఇండ్లు పేదలకు అందించడం జరగిందని, పేదల ఆత్మగౌరవానికి ఇందిరమ్మ ఇండ్లు ప్రతీక అని ఈ సందర్భంగా గుర్తు చేశారు. బిఆర్ఎస్ సమయంలో డబుల్ బెడ్రూం ఇండ్ల పేరుతో పదేళ్ల కాలాన్ని గడిపారే తప్పా ఏ ఒక్క ఊళ్లో కూడా ప్రజలకు డబుల్ బెడ్రూం ఇండ్లు ఇవ్వలేదని, కేసిఆర్, కేటీఆర్, హరీష్‌లు మాత్రం గడీలను నిర్మించుకున్నారని, పేదల పట్ల బిఆర్ఎస్ ప్రభుత్వానికి చిత్త శుద్ధి లేదని ఆయన అన్నారు. లంబాడీలకు రిజర్వేషన్లు కల్పించింది ఇందిరమ్మ అని గిరిజనుల మధ్య పంచాయతీ పెట్టే ఆలోచన కొందరు చేస్తున్నారని ప్రజా పాలనలో అలాంటి ఆటలు సాగవని అన్నారు. రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేసినగణతకాంగ్రెస్ ప్రభుత్వానిదని బిఆర్ఎస్ కాలంలో కేవలం వడ్డీలకే సరిపోయే విధంగా రుణమాఫీ చేసిందని కాంగ్రెస్ పార్టీ పూర్తి స్థాయిలో రుణమాఫీ చేసిన రైతు ప్రభుత్వంగా చరిత్ర సృష్టించిందని అన్నారు. కాంగ్రెస్ వస్తే కరెంట్ ఉండదని కేసీఆర్ అన్నారని రాష్ట్రంలో ఎక్కడ ఏ ఇంట్లో కూడా కరెంట్ పోవడం లేదని అది కాంగ్రెస్ పార్టీ కమిట్‌మెంట్ అని అన్నారు. కేసీఆర్ మాటలుములుగుడు మునపటవలె మందు మాత్రం ఎప్పటిలాగే అన్న చందంగా ఉన్నాయని ప్రజలు కేసీఆర్‌ను ప్రజలు ఎప్పుడో మరిచిపోయారని అన్నారు. రాష్ట్రంలో 8లక్షల కోట్ల అప్పులు బిఆర్ఎస్ అప్పు చేసిందని ప్రజలకు అర్థమై కేసీఆర్‌ను సాగనంపారని, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో సైతం బిఆర్ఎస్‌ను బండకేసి కొట్టారని కేటీఆర్ఉన్నన్నిరోజులుబిఆర్ఎస్‌కు గుదిబండెనని అన్నారు. ఆడబిడ్డలకు ఆర్టిసిలో ఉచిత ప్రయాణం, పావలా వడ్డీ, అద్దె బస్సులు, పెట్రోల్ బంకులు ఇచ్చి మహిళల ఆత్మగౌరవానికి ప్రజా పాలన అద్దం పడుతుందని అన్నారు. దేవరకొండలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, పాఠశాలకు అవసరమైననిధులుకేటాయిస్తానని, వెంకటేశ్వర స్వామి గుడికి నిధులు ఇస్తానని, నియోజకవర్గానికి నర్సింగ్ కళాశాల ఏర్పాటుకు హామీ ఇచ్చారు. నియోజకవర్గ అభివృద్ధికి మరిన్ని నిధుల కోసం త్వరలోనే మంత్రి సీతక్క, అట్లూరి లక్ష్మ ణ్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిలతో సమీక్ష చేసి నియోజకవర్గ అభివృద్ధికి రోడ్ల నిర్మాణానికి, 200పడుకల ఆసుపత్రి అప్డేట్ కోసం సమీక్షించనున్నట్లు తెలిపారు. మద్దిమడుగులో గిరిజనుల ఆరాద్య దైవం సేవాలాల్ విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. దేవరకొండ మునిసిపాలిటిలో 13 కోట్ల వ్యయంతో వివిధ వార్డులలో సిసి రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. మునిసిపాలిటిలోని 7,9,10 వార్డులలో రెండున్నర కోట్లతో మిగిలిపోయిన అండర్ గ్రౌండ్ డ్రైనేజి పనులకు శంకుస్థాపన చేశారు. 1నుండి 20 వార్డుల వరకు 50 లక్షల వ్యయంతో చేపట్టనున్న సిసి డ్రైన్లకు, రెండు కోట్ల వ్యయంతో ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ట్రాక్‌తో సహా అభివృద్ధి పనులకు, మరో రెండు కోట్ల వ్యయంతో 19వ వార్డులో బిఎన్ఆర్ పార్క్ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి 11కోట్ల 33లక్షల46వేల విలువ గల బ్యాంక్ లింకేజి చెక్కులను మహిళ సంఘాలకు అందజేశారు. రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి , ఎంఎల్‌పి బాలునాయక్, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి, ఎంఎల్‌ఏలు జయవీర్‌రెడ్డి, సామేలు, మధుసూధన్‌రెడ్డి, వంశీకృష్ణ, ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం, సిపిఐ రాష్ట్ర నాయకులు పల్లా నర్సింహారెడ్డి, అంజయ్యనాయక్, అమిత్‌రెడ్డి, సంస్కృతిక శాఖ సలహామండలి సభ్యులు పల్లె నర్సింహా, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు కైలాష్, నర్సింహారెడ్డి, సిరాజ్‌ఖాన్, పార్టీ ప్రజా ప్రతినిధులు, మండల అధ్యక్షులు, యువజన కాంగ్రెస్ నాయకులున్నారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## కేంద్రంపై కలిసికట్టుగా బిసి రిజర్వేషన్ల కోసం కొట్లాడుదాం

సాయి ఈశ్వరాచారి మృతి దురదృష్టకరం : మంత్రి పొన్నం ప్రభాకర్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కేంద్రం మీద అందరం కలిసి బిసి రిజర్వేషన్ కోసం కొట్లాడుదామని, ఛలో ఢిల్లీ కార్యక్రమం ద్వారా కేంద్ర ప్రభుత్వం దద్దరిల్లేలా 50 శాతం కోటా ఎత్తివేసేలా ఉద్యమించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. సాయి ఈశ్వరాచారి మృతి దురదృష్టకరమని, ఇలాంటి బలిదానాలు ఎవరూ చేసుకోవద్దని సూచించారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ద్వారా ఆదుకుంటామని చెప్పారు. కుల గణనకి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని, 50 శాతం రిజర్వేషన్ దాటరాదన్న కృష్ణమూర్తి కేసును కూడా సుప్రీంకోర్టులో సవాల్ చేయబోతున్నామని తెలిపారు. బలహీన వర్గాల సోషల్ జస్టిస్ విషయంలో కాంగ్రెస్ పార్టీ ఛాంపియన్ అని, తప్పని సరి పరిస్థితిల్లో గ్రామపంచాయతీ ఎన్నికలకి వెళ్లామని వివరించారు. ఎవరు ప్రేరేపించినా బిసిలు బలిపశువులు కావద్దన్నారు.

# అభివృద్ధి చెందిన దేశాలతో తెలంగాణ పోటీ

మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈనెల 8, 9 తేదీల్లో భారత్ ఫ్యూచర్ సిటీ వేదికగా నిర్వహించబోతున్న గ్లోబల్ సమ్మిట్ ప్రపంచంలోనే రోల్ మోడల్‌గా నిలుస్తుందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఫ్యూచర్ సిటీలో గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లను మంత్రి శనివారం పరిశీలించారు. అనంతరం మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ ఈ సమ్మిట్‌కు దేశవిదేశాల నుంచి అనేక రంగాల్లో విశేష గుర్తింపు పొందిన దిగ్గజాలను ఆహ్వానించడం జరిగిందన్నారు. గడిచిన రెండేళ్లలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో పాటు 2037 విజన్, 2047 విజన్ ఈ రెండు సెక్టార్లకు సంబంధించిన ప్రభుత్వ లక్ష్యాలు, ఆలోచనలను ఈ సమ్మిట్‌లో వివరించబోతున్నామని తెలిపారు. తెలంగాణ రాష్ట్రాన్ని భారత దేశంలోనూ, ప్రపంచ స్థాయిలో అగ్రస్థానంలో నిలిపేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌తో ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. 2035 నాటికి తెలంగాణ ఆర్థిక వ్యవస్థను ఒక ట్రిలియన్ డాలర్ ఎకానమీగా వృద్ధి సాధించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామని, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల లక్ష్యం సాధించాలని ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తుందన్నారు. సమ్మిట్‌పై ఇండిగో విమానాల రద్దు ప్రభావం ఏమాత్రం చూపదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దీనిపై ఎప్పటికప్పుడు వచ్చే అతిథులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పరిశీస్తున్నారని చెప్పారు.

# సమ్మిట్‌కు పలు రాష్ట్రాల సిఎంలకు ఆహ్వానం





## తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు గవర్నర్‌కు ఆహ్వానం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్ భారత్ ఫ్యూచర్ సిటీలో ఈ నెల 8, 9 తేదీలలో నిర్వహించనున్న 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్–2025'కు రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆహ్వానించింది. హైదరాబాద్ లోక్‌భవన్‌లో శనివారం గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు కలిసి గ్లోబల్ సమ్మిట్ ఆహ్వాన లేఖను అందించారు. ఈ సందర్భంగా సమ్మిట్ నిర్వహణ లక్ష్యాలను డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క గవర్నర్‌కు వివరించారు. కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణరావు పాల్గొన్నారు.

**మధ్యప్రదేశ్ సిఎం మోహన్ యాదవ్‌ను ఆహ్వానించిన మంత్రి తుమ్మల**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం భారత్ ఫ్యూచర్ సిటీలో ఈ నెల 8వ తేదీ నుంచి అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌లో పాల్గొనాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వం తరుపున వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్‌కు ఆహ్వానం అందజేశారు. మధ్యప్రదేశ్ సిఎంను ఆయన కార్యాలయంలో శనివారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలంగాణ రాష్ట్రం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, పెట్టుబడి అవకాశాలు, వివిధ రంగాల్లో రాష్ట్రం సాధించిన పురోగతిని మధ్యప్రదేశ్ సిఎంకు వివరించారు. దేశ–విదేశాల నుండి అనేక పరిశ్రమలు, పెట్టుబడిదారులు, నిపుణులు పాల్గొనబోతున్న ఈ గ్లోబల్ సమ్మిట్‌లో మధ్యప్రదేశ్ పాల్గొనడం రెండు రాష్ట్రాల మధ్య సహకార అవకాశాలను మరింత విస్తరిస్తుందని తెలిపారు. తెలంగాణ, మధ్యప్రదేశ్ రాష్ట్రాల అభివృద్ధి ప్రయాణంలో పరస్పర సహకారం కీలకమని, ఈ సమ్మిట్ ఆ దిశగా మంచి వేదిక కానుందని మంత్రి తుమ్మల పేర్కొన్నారు.

**పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీకి ఆహ్వానం**



ప్రభుత్వం ఈనెల 8, 9 తేదీల్లో నిర్వహించనున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ కార్యక్రమం ఆహ్వానానికి గాను తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ ఆహ్వానం అందుకోవడం ఎంతో గౌరవప్రదమైనదని ఆమె పేర్కొన్నారు. అయితే గ్లోబల్ సమ్మిట్ నిర్వహిస్తున్న తేదీల్లో తనకు ముందుగానే నిర్ణయించిన జిల్లా పర్యటనలు ఉండటం వల్ల, కార్యక్రమానికి హాజరు కాలేకపోతున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి తోడ్పడే విధంగా ఈ గ్లోబల్ సమ్మిట్ సార్థక చర్చలకు వేదికగా నిలిచి, రాష్ట్ర ఆర్థిక పురోగతికి కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశంగా మారాలని ఆమె ఆకాంక్షించారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ కార్యక్రమం ఘన విజయం సాధించాలని మమతా బెనర్జీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఆహ్వాన పత్రిక అందుకున్న అనంతరం మమతా బెనర్జీ తెలంగాణ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతూ లేఖ పంపారు. ఈ సందర్భంగా తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ కార్యక్రమం ఘన విజయం సాధించాలని ఆమె ఆకాంక్షించారు.

# రైతులకు రక్షణ కల్పించేలా విత్తన చట్టం

ఆ దిశగా కేంద్రం కొత్త చట్టం రూపొందించాలి : రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** విత్తన చట్టమంటే కేవలం మల్టీనేషనల్ కంపెనీలకు ఉపయోగపడే విధంగా కాకుండా రైతులకు రక్షణ కల్పించే చట్టమై ఉండాలని ఆ దిశగా కేంద్రం విత్తన చట్టం రూపొందించాలని తెలంగాణ వ్యవసాయ రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి డిమాండ్ చేశారు. ఇటీవల కేంద్రం విడుదల చేసిన విత్తన చట్టం 2025 ముసాయిదాపై శనివారం రైతు కమిషన్ కార్యాలయంలో విత్తన కంపెనీలతో సమీక్ష సమావేశం జరిగింది. రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి అధ్యక్షతన రిగిన ఈ సమావేశంలో హాజరైన కమిషన్ సభ్యులు కెవిఎన్ రెడ్డి, రాములు నాయక్, భవాని రెడ్డి, హార్టికల్చర్ యూనివర్సిటీ విసి రాజిరెడ్డి, సీడ్ కంపెనీల ప్రతినిధులు, వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ అధికారులు. వ్యవసాయ రంగ నిపుణులు, కమిషన్ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర విత్తన చట్టంలోని చేర్చిన అంశాలతో రైతులకు లాభనష్టాలు ఆలోచనలపై సమీక్షించడంతోపాటు విత్తన కంపెనీల ప్రతినిధుల అభిప్రాయాలను కమిషన్ సేకరించారు. ఈ సందర్భంగా రైతు కమిషన్ కోదండరెడ్డి మాట్లాడుతూ కేంద్రం తెస్తున్న విత్తన చట్టం రైతులకు ఏమాత్రం ఉపయుక్తంగా లేదని కేవలం మల్టీనేషనల్ విత్తన కంపెనీల కోసమే అన్నట్లుగా వుందని, సీడ్ కంపెనీలు సైతం ఇదే అభిప్రాయం వ్యక్తం చేశారన్నారు. ఇప్పటికే ఈనెల 2వ తేదీన వివిధ రాజకీయ పార్టీల నేతలు, వ్యవసాయ రంగ నిపుణులు, అధికారులు, శాస్త్రవేత్తలు, రైతు సంఘాల నాయకులు, రైతులతో నిర్వహించిన సమావేశంలో కేంద్రం తెస్తున్న చట్టంపై చాలావరకు అభ్యంతరాలు వ్యక్తమయ్యాయని తెలిపారు. దేశంలోనే విత్తనోత్పత్తికి తెలంగాణ కేంద్రంగా వుంది ప్రపంచదేశాలకు తెలంగాణ విత్తనం ఎగుమతి అవుతోందన్నారు. కేంద్రం తీసుకువస్తున్న విత్తన చట్టంలో మార్పులు చేర్పులు చేయాల్సిందేనన్నారు. తెలంగాణలో విత్తన కంపెనీల తీరుపై సమావేశంలో చర్చకు రాగా సీడ్ కంపెనీలు కూడా వారి లోపాలను సవరించుకుంటామని హామీ ఇచ్చారన్నారు. రైతుకు నష్టం లేకుండా చట్టం ఉండాలని, కంపెనీలు కూడా చెబుతున్నాయన్నారు. ఆర్గనైజర్ల వ్యవస్థ వల్ల రైతులకు కంపెనీలకు కూడా నష్టమేనని నిర్ధారణకు వచ్చారని, కానీ లక్షలాది మంది రైతుల వద్దకు నేరుగా కంపెనీ వెళ్లలేని పరిస్థితుల్లో ఈ ఆర్గనైజర్లు వచ్చారని తెలిపారు. నకిలీ విత్తనం విషయంలో రైతులకు నష్టపరిహారం అందించకుండా ఈ కేంద్రం తెస్తున్న చట్టంలో స్పష్టత లేదని, రైతులు కోర్టులను ఆశ్రయించాలంటే.. వారికి ఎప్పుడు న్యాయం జరుగుతుందో తెలియదని పేర్కొన్నారు. విత్తన కంపెనీలకు అనుమతులు ఇవ్వడం, ధర నిర్ధారణ అంత రాష్ట్ర పరిధిలోనే ఉండాలని, కానీ కేంద్రం తెస్తున్న చట్టం ప్రకారం కేంద్రం చేతుల్లోనే ఉండనుందన్నారు. ఈనెల 11న వరకు కేంద్రం విత్తన చట్టంపై అభ్యంతరాలు తెలపడానికి గడువు ఉండడంతో కమిషన్ తరుపున.. కేంద్రానికి, రాష్ట్రానికి విత్తన చట్టంపై అభ్యంతరాలను పంపనున్నట్లు కోదండరెడ్డి తెలిపారు.

# మోదీ దేశ చరిత్రను మార్చేలా కుట్రలు

టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ తూర్పు జయప్రకాష్ రెడ్డి (జగ్గారెడ్డి)



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రధాని మోదీ దేశ చరిత్రను మార్చే కుట్రలు చేస్తున్నారని, అందులో భాగంగానే దేశంలో నెహ్రూ, గాంధీ కుటుంబాల త్యాగాలు ఉండొద్దని విషపూరిత ప్రచారం చేస్తున్నారని టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ తూర్పు జయప్రకాష్ రెడ్డి (జగ్గారెడ్డి) ఆగ్రహం వ్యక్తం చేశారు. మంచిని మంచి అనలేని వ్యక్తి ప్రధానిగా ఉండడం దురదృష్టకరమన్నారు. గాంధీభవన్‌లో శనివారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశ స్వతంత్రం కంటే ముందు రాజకీయాలు లేవని, బానిసలుగా ప్రజలు ఉండొద్దు అనేది సింగిల్ అజెండాగా స్వతంత్ర ఉద్యమం నిర్వహించారన్నారు. స్వతంత్రం వచ్చిన తర్వాత పుట్టిన పార్టీ బిజెపి, మోడీ ప్రధాని కావడానికే పని చేశారని, కానీ నెహ్రూ ప్రధాని కావడానికి స్వంతంత్ర పోరాటం చేయలేదని, మోదీ అబద్ధాలు చెప్పి నెహ్రూ చరిత్రను మార్చలేరన్నారు. నెహ్రూ, రాహుల్ గాంధీ కుటుంబం ఉనికి రాజకీయాల్లో ఉండకూడదని మోదీ దుర్మార్గమైన ఆలోచన చేస్తున్నారన్నారు. నెహ్రూ, ఇందిరా గాంధీపై ప్రధాని మోదీ ఎన్ని సార్లు విమర్శ చేసినా, వారికి ఉన్న చరిత్ర బిజెపికి లేదని, భవిష్యత్‌లో రాదని అన్నారు. నెహ్రూ పరిపాలనలో అందించిన మంచి పనిని మంచి అనే చెప్పే గుణం బిజెపికి లేకపోవడం దురదృష్టకరమన్నారు. దేశ ప్రజలకు 56 ఏళ్ళ కాంగ్రెస్ పరిపాలనలో చేసిన వందల అభివృద్ధి పనులు తాము చెప్పగలమని, 11 ఏళ్ల ప్రధాని మోదీ ఏం అభివృద్ధి చేశారో చెప్పగలరా? అని ఆయన ప్రశ్నించారు. మోదీ మాదిరాగా చోరీ ఓట్లతో నెహ్రూ ప్రధాని కాలేదని, ప్రజల మద్దతుతో ప్రధాని అయ్యారన్నారు. దేశ భద్రతకు ఆహార భద్రత ఇచ్చిన గొప్ప నాయకుడు నెహ్రూ అని, దేశ ప్రజలకు మూడు పూటల అన్నం పెట్టడమే కాదు పొరుగు దేశాలకు కూడా ధాన్యం అందించిన చరిత్ర నెహ్రూదన్నారు. స్వాతంత్ర ఉద్యమంలో మోదీ, బిజెపి పాత్ర ఏముందని ప్రశ్నించారు. బిజెపి సింగిల్ అజెండా రామాలయమని, కానీ రాముడు మాదిరిగా బిజెపి ఆదర్శవంతమైన పాలన చేయడంలేదన్నారు. అయోధ్యలో రామాలయం నిర్మించామని చెప్పడం తప్పితే మోదీ దేశానికి ఏం చేయలేదన్నారు.

# గ్లోబల్ సమ్మిట్‌లో పాల్గొనండి

హర్యానా సిఎం, కేంద్రమంత్రికి ఆహ్వానం





**ప్రజాపక్షం/హైదరాబాద్/కరీంనగర్ :** తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్– 2025కు ఆహ్వానాల కార్యక్రమంలో భాగంగా, రాష్ట్ర ఎస్‌సి, ఎస్‌టి, దివ్యాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్ శనివారం హర్యానా, పంజాబ్ రాష్ట్రాలను సందర్శించారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు రావాల్సిందిగా హర్యానా ముఖ్యమంత్రి నయాబ్ సింగ్ షైనీ, పంజాబ్ రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి హర్‌పాల్ సింగ్‌కు మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్ ఆహ్వానాలను అందజేశారు. ఈ సందర్భంగా సమ్మిట్ ప్రాముఖ్యత, తెలంగాణ భవిష్యత్ అభివృద్ధి పథం, పెట్టుబడుల అవకాశాలు, రాష్ట్రాల మధ్య సహకార వేదిక వంటి కీలక అంశాలపై ఇరు రాష్ట్రాల నాయకులతో విస్తృతంగా చర్చించారు. తెలంగాణ అభివృద్ధి వేగం, పెట్టుబడులను ఆకర్షించే దూరదృష్టి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో వెలుగు చూస్తున్న కొత్త అవకాశాలను హర్యానా సిఎం ఈ సందర్భంగా ప్రశంసించారు.

**కేంద్ర మంత్రి సంజయ్‌కి మంత్రి పొన్నం ప్రభాకర్ ఆహ్వానం**

రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీలు అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని, తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు హాజరు కావాలని కోరుతూ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కి రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆహ్వానపత్రిక అందజేశారు. కరీంనగర్‌లో శనివారం బండి సంజయ్‌ని కలిసి ఆహ్వానించారు. అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ మీడియాతో మాట్లాడుతూ రైజింగ్ 2040 విజన్‌తో భారతదేశంలో తెలంగాణను అగ్రగామిగా నిలుపుతామని తెలిపారు. పెట్టుబడులు, పారిశ్రామిక అభివృద్ధి సమ్మిట్ ద్వారా సాధిస్తామని చెప్పారు. గత పదేళ్లలో తెలంగాణ ఆర్థికంగా వెనుకబడిందని, అభివృద్ధి విషయంలో కేంద్రం సహకరించాలని కోరారు. పక్క రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌కు ఎక్కువ నిధులు ఇస్తోందని, కేంద్రం అన్ని రాష్ట్రాలను సమానంగా చూడాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, మానకొండూరు ఎంఎల్‌ఎ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, కరీంనగర్ నగర కాంగ్రెస్ అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్ పాల్గొన్నారు.

# కార్పొరేట్ విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలి

డిహెచ్‌పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కార్పొరేట్ విధానాలకు వ్యతిరేకంగా నిరంతరం సామాజిక ఉద్యమ శక్తులు పోరాటాలకు సిద్ధం కావాలని డిహెచ్ పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్ పిలుపునిచ్చారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 69 వర్ధంతి సందర్భంగా హిమాయత్‌నగర్‌లో వై జంక్షన్‌లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా డిహెచ్‌పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి జైరుపోతుల కుమార్, కె.మారుతితో కలిసి నివాళ్లు అర్పించారు. అనంతరం మారూపాక అనిల్ కుమార్ మాట్లాడుతూ అంబేద్కర్ ఆశించిన కులరహిత సమాజాన్ని సాధించడానికి నేటితరం సమరానికి సిద్ధం కావాలని, అదే అంబేద్కర్‌కు కల్పించే నిజమైన నివాళి అని అన్నారు. మోదీ ప్రభుత్వం రాజ్యాంగ మౌలిక పునాదులపై దాడి చేస్తూ రాజ్యాంగ నిర్మితమైన స్వతంత్ర సంస్థలను తమ జేబు సంస్థలుగా మార్చుకుంటుందని విమర్శించారు. దేశభక్తి ముసుగులో ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటు కార్పోరేట్ శక్తులకు ధారాదత్తం చేస్తూ అడవులన్నింటినీ అదానీకి అప్పగించడానికి ప్రయత్నం చేస్తుందన్నారు.

# అంబేద్కర్ కలలను ధ్వంసం చేస్తున్న మోదీ ప్రభుత్వం

ఈటి నరసింహ



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం బి.ఆర్.అంబేద్కర్ కన్న కలలను ధ్వంసం చేస్తోందని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈటి నరసింహ అన్నారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 69వ వర్ధంతి సందర్భంగా హైదరాబాద్‌లోని లోయర్ ట్యాంక్‌బండ్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి సిపిఐ హైదరాబాద్ కౌన్సిల్ ఆధ్వర్యంలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈటి నరసింహ, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు ఛాయాదేవి సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి స్టాలిన్ జిల్లా కార్యవర్గ సభ్యులు నెర్లకంటి శ్రీకాంత్, కౌన్సిల్ సభ్యులు నరేష్ గ్యార, అనిల్ కుమార్, నాయకులు ఉప్పల ఉదయ్ కుమార్, రాజు ,అరవింద్, పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా ఈటి నరసింహ మాట్లాడుతూ రంగాల్లో విస్తృతంగా కృషి చేసిన అపర మేధావి బాబాసాహెబ్ అంబేద్కర్ అని, ఆయనను కేవలం రాజ్యాంగ రచనకే పరిమితం చేయటం సముచితం కాదని అన్నారు. నేడు అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను రద్దుచేసి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చి కార్మిక హక్కులను కాల రాయడమే కాకుండా కాలం చెల్లిన 12 గంటల విధానాన్ని తిరిగి తీసుకువస్తూ కార్మికులను యాజమాన్యాలు మరింత దోపిడీ చేసుకోవడానికి బిజెపి ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికులు సమ్మెలు చేయటానికి వీలు లేకుండా, సంఘాలు పెట్టడానికి అవకాశం లేకుండా కేంద్ర ప్రభుత్వం చట్టాలు తీసువచ్చిన ఈ చట్టాలకు వ్యతిరేకంగా ఉద్యమాలు కొనసాగించాలని ఆయన పిలుపునిచ్చారు.

# ఘనంగా గుమ్మడి నర్సయ్య బయోపిక్ సినిమా ప్రారంభం

హాజరైన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని



**ప్రజాపక్షం/పాల్వంచ :** పాల్వంచ వాసి నల్లా సురేష్ నిర్మాతగా ప్రవల్లిక ఆర్ట్ క్రియేషన్ ఆధ్వర్యంలో కన్నడ సూపర్ స్టార్ శివరాజ్ కుమార్ కథానాయకుడిగా, దర్శకుడు పరమేశ్వర్ సారథ్యంలో పానిండియా స్థాయిలో నిర్మిస్తున్న ఇల్లందు నియోజకవర్గం నుండి ఐదుసార్లు ఎన్నికైన మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య బయోపిక్ సినిమా షూటింగ్ పాల్వంచలో శనివారం మొదలైనది. పాల్వంచకు చేరుకున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కథానాయకుడు శివరాజ్‌కుమార్, గుమ్మడి నర్సయ్యలు పెద్దమ్మతల్లి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం హెచ్ కన్వన్షన్ హాల్‌కు చేరుకొని సినిమా పూజా కార్యక్రమాలను నిర్వహించి క్లాప్ కొట్టి షూటింగ్‌ను లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీ నుండి ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి సాధారణ జీవితం గడుపుతున్న గుమ్మడి నర్సయ్య జీవిత చరిత్ర ఆధారంగా నిర్మిస్తున్న గుమ్మడి నర్సయ్య సినిమా విజయవంతం కావాలని ఆకాంక్షించారు. దేశంలో ఒక్కసారి ప్రజా ప్రతినిధిగా ఎన్నికైన వారు కోట్లకు పడగలెత్తుతున్నారని, కానీ గుమ్మడి నర్సయ్య ఎపుడూ ప్రజల మనిషిగానే ఉన్నారని, పేద ప్రజల సమస్యల పరిష్కారానికి నిస్వార్థంగా అనునిత్యం పాటుపడుతుంటారని అన్నారు. అవినీతికి, ఆడంబరాలకు, ఆర్భాటాలకు దూరంగా సాదాసీదాగా ఉంటున్నారని అన్నారు. నాడు, నేడు ఆయన వాహనం సైకిల్ మాత్రమేనన్నారు. వారసత్వంగా వచ్చిన భూమిని సాగు చేసుకొని జీవనం సాగిస్తున్న గుమ్మడి నర్సయ్య ఆదర్శ నాయకుడన్నారు. అందుకే ఆయన ప్రజల మనిషిగా నిలబడ్డారని కొనియాడారు. వారి జీవిత చరిత్ర ఆధారంగా తెరకెక్కుతున్న సినిమా నేటితరం నాయకుల్లో మార్పు తెస్తుందని ఆకాంక్షించారు.

**సాధారణ జీవితం కమ్యూనిస్టుకే సాధ్యం :** అపుడు, ఇప్పుడూ, ఎల్లప్పుడూ కమ్యూనిస్టు నాయకులకు మాత్రమే సాధారణ జీవితం సాధ్యమని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. కమ్యూనిస్టులు ఉన్నత విలువలు పాటిస్తారని అన్నారు. మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్య జీవిత చరిత్ర ఆధారంగా తెరకెక్కిస్తున్న సినిమా నిర్మాత పాల్వంచకు చెందిన నల్లా సురేష్‌రెడ్డికి ధన్యవాదములు తెలిపారు. ఐదుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన గుమ్మడి నరసయ్య సామాన్యుల్లో సామాన్యుడిగా తన జీవితాన్ని గడుపుతున్నారని అన్నారు. అదేవిధంగా ఆయన కమ్యూనిస్టు పార్టీకి చెందిన వాడు కాబట్టి ఉన్నత విలువలను కలిగి ఉన్నారన్నారు. కమ్యూనిజం ఎపుడూ మనుషులను మహోన్నతులుగా తయారుచేసే సిద్దాంతమన్నారు. ఏ కమ్యూనిస్టు నాయకుడిని తీసుకొన్నా సరే వారి జీవితాలు సాధారణంగా, ఆదర్శంగా ఉన్నాయని తెలిపారు. ప్రజా పోరాటంలో మరణించిన హిడ్మా తంబాల కేశవరావు, సుధాకర్‌రెడ్డి సీతారాం ఏచూరిలు ఇలా చాలా మంది నాయకులు వేల లక్షల ప్రజల అభిమానం చూరగొన్న వారు కేవలం కమ్యూనిస్టులేనన్నారు. కమ్యూనిజం ఎక్కడుందని అడిగితే గుమ్మడి నరసయ్య నిదర్శనమన్నారు. కమ్యూనిస్టు కాబట్టే అందరికి ఆదర్శంగా ఉండగలుగుతున్నాడని పేర్కొన్నారు. తమిళనాడులో అగ్ర కథానాయకుడు గుమ్మడి నరసయ్య జీవిత చరిత్ర సినిమాలో నటించడం శుభ పరిణామమన్నారు. ఈ సినిమా రానున్న తరాలకు, నాయకులకు స్ఫూర్తిదాయకంగా ఉండాలని ఆకాంక్షించారు. అశ్వారావుపేట, ఇల్లందు, పినపాక ఎమ్మెల్యేలు జారె ఆదినారాయణ, కోరం కనకయ్య, పాయం వెంకటేశ్వర్లు, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే.సాబీర్ పాషా, జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత, మల్లు నందిని, టిపిసిసి జనరల్ సెక్రటరి నాగా సీతారాములు, కోనేరు చిన్ని తదితరులు పాల్గొన్నారు.


గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్
GHMC
సూపరింటెండింగ్ ఇంజనీర్ కార్యాలయం, శేరిలింగంపల్లి జోన్ : జిహెచ్‌ఎంసి.
మెయిల్: sew.ghmc@gmail.com సెల్ నెం. 7331186858, 9154172331
'ఇ' ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన
NIT No.39/SE/SLPZ/GHMC/2025-26 తేది: 06.12.2025
పని పేరు: (02 ఐటమ్స్) జిహెచ్‌ఎంసి, ఎస్‌ఎల్‌పిజెడ్, సర్కిల్-21 & సర్కిల్-22లో కమ్యూనిటీ హాల్ నిర్మాణం & సిసి, బిటి రోడ్లు వేయడం. అంచనా వ్యయం / ఇసివి: రూ.335.00 లక్షలు, బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది & సమయం: 08.12.2025న మ.1.00గం.ల నుండి 15.12.2025న మ.1.30గం.ల వరకు & 08.12.2025న మ.1.00గం.ల నుండి 22.12.2025న మ.1.30గం.ల వరకు. అధికారి పేరు & చిరునామా: ఎస్ఇ, ఎస్‌ఎల్‌పిజెడ్, జిహెచ్‌ఎంసి. సెల్ నెం. 7331186858.
సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్, శేరిలింగంపల్లి జోన్ : జిహెచ్‌ఎంసి.
DIPR R.O. No. : 11785-PP/CL/ADVT/1/2025-26, Date: 06-12-2025



గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ :: సర్కిల్-2, ఉప్పల్.
GHMC
టెండర్ ప్రకటన
NIT No.23/EEC-2/UPL/GHMC/2025-26 తేది: 06.12.2025
పని పేరు: 4 పనుల కోసం "జిహెచ్‌ఎంసి, ఉప్పల్ సర్కిల్-2, చిల్కానగర్, వార్డ్ నెం.7 లోని వివిధ ప్రదేశాలలో క్యాచ్‌పిట్ మరమ్మతులు, పోహోల్స్ మరియు ప్యాచ్‌లతో సహా అత్యవసర మరమ్మతు పనులకు హాజరు కావడం................ జిహెచ్‌ఎంసి, ఉప్పల్ సర్కిల్-2, ఉప్పల్, వార్డ్ నెం.10 లోని వివిధ ప్రదేశాలలో క్యాచ్‌పిట్ మరమ్మతులు, పోహోల్స్ మరియు ప్యాచ్‌లతో సహా అత్యవసర మరమ్మతు పనులకు హాజరు కావడం." అంచనా వ్యయం : రూ. 22.40 లక్షలు, బిడ్స్ స్వీకరణకు ఆఖరి తేది & సమయం: 15.12.2025న మ.3.00గం.ల వరకు. అధికారి పేరు & చిరునామా: శ్రీ వి.హరిలాల్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఉప్పల్ డివిజన్ నెం.2, జిహెచ్‌ఎంసి. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా http://www.Tender.telangana.gov.inలో చూడవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్-2, ఉప్పల్, జిహెచ్‌ఎంసి.
DIPR R.O. No. : 11775-PP/CL/ADVT/1/2025-26; Date: 06-12-2025

## అంబేద్కర్‌కు ఘన నివాళులు



ప్రజాపక్షం/చింతలపాలెం : మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద మహానాయకుడు, భారత రాజ్యాంగ శిల్పి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా స్థానిక నాయకులు, ప్రజలు కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా నాయకులు ఉస్తెల నారాయణరెడ్డి మాట్లాడుతూ అసమానతల నిర్మూలన, సమాన హక్కులు, విద్య, వెలుగు, సామాజిక న్యాయం కోసం మహత్తర పోరాటాలు చేసిన నాయకుడన్నారు. పేదలు, వెనుకబడిన వర్గాల అభివృద్ధికి అంబేద్కర్ చూపిన మార్గంలోనే ముందుకు సాగాలని కోరారు. ఈ కార్యక్రమంలో మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు సృజన, సిపిఐ మండల కార్యదర్శి రవి, మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మోర్తాల సీతారెడ్డి, శివాలయం చైర్మన్ రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

## 75 మంది బైండోవర్



ప్రజాపక్షం/మునగాల: మండలంలోని మాధవరం, రేపాల, సీతానగరం, గణపవరం, కలకోవ, జగన్నాధపురం, నర్సింహులగూడెం గ్రామాలకు చెందిన వివిధ పార్టీల సర్పంచుల అభ్యర్ధులు, వార్డు మెంబర్‌కు పోటీ చేసినఅభ్యర్థులు, పలు పార్టీల ముఖ్య నాయకులు దాదాపు 75 మందిని తహసిల్దార్ కార్యాలయంలో తహసిల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు మునగాల ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. రాబోయే గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఎలాంటి గొడవలు, అల్లర్లు చేయకుండా శాంతిభద్రతలకు విఘాతం కలిగించకుండా శాంతియుతంగా ఎన్నికలను నిర్వహించుకునేలా తహసిల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు తెలిపారు. ఏదైనా గొడవలు జరిగిన కేసుకు వెళితే ఒక్కొక్కరికి ఐదు లక్షల రూపాయలు ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంటుందని అన్నారు.



## మూడో విడతకు ముందస్తు ఏర్పాట్లు

### సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ : మూడో విడత గ్రామ పంచాయతీ ఎన్నికల పోలింగ్‌కు అన్ని రకాల ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ తెలిపారు. శనివారం జిల్లా కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లాలోని ఆర్‌డిఓలు, తహశీల్దార్లు, ఎంపిడిఓలు, ఎలక్షన్ స్పెషల్ ఆఫీసర్లతో కలెక్టర్ వెబెక్స్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చివరి విడత గ్రామ పంచాయతీ ఎన్నికల పోలింగ్ సందర్భంగా ఎలక్షన్ విధులు కేటాయించిన సిబ్బంది సర్పంచ్ వార్డు సభ్యుల స్క్రూటినీ, ఉపసంహరణ అనంతరం పోలింగ్‌కు సక్రమమైన ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. పోలింగ్ స్టేషన్‌లలో మౌళిక సదుపాయాలు చూసుకోవాలని అలాగే ఫెసిలిటేషన్ సెంటర్లు, డిస్ట్రిబ్యూషన్ సెంటర్లు, మెటీరియల్ పంపిణీ, వాహనాల ఏర్పాట్లు చేసుకోవాలని పోస్టల్ బ్యాలెట్‌కు సంబంధించి స్టేజి 1, ఆర్‌ఓలు 37 ఏ రిజిస్టర్‌లో సర్వీస్ ఓటర్ల వివరాలు నమోదు చేయాలన్నారు. స్టేజి 2 ఆర్‌ఓలు 37 సి రిజిస్టర్‌లో ఎన్నికల్లో విధులు నిర్వహించే వారి వివరాలు తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. రిటర్నింగ్ అధికారులు సంబంధిత గ్రామ పంచాయితీలోని పోలింగ్ కేంద్రాలను సందర్శించి అన్ని మౌళిక వసతులు ఉన్నాయా లేవో పరిశీలించాలని అలాగే పోలింగ్ తరువాత ఓట్లను కౌంటింగ్ చేయుటకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కె సీతారామారావు, డిపిఓ యాదగిరి, డిఆర్‌డిఏ పిడి అప్పారావు, డివిజనల్ పిఓ నారాయణరెడ్డి పాల్గొన్నారు.

## మాలిలో బండసోమారం యువకుడి కిడ్నాప్

### ఆందోళనలో కుటుంబ సభ్యులు



ప్రజాపక్షం/భువనగిరి రూరల్ : ఉపాధి కోసం ఆఫ్రికా ఖండానికి వెళ్లిన భువనగిరి మండలానికి చెందిన యువకుడు కిడ్నాప్‌కు గురయ్యాడు. బండ సోమారం గ్రామానికి చెందిన నల్లమాస జంగయ్య, మహేశ్వరీల చిన్న కుమా రుడు ప్రవీణ్ ఏడాది క్రితం హైదరాబాద్లోని బోర్ వెల్ కంపెనీలో పనిలో చేరాడు. అక్కడి నుండి కంపెనీ ద్వారా ఆఫ్రికా ఖండంలోని మాలి దేశానికి వెళ్లాడు. అక్కడే కోబ్రి సమీపంలో బోర్వెల్‌కు సంబంధించిన డ్రిల్లర్ గా పనిచేస్తున్నాడు. గత నెల 23న పని ముగించుకుని వస్తుండగా జమాత్ నుస్రత్ అల్ ఇస్లామ్ వల్ముస్లిమీన్ సంస్థకు చెందిన తీవ్రవాదులు అతడిని కిడ్నాప్ చేశారు. కుటుంబ సభ్యులకు సమాచారం ఆలస్యంగా తెలియడంతో ఆందోళన చెంది భారత రాయబార అధికారులతో సంప్రదింపులు చేస్తున్నట్లు సమాచారం. నిందితుల నుంచి తమ కుమారుడిని విడిపించి, ఇండి యాకు తీసుకురావాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

## 21న జాతీయ లోక్ అదాలత్




ప్రజాపక్షం/వలిగొండ : 21న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకునేలా, పరిష్కార మార్గం చూపాలని రామన్నపేట సర్కిల్ పరిధిలోని పోలీసు అధికారులతో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ఎస్.శిరీష సమక్షంలో సెకెండ్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు జడ్జి దంతూరి సత్తయ్యతో కలిసి సమన్వయ సమావేశం నిరహించారు. ఈ సమావేశంలో జడ్జీ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న కేసులు వేగవంతంగా పరిష్కారం అయ్యేలా అన్ని విభాగాల అధికారులు, న్యాయవాదులు, సంబంధిత సిబ్బంది సమన్వయంతో పని చేయాలని సూచించారు. లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరించుకోవడానికి కక్షిదారులకి అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎన్.వేంకటేశ్వర్లు, రామన్నపేట, వలిగొండ, ఎస్ఐలు డి.నాగరాజు, యుగేందర్ గౌడ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## హత్యాయత్నం కేసులో ముగ్గురు నిందితులు అరెస్టు : రిమాండ్

ప్రజాపక్షం/మునగాల: హత్యాయత్నం కేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు మునగాల సిఐ రామకృష్ణారెడ్డి తెలిపారు. శనివారం కేసు వివరాలను పత్రిక ప్రకటనలో వెల్లడించారు. తాడ్వాయి గ్రామానికి చెందిన లొండగి వెంకయ్య అనే వ్యక్తి మునగాల గ్రా మానికి చెందిన కుప్పిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సుమారు 8 సంవత్సరాల క్రితం మూడు లక్షల రూపాయలు అప్పుగా ప్రామిసర్ నోట్ రా యించి తీసుకున్నాడు. ఆ నగదును ప్రభాకర్‌రెడ్డి తిరిగి ఇవ్వకపోవడంతో లోడంగి వెంకయ్య సివిల్ కోర్టులో అతడి ఆస్తుల అటాచ్‌మెంట్ కోసం కేసు వేశాడు. ఆ తర్వాత ప్రభాకర్‌రెడ్డి చనిపోవడంతో అతని కుమారుడు కుప్పిరెడ్డి నవీన్‌రెడ్డికి సంబంధించిన ఆస్తులు అమ్ముకోవడానికి, లోన్ తీసుకోవడానికి వీలు లేకుండా పోయింది. దీంతో కుప్పిరెడ్డి నవీన్‌రెడ్డి లోడంగి వెంకయ్యను హతమార్చాలని ప్లాన్ వేసుకున్నాడు. అందుకు అతడి స్నేహితులు తాడ్వాయి గ్రామానికి చెందిన కోట అంజి, మునగాల గ్రామానికి చెందిన చెల్లోజు గోపి ల సహకారంతో ఈనెల 2వ తేదీ సాయంత్రం మునగాలలో ఎన్నికల నామినేషన్ సెంటర్ దగ్గర ఉన్నవెంకయ్య ఉన్నాడని సమాచారం తెలుసుకుని కోట అంజి ద్వారా వెంకయ్యను పిలిపించి ఆ తరవాత అతడిని బలవంతంగా కారులో ఎక్కించుకుని ముకుందాపురం గ్రామం దాటుతుండగా వెంకయ్యపై నవీన్‌రెడ్డి తనతో తెచ్చుకున్న కత్తిని అతడి చాతి మీద, కుడిచేతి మీద పోడిచి హత్య ప్రయత్నం చేశాడు. దాంతో వెంకయ్యకు తీవ్ర గాయాలు కాగా, రక్తంతో తడిసిన వెంకయ్య శరీరంపై ఉన్న బట్టలు మార్చి, ఆత ర్వాత వెంకయ్యను ప్రథమ చికిత్స చేయించి సూర్యాపేట ప్రభుత్వాసుపత్రి ముందు వెంకయ్యను వదిలేసి వెళ్లిపోయారు. తరవాత బట్టలు మునగాల పెద్ద కాలువలో పడవేశారు. వెంకయ్య చికిత్స అనంతరం తన బంధువుల ద్వారా స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయగా నిందితులపై కిడ్నాప్ హత్యప్రయత్నం కేసు నమోదు చేసినట్లు తెలిపారు. శనివారం ఉదయం నిందితులు కుప్పిరెడ్డి నవీన్‌రెడ్డి, కోట అంజి, చెల్లోజు గోపి లను మునగాల సిఐ రామకృష్ణారెడ్డి, ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ లు సిబ్బందితో కలిసి నవీన్‌రెడ్డి ఇంటిలో ఉన్న ముగ్గురుని అదుపులోకి తీసుకుని వారి నేరానికి వాడిన కారు, కత్తిని స్వాధీనం చేసుకుని నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

# ఎన్నికల్లో మైక్రో అబ్జర్వర్స్ పాత్ర కీలకం

### ఎన్నికల జిల్లా సాధారణ పరిశీలకులు రవి నాయక్



ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ : గ్రామ పంచాయితీ ఎన్నికల్లో మైక్రో అబ్జర్వర్స్ పాత్ర చాలా కీలకమైనదని జిల్లా సాధారణ ఎన్నికల పరిశీలకులు జి రవి నాయక్ అన్నారు. శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సూక్ష్మ పరిశీలకులు, జోనల్ ఆఫీసర్ శిక్షణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో 3 విడతలలో జరుగనున్న గ్రామ పంచాయితీ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందన్నారు. ఎన్నికల్లో సూక్ష్మ పరిశీలకుల పాత్ర కీలకమన్నారు. ఒకరోజు ముందుగానే సూక్ష్మ పరిశీలకులు పోలింగ్ స్టేషన్‌కు చేరుకొని పోలింగ్ కేంద్రాన్ని సూక్ష్మంగా పరిశీలించి ఎన్నికలు సజావుగా సాగే విధముగా చూసే బాధ్యత ఉంటుందన్నారు. వారి నివేదికలు కచ్చితంగా ఎన్నికల నిబంధనలకు లోబడి సమర్పించాలని చెప్పారు. జోనల్ అధికారులు 7, 8 గ్రామ పంచాయితీలకు ఒక రూట్ మ్యాప్ ఏర్పాటు చేసుకొని ఎలక్షన్ సిబ్బందిని, పోలీస్ సిబ్బందిని, పోలింగ్ సామాగ్రిని ఆయా పోలింగ్ కేంద్రాలకు చేర్చే విధంగా బాధ్యత తీసుకోవాలన్నారు. పోలింగ్ రోజు పోలింగ్ కేంద్రాలలో అత్యవసరంగా ఏమైనా పోలింగ్ మెటీరియల్ కావాలన్నా, సిబ్బందికి భోజనాలు చూసే బాధ్యత జోనల్ అధికారికి ఉంటుందని తెలిపారు. ఎన్నికల నిబంధనలు పాటిస్తూ విధులు నిర్వహించాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మైక్రోఅబ్జర్వర్స్ బాధ్యతగా పనిచేయాలని, జోనల్ అధికారులకు 7, 8 పోలింగ్ స్టేషన్స్ మీ పరిధిలో ఉంటాయన్నారు. ప్రతి పోలింగ్ స్టేషన్స్‌ను పరిశీలించాలని, ఆ పోలింగ్ స్టేషన్ నివేదిక సంబంధిత అధికారుల వద్ద ఉంటుందని అట్టి నివేదిక ప్రకారంగా నడుచుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కె సీతారామారావు, డిపిఓ యాదగిరి, డిఆర్‌డిఏ పిడి అప్పారావు, ట్రైనర్ రమేష్ పాల్గొన్నారు.

**ఫిర్యాదులను నేరుగా తెలుపవచ్చు**

గ్రామ పంచాయితీ ఎన్నికల సందర్భంగా ఏమైనా సమస్యలు, సమాచారాన్ని తెలియజేసేందుకు నేరుగా తన ఫోన్ నంబర్ 967684 5846కు తెలుపవచ్చని గ్రామ పంచాయితీ ఎన్నికల జిల్లా సాధారణ పరిశీలకులు రవి నాయక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో గ్రామ పంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా, శాంతియుత వాతావరణంలో సజావుగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాల్సిన అవసరం ఉందన్నారు. అదే సమయంలో ఎన్నికల ప్రవర్తన నియమావళిని తూచా తప్పకుండా పాటించాలని కోరారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘన, అలాగే ఎన్నికలకు సంబంధించి ఏమైనా సమస్యలను, ఫిర్యాదులను నేరుగా తన ఫోన్ నంబర్‌కు తెలియజేయాలని కోరారు.



## మంత్రి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిక

ప్రజాపక్షం/గరిడేపల్లి: మండల పరిధిలోని పొనుగోడు గ్రామ సీనియర్ నాయకుడు గరిడేపల్లి బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు జోగు అరవింద్‌రెడ్డితో పాటు తన ఆధ్వర్యంలో 50 మంది కార్యకర్తలతో కలిసి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సమక్షంలో శనివారం కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. మండలంలో బిఆర్ఎస్‌పార్టీ అభివృద్ధికి ఎంతో కృషి చేశానని, పొనుగోడు గ్రామాన్ని సర్పంచ్‌గా మా అమ్మగారు ఎంతో అభివృద్ధి చేశామని, నియోజకవర్గ స్థాయి నాయకులు తనకు ఎటువంటి గుర్తింపు ఇవ్వలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధికి ఆకర్షి తులై కాంగ్రెస్ పార్టీలో చేరానని అన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి జోగు అరవింద్‌రెడ్డి అతని అనుచరులకు పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఏడిపాల నర్సిరెడ్డి, కుర్రి వెంకన్న, నందిపాటి సామ్రాట్, షేక్ జాన్‌షరీఫ్, పాల జాని, మిడిసినమెట్ల రాంబాబు, పకీర్, శ్రీనివాసగౌడ్, అశోక్, మల్లికంటి ఉపేందర్, షేక్ నాగులు, జూలకంటి నరేష్, అప్పికట్ల కిరణ్, అవిరెల్లి వాసు, పృధ్వీ చేరిన వారిలో ఉన్నారు.

## హోంగార్డులు ప్రజలకు ఉత్తమ సేవలందించాలి : ఎస్‌పి




ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ : హోంగార్డులు ప్రజలకు ఉత్తమమైన, పారదర్శకమైన సేవలందించాలని జిల్లా ఎస్‌పి కె నరసింహ అన్నారు. శనివారం హోంగార్డు 63వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా హోంగార్డ్స్ నిర్వహించిన పరేడ్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్వచ్ఛంద సేవతో ప్రారంభమైన హోంగార్డుల వ్యవస్థ నేడు పోలీసు సిబ్బందితో సమానంగా కొన్ని సందర్భాల్లో వారికంటే ఎక్కువగా హోంగార్డులు విధులు నిర్వహిస్తున్నారని అభినందించారు. సాంకేతిక విధులు, సిసిటిఎన్ఎస్ విధులు, రైటర్స్‌గా విధులు నిర్వర్తించడంలో ముందున్నారని అన్నారు. ప్రజల ధన, మాన, ప్రాణ రక్షణలో నిరంతరం పని చేస్తున్నారని తెలిపారు. హోంగార్డులు జిల్లా పోలీస్ కార్యాలయంను తమ కార్యాలయంగా గర్వంగా చెప్పుకోవాలని సూచించారు. ఇంటర్‌లో మొదటి బహుమతిగా రూ.18వేలు, ద్వితీయ బహుమతిగా 15వేలు, తృతీయ బహుమతిగా 12వేలు ఇవ్వనున్నారు. అదేవిధంగా పదో తరగతిలో రూ.15వేలు, రూ.10వేలు, రూ.8వేల చొప్పున ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందిస్తామని చెప్పారు. విధులలో ఉత్తమ ప్రతిభ చూపిన హోంగార్డులకు ప్రశంసా పత్రాలు అందజేసి అభినందించారు. అనంతరం వారితో కలిసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమం లో ఆర్మ్‌డ్ అదనపు ఎస్‌పి జనార్థన్ రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రామారావు, సూర్యాపేట పట్టణ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య, ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం, హోంగార్డు ఇంచార్జి ఆర్ఎస్ఐ అశోక్, ఇతర ఆర్ఎస్ఐలు సురేష్, సా యిరాం, రాజశేఖర్, ఏఆర్ఎస్ఐ వెంకన్న, హోంగార్డు సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రతీ విద్యార్థి నూరుశాతం ఉత్తీర్ణత లక్ష్యం

### యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు



ప్రజాపక్షం/యాదాద్రి : వార్షిక పరీక్షలకు ప్రతి విద్యార్థి కష్టపడి చదివి నూరు శాతం ఉత్తీర్ణత ఫలితాలు సాధించాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. శనివారం రాజాపేట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మధ్యాహ్న భోజన పథకం కింద విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్నం భోజనం ఎలా ఉంది, రోజు మెనూ ప్రకారం రుచికరమైన ఆహారం పెడుతున్నారా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. సమయానికి మంచిగా తిని జ్ఞాపకశక్తి పెంచుకోవాలన్నారు. సబ్జెక్టుల సిలబస్ ఎంతవరకు పూర్తయిందని అడిగి తెలుసుకున్నారు. రోజు సాయంత్రం స్పెషల్ క్లాసులు ఉపాధ్యాయులు నిర్వహిస్తున్నారా అని అడిగి సబ్జెక్టులలో ఏమైనా సందేహాలు ఉంటే ఉపాధ్యాయులని అడిగి తెలుసుకోవాలన్నారు. వార్షిక పరీక్షలకు ఇంకా రెండు నెలల సమయం మాత్రమే ఉన్నది కాబట్టే ఇప్పటి నుండి రోజు బాగా కష్టపడి చదవాలని విద్యార్థులకి సూచించారు. కష్టపడి చదివితే భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదుగుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

**అధికారులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలి**

మొదటి విడత ఎన్నికల విధులు నిర్వహిస్తున్న అధికారులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామపంచాయతి ఎన్నికల్లో మెదటి విడత పోలింగ్ జరిగే ఆలేరు, బొమ్మలరామారం, యాదగిరిగుట్ట, రాజాపేట, తుర్కపల్లి, ఆత్మకూరు మండలాల్లో పోలింగ్‌లో పాల్గొనే ఆర్వోలు, ఏఆర్వోలు, పిఓలు, ఓపిఓలు, జోనల్ అధికారులు, పోలీస్ సిబ్బంది , ఇతర ఎలక్షన్ విధులు కేటాయించిన సిబ్బంది తమ ఓటు హక్కును పోస్టల్ బ్యాలెట్ ద్వారా సిబ్బంది ఆదివారం తమ ఓటు ఉన్న గ్రామ పంచాయతీకి సంబంధించిన మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఫారం14 ( పోస్టల్ బ్యాలెట్ దరఖాస్తు ) నింపి ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. దీనికి సంబందించి మొదటి విడతలో ఎన్నికలు జరిగే 6 మండలాల ఎంపీడీవోలు నమూనా పోలింగ్ కేంద్రాన్ని తయారు చేసుకొని సిద్ధంగా ఉండాలని ఆదేశించారు.

# 'తెలంగాణ వైభవం రేవంతన్న' పాటల సిడి ఆవిష్కరించిన సిఎం




ప్రజాపక్షం/దేవరకొండ: తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక సలహా మండలి సభ్యులు, ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నర్సింహా పాడిన తెలంగాణ వైభవం రేవంత్ అన్న పాటల సిడిని శనివారం దేవరకొండలో జరిగిన ప్రజా పాలన ప్రజా విజయోత్సవాల బహిరంగ సభలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈసందర్భంగా సిఎం రేవంత్‌రెడ్డి పల్లె నర్సింహాను అభినందించారు. ఈకార్యక్రమంలో ఎంఎల్ఏ బాలునాయక్, సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి, సిపిఐ ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి, అంజయ్యనాయక్, జిల్లా కార్యవర్గ సభ్యులు బుచ్చిరెడ్డి పాల్గొన్నారు.

## సొంతింటి కల నెరవేర్చిన కాంగ్రెస్



ప్రజాపక్షం/నార్కట్ పల్లి : కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. శనివారం గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా మండలంలో గడప గడప ప్రచారం నిర్వహించారు. శాపల్లి గ్రామ కాంగ్రెస్ సర్పంచ్ అభ్యర్థి ఏరపుల మంజుల స్వామి, నక్కలపల్లి, బెండల్ పహాడ్ గ్రామాలలో వార్డు సభ్యులకు మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బత్తుల ఉషయ్య సీనియర్ నాయకులు బెంజి కొండయ్య చింపాంజీఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బత్తుల ఉష య్య, సీనియర్ నాయకులు బింగి కొండయ్య, సిద్ధ గొని స్వామి, నిమ్మనగోటి వెంకన్న,నిమ్మనగోటి లింగయ్య, సట్టు సత్తయ్య ఉన్నారు.

# 'ఆదర్శ మున్సిపాలిటీ'లో ఆగని అక్రమ కట్టడాలు

### ప్రభుత్వ ఆదాయానికి భారీ గండి

### ఇదేమిటని ప్రశ్నిస్తే రాజకీయఒత్తిడితోనే...

### ఏమి చేయలేకపోతున్నామని నిస్సిగ్గుగా చెబుతున్న వైనం

### నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకుంటున్న అధికారులు



ప్రజాపక్షం/సూర్యాపేట : సూర్యాపేట పట్టణంలో అక్రమ కట్టడాలు ఏ మాత్రం ఆగడంలేదు. మున్సిపాలిటికి పాలకవర్గం లేకపోవడంతో సంబంధిత అధికారులు రాజకీయ నాయకుల పేర్లు చెబుతూ తమ బాధ్యతలను విస్మరిస్తున్నారు. ఇందులో ఎంతవరకు వాస్తవం ఉందో కూడా అర్థంకాని పరిస్థితి. అధికారులు మామ్మూళ్ళ మత్తులో రాజకీయ నాయకుల పేర్లు వాడుకొని జేబులు నింపుకుంటున్నారనే విమర్శ కూడా లేకపోలేదు. సామాన్యులు తల దాచుకునేందుకు ఒక గది నిర్మాణం చేపట్టినా అనుమతి లేదంటూ జేసిబిలతో క్షణాల్లో దానిని నేలమట్టం చేసే అధికారులు ఆర్థికంగా, రాజకీయంగా ఉన్నవారికి మాత్రం నిబంధనలు సడలిస్తున్నారు. మున్సిపల్ టౌన్ ప్లానింగ్ విభాగంలో ఒక టౌన్ ప్లానింగ్ అధికారి తోపాటు మరొక బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్, నలుగురు చైన్‌మెన్లు మాత్రమే విధులు నిర్వహించేవారు. కాని కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత వివిధ పోటీ పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారికి ప్రభుత్వం పోస్టులు ఇవ్వడంతో ఓ టౌన్ ప్లానింగ్ అధికారితో పాటు నలుగురు బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు, నలుగురు చైన్‌మెన్‌లు విధులు నిర్వహిస్తున్నారు. నూతన భవనాల నిర్మాణాలకు అనుమతులు ఇవ్వడంతోపాటు అక్రమ కట్టడాలను అడ్డుకోవల్సిన బాధ్యత వీరిపై ఉంది. కాని వారు ఏ మాత్రం పట్టించుకోకపోవడంతో వందల సంఖ్యల్లో పట్టణంలో అక్రమ కట్టడాలు జరుగుతున్నాయి. ఏ వీధిలో చూసినా అనుమతులు లేని భవనాలు, అనుమతి కొంత ఉంటే దానికి రెట్టింపుగా యజమానులు నిర్మాణాలు చేస్తున్నారు. భవన నిర్మాణాలు కాకుండా కొంత మంది వ్యాపారులు గోదాంల కోసం భారీ రేకుల షెడ్లు ఏర్పాటు చేసి చుట్టూ గోడలు నిర్మిస్తున్నారు. ఖమ్మం రోడ్డు, ఎస్‌వి ఇంజనీరింగ్ కళాశాల, న్యూకలెక్టరేట్ రోడ్డు, 65వ జాతీయ రహదారి వ్యవసాయ మార్కెట్ సమీపంలో ఇటీవల కాలంలో దాదాపు 50కు పైగా నిర్మాణాలు జరిగాయి. తాజాగా 60 ఫీట్స్ రోడ్డులోని ఎల్ఐసి ఆఫీసు ఎదురుగా ఓ కాంట్రాక్టర్ తన బంధువులతో కలిసి మార్బుల్ షాప్ ఏర్పాటు కోసం భారీగా రేకుల షెడ్ నిర్మాణం చేశారు. ఆ నిర్మాణం చివరి దశకు చేరుకుంది. అధికారులు మాత్రం అటువైపు కన్నెత్తి చూడలేదు. నిర్మాణం పూర్తి అయిన తర్వాత అతనికి నోటీసులు చేతులు దులుపుకున్నారు.

అక్రమ కట్టడాలతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండిపడుతుంది. భవన నిర్మాణాలు చేసే వారు మున్సిపల్ అధికారులకు ముందుగా అనుమతి కోసం దరఖాస్తు చేసుకొని ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిర్మాణానికి తగ్గ ఫీజును చెల్లించిన తర్వాత నిర్మాణాలు చేసుకోవల్సి ఉంది. కానీ అలాంటివేమి లేకుండానే నిర్మాణాలు పట్టణంలో పెద్దఎత్తున చేస్తున్నారు.

అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాల్సిన అధికారులు ఆ పని చేయకపోవడంతో ఇదేమని అధికారులను ప్రశ్నిస్తే రాజకీయ ఒత్తిడితో తాను ఏమి చేయలేకపోతున్నామని నిసిగ్గగా చెబుతున్న పరిస్థితి. రాజకీయ నాయకుల పేర్లు చెప్పి అక్రమ నిర్మాణదారుల నుండి లక్షల్లో డబ్బులు పొందుతూ అధికారులు జేబులు నింపుకుంటున్నారని ఆరోపణలు లేకపోలేదు. ఈ అక్రమాలను ఎత్తిచూపుతూ మీడియాలో వార్తలు ప్రచురితమౌవుతాయనే భయంతో ముందస్తుగా అక్రమ నిర్మాణాలు చేపట్టే వారికి నోటీసులు ఇచ్చి చేతులు దలుపుకుంటున్నారు.

### అక్రమ కట్టడాలను అరికట్టేందుకు చర్యలు బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ శివాజీ

ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమ నిర్మాణాలను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటామని 60 ఫీట్ రోడ్డు ఏరియా బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ శివాజీ తెలిపారు. అక్రమ కట్టడాలపై ఆయనను వివరణ కోరగా తమ ప్రాంతంలో ఇప్పటికే అక్రమ నిర్మాణాలు చేపట్టిన వారికి నోటీసులు ఇచ్చినట్లు చెప్పారు. అక్రమ భవన నిర్మాణదారులు రాజకీయ నాయకులతో ఫోన్లు చేయించి తమ పనికి అడ్డుతగులుతున్నారని స్పష్టం చేశారు. 60 ఫీట్ల రోడ్డులో భారీగా నిర్మిస్తున్న షెడ్ యజమానికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం తాము నోటీసులు జారీ చేశామని చెప్పారు. మరో రెండు రోజుల్లో మరో నోటీసును కూడా జారీ చేస్తామని తెలిపారు.

## మా ఓటు గ్రామాభివృద్ధికి... నాయకులు ఇచ్చే డబ్బుకు కాదు

ప్రజాపక్షం/యాదాద్రి : యాదాద్రి భువనగిరి జిల్లాలో ఓటు హక్కు అవగాహన కార్యక్రమాలు చేపట్టిన జిల్లా ఎన్నికల అధికారి , కలెక్టర్ హనుమంత రావు పిలుపు మేరకు ఓటర్లలో మంచి స్పందన వచ్చింది. మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికలు జరిగే 6 మండలాల్లో శుక్రవారం ఉదయం ఓటు హక్కు పై అవగాహన కార్యక్రమాలు చేపట్టిన నేపథ్యంలో బొమ్మలరామారం మండల కేంద్రంలో జిల్లా కలెక్టర్ ఓటు హక్కు పై మహిళలకు విస్తృత స్థాయి అవగాహన కల్పించారు. మహిళా ఓటరుల అందరితో ఓటుని గ్రామాభివృద్ధికి వినియోగించుకోవాలని మద్యానికి కానీ డబ్బుకు కానీ మా ఓటుని అమ్ముకోమని మా ఓటుని గ్రామాభివృద్ధి చేసే నాయకులను ఎన్నుకోవడం కోసం ఉపయోగించుకుంటాం అని ప్రతిజ్ఞ చేయించారు. అవగాహన పొందిన మహిళలు శనివారం బొమ్మలరామారం మండలంలోని జలాలపూర్ గ్రామనికి చెందిన కొందరు ఓటర్లు తమ ఇండ్ల ముందు స్వచ్ఛందంగా మాకు డబ్బులు, గిఫ్ట్‌లకు మా ఓటుని అమ్ముకోమని, నీతి నిజాయితీతో స్వచ్ఛందంగా మా ఓటు వేస్తాం అని బోర్డులు ఏర్పాటు చేశారు.



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## కశ్మీర్‌లో పడిపోయిన రాత్రి ఉష్ణోగ్రతలు

**శ్రీనగర్ :** కశ్మీర్‌లో రాత్రి ఉష్ణోగ్రతలు ఘనీభవన స్థానం కంటే అనేక డిగ్రీలు తక్కువగా పడిపోయాయి, లోయలోని కొన్ని ప్రాంతాలను దట్టమైన పొగమంచు కప్పివేసినప్పటికీ, శ్రీనగర్‌లో కనిష్టంగా మైనస్ 4.1 డిగ్రీల సెల్సియస్ నమోదైందని అధికారులు శనివారం తెలిపారు. జమ్మూ కశ్మీర్‌లో షోపియాన్ అత్యంత శీతల ప్రదేశంగా నమోదైందని, అక్కడ పాదరసం కనిష్టంగా మైనస్ 6.4 డిగ్రీల సెల్సియస్ వద్ద స్థిరపడిందని వారు తెలిపారు. గురువారం రాత్రి లోయలోని చాలా చోట్ల పాదరసం ఘనీభవన స్థానం కంటే ఎక్కువగా స్థిరపడింది, ఇది నివాసితులకు తీవ్రమైన చలి పరిస్థితుల నుండి భారీ ఉపశమనం కలిగించింది.అయితే, శుక్రవారం రాత్రి కశ్మీర్ అంతటా ఉష్ణోగ్రతలు పడిపోయాయి, ఘనీభవన చలిని తిరిగి తీసుకువచ్చిందని అధికారులు తెలిపారు. శుక్రవారం రాత్రి, జమ్మూ కశ్మీర్ వేసవి రాజధాని శ్రీనగర్‌లో కనిష్ట ఉష్ణోగ్రత మైనస్ 4.1 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైందని అధికారులు తెలిపారు, ఇది అంతకుముందు రాత్రి 0.4 డిగ్రీల సెల్సియస్ నుండి గణనీయంగా తగ్గిందని అధికారులు తెలిపారు.

## రాజ్యాంగం ప్రమాదంలో...

### రక్షించే బాధ్యతను అంతా తీసుకోవాలి: రాహుల్ గాంధీ



**న్యూఢిల్లీ :** భారత రాజ్యాంగ శిల్పి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 70వ మహా పరినిర్వాణ దినోత్సవాన్ని పురస్కరించుకుని, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పార్లమెంట్ ప్రాంగణంలో నివాళులు అర్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడిన ఆయన, అంబేద్కర్ ఆలోచనలు, సిద్ధాంతాలు దేశానికి ఇప్పటికీ మార్గదర్శకాలుగా నిలుస్తున్నాయని తెలిపారు. 'అంబేద్కర్ జీ ఒక మహనీయుడు. ఆయన చూపించిన మార్గమే ఈ దేశాన్ని ముందుకు నడిపిస్తోంది. మనకు రాజ్యాంగం ఇచ్చిన గొప్ప నేత. అందుకే ఆయనను స్మరించుకోవడం మాత్రమే కాదు. ఆయన సిద్ధాంతాలు, రాజ్యాంగాన్ని కాపాడుకోవడం ప్రతి పౌరుని బాధ్యత' అని రాహుల్ గాంధీ తెలిపారు. దేశంలో రాజ్యాంగం నిరంతరం ప్రమాదంలోనే ఉంటుందని ఆయన వ్యాఖ్యానించారు. 'రాజ్యాంగం ప్రమాదంలో ఉంది. దాన్ని మనమందరం కాపాడాలి. పౌరులు కూడా తమ హక్కులను రక్షించే బాధ్యత తీసుకోవాలి' అని స్పష్టం చేశారు. ఆ తర్వాత ఎక్స్‌లో కూడా అదే సందేశాన్ని పునరుద్ఘాటించారు. 'బాబాసాహెబ్ అంబేద్కర్‌కు వినమ్ర నివాళులు. సమానత్వం, న్యాయం, మానవ గౌరవం అనే ఆయన శాశ్వత విలువలు. రాజ్యాంగంలో నా సంకల్పాన్ని మరింత బలపరుస్తున్నాయి. మరింత సమానమైన, కరుణతో కూడిన భారతదేశం కోసం ఆయనే ప్రేరణ' అని ఆయన పేర్కొన్నారు.

**పార్లమెంట్ ప్రాంగణంలో!**

ప్రతి సంవత్సరం మాదిరిగానే, ఈసారి కూడా సోషల్ జస్టిస్ అండ్ ఎంపవర్‌మెంట్ మంత్రిత్వ శాఖ తరఫున డాక్టర్ అంబేద్కర్ ఫౌండేషన్ (డిఏఎఫ్) డిసెంబర్ 6న పార్లమెంట్ హౌస్ క్యాంపస్‌లోని ప్రేరణ స్థలంలో మహాపరినిర్వాణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించింది. ప్రారంభంలో పవిత్రతకు లోబడి జరిగే ఈ కార్యక్రమాన్ని, కాలక్రమేణా ప్రజలకు కూడా తెరవటం ద్వారా బాబా సాహెబ్ విగ్రహం వద్దకు వచ్చి పౌరులు స్వేచ్ఛగా నివాళులు అర్పిస్తున్నారు. మొత్తం కార్యక్రమం జరుగుతున్నంతసేపు శాంతియుత, ఆధ్యాత్మిక వాతావరణాన్ని నెలకొల్పేందుకు 25 మంది బౌద్ధ భిక్షువుల బౌద్ధ గీతాలాపన విశేష ఆకర్షణగా నిలిచింది. ఇదిలా ఉండగా, బాబాసాహెబ్ మహాపరినిర్వాణ దినోత్సవాన్ని పురస్కరించుకుని దేశవ్యాప్తంగా రాజకీయ పార్టీలు, సామాజిక సంస్థలు, సాధారణ పౌరులు నివాళులు అర్పించారు. ప్రత్యేకంగా మహారాష్ట్రలోని దాదర్ చైత్యభూమిలో లక్షలాది ప్రజలు తరలివచ్చి నివాళులు అర్పించడంతో ఆ ప్రాంతంలో ప్రతి ఏడాదిలాగే రద్దీ కనిపించింది.

## మరో 400 ఇండిగో విమానాలు రద్దు



**న్యూఢిల్లీ :** దేశ విమానయాన సంస్థ ఇండిగో సర్వీసుల్లో అంతరాయంతో దేశ వ్యాప్తంగా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని రోజులుగా కొనసాగుతున్న సంక్షోభం ఇప్పట్లో కొలిక్కి వచ్చేలా కనిపించడం లేదు. కోర్టు ఆదేశించిన కొత్త విమాన విధి, కాక్‌పిట్ సిబ్బందికి విశ్రాంతి కాల నిబంధనల రెండవ దశలో తాత్కాలికంగా ప్రధాన సడలింపులను శుక్రవారం ఇచ్చింది. అయినా శనివారం నాడు దేశీయ విమానయాన సంస్థ ఇండిగో నాలుగు ప్రధాన విమానాశ్రయాల నుండి 400కి పైగా విమానాలను రద్దు చేసిందని వర్గాలు తెలిపాయి. వీటిలో, బెంగళూరు విమానాశ్రయంలో 124 విమానాలు (63 నిష్క్రమణలు, 61 రాకపోకలు), ముంబయి విమానాశ్రయంలో 109 విమానాలు ( 51 నిష్క్రమణలు, 58 రాకపోకలు) రద్దు అయ్యాయని తెలిపారు. ఢిల్లీ విమానాశ్రయంలో 54 నిష్క్రమణలు, 52 రాకపోకలతో సహా 106 విమానాలను రద్దు చేసినట్లు వర్గాలు తెలిపాయి. హైదరాబాద్ విమానాశ్రయంలో ఇండిగో 66 విమానాలను రద్దు చేసిందని వర్గాలు తెలిపాయి. శుక్రవారం పలు విమానాశ్రయాల్లో 1,000కి పైగా ఇండిగో విమానాలను రద్దు కాగా, మూడు రోజుల పాటు తీవ్ర సంక్షోభం గురించి మౌనం వహించిన తర్వాత అంతరాయాల కారణంగా ప్రయాణికులకు కలిగిన ప్రధాన అసౌకర్యానికి వీడియో సందేశంలో ఇండిగో సిఇఒ పీటర్ ఎల్బర్స్ క్షమాపణలు చెప్పారు. వన్‌వే వీడియో కమ్యూనికేషన్‌లో ఎల్బర్స్ మాట్లాడారు. శుక్రవారం, రాహుల్ భాటియా పాక్షికంగా యాజమాన్యంలోని ఇండిగోకు డిజిసిఎ తాత్కాలిక ఉపశమనం కల్పించిందని, నైట్ డ్యూటీ నిర్వచనాన్ని ఉదయం 12 నుండి ఉదయం 6 గంటల వరకు, ఉదయం 12 నుండి ఉదయం 5 గంటల వరకు తగ్గించిందని, దాని పైలట్‌లు రెండు రాత్రి ల్యాండింగ్‌లను ముందుగా చేయడానికి అనుమతించిందని, ఇతర సడలింపులతో పాటు మరిన్ని సడలింపులను కూడా అందించిందని పేర్కొన్నారు. కాగా, పైలట్ల సంఘం, ఎయిర్‌లైన్స్ పైలట్స్ అసోసియేషన్ (ఎఎల్‌పిఎ) ఇండియా, డిజిసిఎ ఇండిగోకు ఇచ్చిన ఎంపిక, అసురక్షిత ఉపశమనంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ సడలింపులు నియంత్రణ సమానత్వాన్ని నాశనం చేయడమే కాకుండా లక్షలాది మంది ప్రయాణికులను తీవ్ర ప్రమాదంలో ఉంచాయని పేర్కొంది.

## విమాన ప్రయాణానికి మంగళం

### సులభతరం చేస్తామన్న మోదీ... ఇప్పడేం చేస్తారు? : కాంగ్రెస్



**న్యూఢిల్లీ :** ఇండిగో విమానాల అంతరాయంతో ప్రయాణికులు గందరగోళానికి గురవుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వంపై కాంగ్రెస్ విమర్శలు గుప్పించింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విమాన ప్రయాణాన్ని సులభతరం చేస్తామని హామీ ఇచ్చారని, కానీ విమాన ప్రయాణాన్ని నిలిపివేశారని ఎద్దేవా చేసింది. కేంద్ర పౌర విమానయాన మంత్రి కె. రామ్మోహన్ నాయుడు ఈ అపూర్వమైన సంక్షోభానికి బాధ్యత వహిస్తారా అని ప్రశ్నించింది. ఇండిగోలో కొనసాగుతున్న గందరగోళం ప్రమాదం కాదని, బిజెపి ప్రభుత్వం ఈ రంగంలో ద్వంద్వ విధానాన్ని అవలంబించేందుకు నిరంతరాయంగా చేస్తున్న ప్రయత్న ప్రత్యక్ష ఫలితం అని ప్రతిపక్ష పార్టీ పేర్కొంది. ఇండిగో విమానాల అంతరాయాలు వేలాది మంది ప్రయాణికులను ప్రభావితం చేస్తున్నందున, శనివారం రద్దు చేయబడిన విమానాల టికెట్ వాపసు ప్రక్రియను ఆదివారం సాయంత్రం నాటికి పూర్తి చేయాలని, అలాగే ప్రయాణికుల నుండి వేరు చేయబడిన సామాను రానున్న రెండు రోజుల్లో డెలివరీ అయ్యేలా చూసుకోవాలని పౌర విమానయాన మంత్రిత్వ శాఖ విమానయాన సంస్థను ఆదేశించింది. దేశంలోని అతిపెద్ద విమానయాన సంస్థ ఇండిగో 1,000కి పైగా విమానాలను రద్దు చేయగా, ఐదవ రోజు శనివారం కూడా అంతరాయాలు ఏర్పడ్డాయి. శనివారం ఢిల్లీలో జరిగిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ నాయకుడు శశికాంత్ సెంథిల్ మాట్లాడుతూ, ఇండిగో విమానాల రద్దు దేశ విమాన ప్రయాణాన్ని దెబ్బతీసిందన్నారు. 'ఈ సంక్షోభం సహజ సంక్షోభం కాదు; పోటీని అణిచివేయడం, ఇష్టమైన వాటికి బహుమతులు ఇవ్వడం, కార్పొరేట్ మిత్రపక్షాలకు అనుగుణంగా మొత్తం జాతీయ పరిశ్రమను పునర్నిర్మించడంపై బిజెపి ప్రభుత్వం తీవ్రంగా దృష్టి సారించిన ఊహించదగిన పతనం ఇది' అని సెంథిల్ అన్నారు. 'విమానయాన భద్రతను బిజెపి ప్రభుత్వం నిర్లక్ష్యంగా నిర్వహించడం దాని నిర్లక్ష్యాన్ని పూర్తిగా బహిర్గతం చేస్తుంది. జనవరి 8, 2024న విమాన విధి సమయ పరిమితి (ఎఫ్‌డిటిఎల్) నియమాలను విడుదల చేసిన తర్వాత, జూలై 1, 2025న వాటిని పాక్షికంగా అమలు చేసిన తర్వాత, బిజెపి ప్రభుత్వం ఇప్పుడు సిగ్గు లేకుండా ఈ కీలకమైన భద్రతా రక్షణలను సెక్టార్ వ్యాప్తంగా సంక్షోభం మధ్యలో ఉపసంహరించుకుంది' అని తిరువళ్లూరు ఎంపి అన్నారు. 'ఇది బాధ్యతారాహిత్యం మాత్రమే కాదు; ఇది దారుణం. పైలట్ అలసటను నివారించడానికి ప్రత్యేకంగా రూపొందించిన నియమాలను రద్దు చేయడం ద్వారా, బిజెపి ప్రభుత్వం ప్రయాణికుల భద్రతను ప్రమాదంలో పడేసి కాక్‌పిట్ సిబ్బంది శ్రేయస్సును అనిశ్చితిలోకి నెట్టిందని ఆరోపించారు' అని ఆయన అన్నారు. పరిస్థితిని స్థిరీకరించడానికి బదులుగా, వారు దానిని మరింత తీవ్రతరం చేశారని, వారు ఇష్టపడే సంస్థల సౌలభ్యంతో పోల్చినప్పుడు భద్రత, జవాబుదారీతనం ఈ పరిపాలనకు ఏమీ అర్థం కాదని మరోసారి నిరూపించారని సెంథిల్ అన్నారు. ప్రభుత్వానికి సెంథిల్ ప్రశ్నలు సంధిస్తూ... గత 11 సంవత్సరాలలో, విమానయానం పోటీతత్వ, వైవిధ్యభరితమైన రంగాన్ని నిర్మించడానికి బదులుగా గుత్తాధిపత్యం, ద్వంద్వ రాజ్యంగా కుంచించుకుపోవడానికి ఎందుకు అనుమతించిందని నిలదీశారు.


## బెంగాల్‌లో బాబ్రీమసీదు

### శంకుస్థాపన చేసిన టిఎంసి సస్పెన్షన్ ఎమ్మెల్యే కబీర్



**ముర్షీదాబాద్:** తృణమూల్ కాంగ్రెస్ ఎమ్మెల్యే హుమయూన్ కబీర్.. శనివారం బాబ్రీ మసీదు నిర్మాణం కోసం శంకుస్థాపన చేశారు. అయోధ్యలో గతంలో ఉన్న బాబ్రీ మసీదు తరహాలో పశ్చిమ బెంగాల్‌లోని ముర్షీదాబాద్‌లోనూ మసీదును నిర్మించనున్నారు. భారీ భద్రత మధ్య రెజినగర్‌లో ఆ కార్యక్రమాన్ని నిర్వహించారు. వేల సంఖ్యలో జనం ఆ కార్యక్రమానికి హాజరయ్యారు. చాలా మంది మసీదు నిర్మాణం కోసం స్వచ్ఛందంగా ఇటుకలు మోశారు. మసీదు నిర్మాణం శంకుస్థాపన సందర్భంగా ఎమ్మెల్యే కబీర్ తన అనుచరులతో కలిసి రిబ్బన్ కట్ చేశారు. నారా ఈతక్‌బీర్, అల్లాహూ అక్బర్ అని నినదించారు. మతఘర్షణలకు దారి తీసే రీతిలో ప్రవర్తిస్తున్న ఎమ్మెల్యే కబీర్‌ను ఇటీవల తృణమూల్ కాంగ్రెస్ పార్టీ సస్పెండ్ చేసింది.

## డిప్‌ఫేక్‌లు నియంత్రించేలా లోక్‌సభలో ప్రైవేట్ బిల్లు




**న్యూఢిల్లీ :** ప్రస్తుత ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ) యుగంలో అనేకమంది ఎదుర్కొంటున్న సమస్య డిప్‌క్. దీని నియంత్రణకు స్పష్టమైన చట్టపరమైన ఫ్రేమ్‌వర్క్‌ను రూపొందించేలా లోక్‌సభలో ఒక ప్రైవేట్ మెంబర్ బిల్లు ప్రవేశపెట్టారు. శివసేన నాయకుడు శ్రీకాంత్ షిండే శుక్రవారం సభలో ప్రవేశపెట్టిన డిప్‌ఫేక్ నియంత్రణ బిల్లు, డిప్‌ఫేక్ కంటెంట్‌లో చిత్రీకరించబడిన వ్యక్తుల నుండి ముందస్తు అనుమతిని తప్పనిసరి చేయడం ద్వారా పౌరులను రక్షించడం లక్ష్యంగా పెట్టుకుంది. 'వేధింపులు, మోసం, తప్పుడు సమాచారం కోసం డీప్‌ఫేక్‌ల దుర్వినియోగం పెరిగింది. నియంత్రణా రక్షణల కోసం తక్షణ అవసరం ఏర్పడింది' అని షిండే అన్నారు. దురుద్దేశంతో డీప్‌ఫేక్ కంటెంట్‌ను సృష్టించే లేదా వ్యాప్తి చేసే నేరస్థులకు శిక్షలను కూడా బిల్లులో పేర్కొన్నారు. 'డీప్‌ఫేక్ టెక్నాలజీ మీడియా మానిప్యులేషన్‌కు ముఖ్యమైన సాధనంగా ఉద్భవించింది. విద్య, వినోదం, సృజనాత్మక రంగాలలో ఈ సాంకేతికతకు సంభావ్య అనువర్తనాలు ఉన్నప్పటికీ, దుర్వినియోగం చేసినప్పుడు అది తీవ్రమైన ప్రమాదాలను కూడా కలిగిస్తుంది. వ్యక్తిగత గోప్యత, జాతీయ భద్రత, ప్రజల నమ్మకాన్ని వమ్ముచేస్తుంది' అని షిండే పేర్కొన్నారు. ప్రతిపాదిత బిల్లు భారతదేశంలో డీప్‌ఫేక్‌ల సృష్టి, పంపిణీ, అనువర్తనాన్ని నియంత్రించడానికి స్పష్టమైన చట్టపరమైన ఫ్రేమ్‌వర్క్ ఏర్పాటు చేయడానికి ప్రయత్నిస్తుందని షిండే అన్నారు. మానిప్యులేట్ చేయబడిన కంటెంట్‌ను గుర్తించే సాంకేతికతలను అభివృద్ధి చేయడానికి, తద్వారా డిజిటల్ మీడియాలో విశ్వసనీయతను ప్రోత్సహించడానికి టాస్క్ ఫోర్స్ విద్య, ప్రైవేట్ రంగ సంస్థలతో సహకరిస్తుంది. అధునాతన ఇమేజ్ మానిప్యులేషన్‌ను గుర్తించడం, నిరోధించడంలో ప్రభుత్వ, ప్రైవేట్ రంగ చొరవలకు మద్దతు ఇవ్వడానికి ఒక నిధిని ఏర్పాటు చేయాలని కూడా బిల్లు ప్రతిపాదిస్తుంది. ప్రైవేట్ మెంబర్ బిల్లు అనేది పార్లమెంట్ ప్రక్రియ.

## రాజ్యాంగ ప్రవేశికలో... 'సెక్యులర్', 'సోషలిస్ట్' పదాలను తొలగించాలి

### బిజెపి ఎంపి భీమ్‌సింగ్



**న్యూఢిల్లీ :** రాజ్యాంగ ప్రవేశికలో 'లౌకిక', 'సామ్యవాద' అనే పదాలు అవసరం లేదని, అత్యవసర పరిస్థితి సమయంలో 'అప్రజాస్వామిక పద్ధతి'లో అవి చేర్చబడ్డాయని, ఈ పదాలను తొలగించాల్సిన ఆవశ్యకత ఉందని ఎగువ సభలో బిజెపి రాజ్యసభ సభ్యుడు భీమ్ సింగ్ అన్నారు. ఆయన శుక్రవారం రాజ్యసభలో రాజ్యాంగ (సవరణ)బిల్లు 2025(ప్రియాంబుల్ సవరణ)ను ప్రవేశపెట్టారు. ఆ రెండు పదాలు 'గందరగోళాన్ని' సృష్టిస్తాయని, అసలు ఆ పదాలు రాజ్యాంగంలో భాగం కాదని చెప్పారు. 'రాజ్యాంగ ప్రవేశికను సవరించడానికి, 'సెక్యులర్', 'సోషలిస్ట్' అనే పదాలను తొలగించడానికి నేను ఒక ప్రైవేట్ సభ్యుల బిల్లును ప్రవేశపెట్టాను. 1949లో ఆమోదించబడిన ఒరిజినల్ రాజ్యాంగం 1950 నాటి నుంచి అమలులోకి వచ్చింది. అయితే 'సెక్యులర్' , 'సోషలిస్ట్' పదాలు అప్పుడు లేవు. ఇందిరాగాంధీ 1976లో ఎమర్జెన్సీ సమయంలో ఈ రెండు పదాలను చేర్చారు. 42వ రాజ్యాంగ సవరణ కింద ఈ రెండు పదాలను రాజ్యాంగంలో చేర్చారు. పార్లమెంట్‌లో వాటిపై ఎలాంటి చర్చా జరుగలేదు' అని భీమ్‌సింగ్ 'పిటిఐ' కి చెప్పారు. 'అందరు ప్రతిపక్ష నాయకులు...అటల్ బిహారీ వాజ్‌పాయి, లాల్ కృష్ణ అద్వానీ, జార్జి ఫెర్నాండేజ్ జైలులో ఉన్నారు. ప్రజాస్వామ్యం హత్య చేయబడింది. ఆ పరిస్థితులలో ఇందిరాగాంధీ ఈ రెండు పదాలను చేర్చారు. తర్వాత జోడించబడిన ఈ పదాలు తర్వాత రాజ్యాంగం ఒరిజినల్ రూపంలోనే ఉండాలి అని బిజెపి ఎంపి భీమ్‌సింగ్ వివరించారు. ఈ అంశం రాజ్యాంగ సభలో కూడా చర్చనీయాంశం అయ్యిందని అన్నారు. 'ముసాయిదా కమిటీ చైర్మన్ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఒక సమాధానం ఇచ్చారు. భారత రాజ్యాంగ నిర్మాణం దేశాన్ని లౌకిక దేశంగా మారుస్తుందని ఆయన అన్నారు. అది (పదాన్ని చేర్చడం) అవసరం లేదని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ చెప్పారు' అని భీమ్‌సింగ్ తెలిపారు. 'సోషలిస్ట్' అనే పదంపై కూడా చర్చ జరిగిందని, రాజ్యాంగ కమిటీ భవిష్యత్ తరాన్ని ఒకే రాజకీయ, ఆర్థిక విధానాన్ని అనుసరించమని బలవంతం చేయలేదని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ బదులు ఇచ్చారని, ఒకవేళ రేపు మరొకరు ఆర్థిక విధానాన్ని మార్చాలని కోరుకుంటే పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. సోషలిజం విషయానికి వస్తే అది ప్రజల సంక్షేమానికి సంబంధించినదని భీమ్‌సింగ్ తెలిపారు. ప్రజల సంక్షేమాన్ని ఎలా నిర్ధారించాలి? పేదరికాన్ని ఎలా తగ్గించాలి? సంపదను ఎలా పంపిణీ చేయాలి? అనే అంశాలన్నీ రాజ్యాంగంలో భాగం అయ్యాయని ఆయన చెప్పారు. 'సెక్యులర్', 'సోషలిస్ట్' అనే ఈ రెండు పదాలను బుజ్జగింపు రాజకీయాల కోసం చేర్చారని బిజెపి ఎంపి భీమ్‌సింగ్ ఆరోపించారు. అప్పటి యూనియన్ ఆఫ్ సోవియట్ సోషలిస్ట్ రిపబ్లిక్ (యుఎస్‌ఎస్‌ఆర్)ను సంతోషపెట్టడానికి 'సోషలిస్ట్' అనే పదాన్ని, ముస్లిములను బుజ్జగించడానికి 'సెక్యులర్' అనే పదాలను చేర్చారని, అవి అనవసరమైనవని, వాటి అవసరం లేదని, అది కేవలం గందరగోళాన్ని సృష్టిస్తుందని ఆయన బిజెపి రాజ్యసభ్యుడు భీమ్‌సింగ్ వాదించారు. ప్రైవేట్ మెంబర్ బిల్లు అంటే మంత్రికాని సభ్యుడు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే శాసనపరమైన ప్రతిపాదన కాగా భారత పార్లమెంట్ చరిత్రలో ఇప్పటి వరకూ కేవలం 14 ప్రైవేట్ సభ్యుల బిల్లులను మాత్రమే చట్టంగా ఆమోదించబడ్డాయి. 1970నుండి ఉభయ సభలు ఏవీ ఆమోదించలేదు.

## లైఫ్ సపోర్ట్‌పై 'ఇండియా' కూటమి

### హిందూస్తాన్ టైమ్స్ లీడర్‌షిప్ సమ్మిట్‌లో జమ్ముకశ్మీర్ సిఎం అబ్దుల్లా



**న్యూఢిల్లీ :** ప్రతిపక్ష ఇండియా కూటమి ప్రస్తుతం 'లైఫ్ సపోర్ట్' పై ఉందని జమ్ము కశ్మీర్ ముఖ్యమంత్రి, నేషనల్ కాన్ఫరెన్స్ నాయకుడు ఒమర్ అబ్దుల్లా పేర్కొన్నారు. అంతర్గత కలహాలు, బిజెపి నిరంతరం ఎన్నికల యంత్రంతో సరిపోలడంలో వైఫల్యం కారణంగా ఐసియులోకి వెళ్లే ప్రమాదం ఉందని అన్నారు. శనివారం హిందూస్తాన్ టైమ్స్ లీడర్‌షిప్ సమ్మిట్‌లో అబ్దుల్లా మాట్లాడుతూ ప్రతిపక్ష కూటమి 'సంస్థాగత, వ్యూహాత్మక వైఫల్యాలను వివరించారు. ఇటీవలి బిహార్ ఎన్నికల తర్వాత ఇండియా కూటమి ప్రస్తుత పరిస్థితి గురించి మాట్లాడుతూ... 'మేము లైఫ్ సపోర్ట్‌పై ఉన్నాము, కానీ అప్పుడప్పుడు, ఎవరో ఒకరు తమను తట్టి బయటకు తెచ్చి షాక్ ఇస్తారు. మేము మళ్ళీ లేస్తాము. కానీ, దురదృష్టవశాత్తు, బిహార్ వంటి ఫలితాలు వస్తాయి. మేము మళ్ళీ పడిపోతాము. ఆపై ఎవరో మమ్మల్ని ఐసియులోకి నెడుతారు' అని అన్నారు. అయితే నితీష్ కుమార్ బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎలోకి తిరిగి రావడానికి ఇండియా కూటమిపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో పార్టీ ఉనికిలో ఉన్నప్పటికీ, బిహార్ సీట్ల పంపకాల ఒప్పందం నుండి జార్ఖండ్ ముక్తి మోర్చా (జెఎంఎం)ను ఉద్దేశపూర్వకంగా మినహాయించాలనే నిర్ణయాన్ని ఉటంకిస్తూ, కూటమి ఒక సంఘటిత దృక్పథాన్ని తీసుకోవడంలో విఫలమైందని కూడా ఆయన ఎత్తి చూపారు. ఇండియా కూటమి ఎన్నికల ప్రచారాన్ని బిజెపితో పోల్చిన అబ్దుల్లా, ప్రతిపక్ష కూటమి నిర్మాణాత్మకంగా పాలక పార్టీ క్రమశిక్షణా విధానంతో పోటీ పడలేకపోతోందని అన్నారు. వారికి అసమానమైన ఎన్నికల యంత్రం ఉందని ఆయన అన్నారు. వారు ఎన్నికలను ఎలా ఎదుర్కొనే విషయంలో కూడా వారికి అద్భుతమైన పని నీతి ఉంది... వారి జీవితాలు దానిపై ఆధారపడి ఉన్నట్లుగా వారు ప్రతి ఎన్నికలలో పోరాడుతారన్నారు. కొన్నిసార్లు తాము పట్టించుకోనట్లు ఎన్నికలలో పోరాడుతామని చెప్పుకొచ్చారు. భవిష్యత్ గురించి ఆలోచిస్తూ, ప్రతిపక్షాలు (బిజెపికి) తీవ్రమైన సవాలును ఎదుర్కోవడానికి ఏకైక మార్గం అతిపెద్ద భాగస్వామి అయిన కాంగ్రెస్ చుట్టూ చేరడమేనని అబ్దుల్లా అన్నారు. ముస్లిం ఓటర్ల గురించి అబ్దుల్లా మాట్లాడుతూ, ముస్లిం ఓటును సాంప్రదాయకంగా పొందేవారు సమాజాన్ని తేలికగా తీసుకొని, ఎన్నికలకు ముందు వారితో మాత్రమే పాల్గొనడం ద్వారా తప్పు చేశారని, ఇది ఐదేళ్ల మొత్తం కాలానికి మన లక్ష్యాన్ని సమర్థించడానికి సిద్ధంగా ఉన్న ఎంఐఎం వంటి పార్టీలకు ప్రయోజనం చేకూర్చే గందరగోళానికి దారితీసిందని సూచించారు. 2024 ఎన్నికల తర్వాత కేంద్రం తన విధానాన్ని మార్చుకుందని, కూటమి రూపంలో కూడా పనిచేయగలదని చూపించిందని కూడా ఆయన అన్నారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు (ఇవిఎంలు) రిగ్గింగ్ చేయబడ్డాయనే విస్తృత రాజకీయ ఆరోపణ నుండి ఎల్లప్పుడూ దూరంగా ఉండే అబ్దుల్లా, 'యంత్రాలు రిగ్గింగ్ చేయబడ్డాయని చెప్పేవారికి నేను ఎప్పుడూ మద్దతుదారుడిని కాదు' అని అన్నారు. జమ్ముకశ్మీర్‌లో ఇటీవల జరిగిన డీలిమిటేషన్ కసరత్తును అబ్దుల్లా ఎత్తి చూపారు. ఓటర్ల జాబితాలను తిరిగి మార్చడం ద్వారా, నిర్దిష్ట వర్గాల ఓటర్లను మినహాయించడం ద్వారా ఒక పార్టీ, దాని ఒక మిత్రపక్షానికి ప్రయోజనం చేకూర్చేలా రూపొందించబడిన కొత్త నియోజకవర్గాలను సృష్టించిన ఈ కసరత్తు ఎన్నికలను మార్చడంతో సమానమని వాదించారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) వంటి ఓటరు జాబితాను మార్చే ఏదైనా ప్రక్రియ పక్షపాతం గురించి ప్రశ్నలను నివారించడానికి పారదర్శకంగా, న్యాయంగా జరగాలని ఆయన ముగించారు.

## ఢిల్లీ పోలీసు నోటీసులు.. వేధింపులే!

### నేషనల్ హెరాల్డ్ కేసులో సమన్లు రావడంపై డికె శివకుమార్



**బెంగళూరు :** నేషనల్ హెరాల్డ్ కేసులో నోటీసులు రావడాన్ని వేధింపులుగా కర్నాటక ఉప ముఖ్యమంత్రి డికె శివకుమార్ అభివర్ణించారు. కేసు దర్యాప్తులో భాగంగా ఆర్థిక, లావాదేవీల వివరాలను కోరుతూ ఢిల్లీ పోలీసులు డికెకు నోటీసులు ఇచ్చారు. అయితే దానిపై చట్టపరంగా పోరాడతానని శివకుమార్ స్పష్టం చేశారు. ఈ చర్యను ఖండిస్తూ కేసుకు సంబంధించి ఇడి ఇప్పటికే ఛార్జిషీట్ దాఖలు చేసిందని, అయితే ఇప్పుడు ప్రత్యేక పోలీసు దర్యాప్తు అవసరం ఏమిటని ప్రశ్నించారు. ఆర్థిక నేరాల విభాగం (ఇఒడబ్ల్యూ) జారీ చేసిన నోటీసులో కాంగ్రెస్ నాయకులు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలపై ఈ ఏడాది అక్టోబర్ 3న నమోదైన నేషనల్ హెరాల్డ్ కేసుకు సంబంధించి శివకుమార్ వద్ద కీలకమైన సమాచారం ఉండవచ్చని భావిస్తున్నట్లు పేర్కొంది. 'ఇది నాకు చాలా షాకింగ్ గా ఉంది. నేను ఇడికి అన్ని వివరాలు అందించాను. ఇడి నన్ను, నా సోదరుడిని (మాజీ ఎంపి డికె సురేష్) కూడా పిలిపించింది. ఇందులో తప్పు ఏమీ లేదు, ఇది మా (పార్టీ) సంస్థ (నేషనల్ హెరాల్డ్ యంగ్ ఇండియా), మేము కాంగ్రెస్ సభ్యులం, మేము సంస్థకు మద్దతు ఇచ్చాము, దాగుడుమూతలు లేవు, ప్రతిదీ నలుపు, తెలుపు రంగులో ఉంది' అని శివకుమార్ అన్నారు. శనివారం డికె మీడియాతో మాట్లాడుతూ ఇడి ఛార్జ్ షీట్ దాఖలు చేసిన తర్వాత పోలీసులు (ఢిల్లీ పోలీసులు) కేసు నమోదు చేయవలసిన అవసరం లేదన్నారు. తాము కేసును ఎదుర్కొంటామని, దానిపై న్యాయస్థానంలో పోరాడుతామన్నారు. నవంబర్ 29 నాటి నోటీసులో శివకుమార్ తమ ముందు హాజరు కావాలని లేదా ఈనెల 19 లోపు అభ్యర్థించిన సమాచారాన్ని అందించాలని ఇఒడబ్ల్యు సమన్లు జారీ చేసింది. ఈ చర్యను ఆయన వేధింపుగా అభివర్ణించారు. ఇప్పటికే మనీలాండరింగ్ నిరోధక చట్టం (పిఎంఎల్‌ఎ)19న హాజరు అవుతారా అని మీడియా ప్రశ్నించగా, చట్టపరమైన చిక్కులను పరిశీలిస్తానని శివకుమార్ బదులిచ్చారు.

## ద్వేషాన్ని వ్యాప్తి చేసే మతతత్వ శక్తులపై నిరంతర పోరాటం

### పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ

**కోల్‌కతా :** ద్వేషాన్ని వ్యాప్తి చేసే మతతత్వ శక్తులపై పోరాటం కొనసాగుతుందని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ పేర్కొన్నారు. దేశ రాజ్యాంగంలోని ఆదర్శాలు, సూత్రాలను రక్షించడానికి, బలోపేతం చేయడానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ముర్షిదాబాద్ జిల్లా బెల్దంగాలో అయోధ్యలోని బాబ్రీ మసీదు తరహాలో మసీదు నిర్మాణానికి సస్పెన్షన్‌కు గురైన టిఎంసి ఎమ్మెల్యే హుమాయున్ కబీర్ శంకుస్థాపన సందర్భంగా మమతా పై విధంగా వ్యాఖ్యానించారు. ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్యలో బాబ్రీ మసీదు కూల్చివేత వార్షికోత్సవం అయిన డిసెంబర్ 6న ప్రతిపాదిత మసీదుకు శంకుస్థాపన కార్యక్రమాన్ని కబీర్ ప్రకటించారు. సామరస్యం, శాంతి, విభజన శక్తులకు వ్యతిరేకంగా పోరాటం కోసం పిలుపునిస్తూ టిఎంసి ఇదే రోజున 'సంహతి దివస్' (ఐక్యత దినోత్సవం)గా పాటించాలని ప్రణాళిక వేసింది. ఎక్స్ వేదికగా బెనర్జీ స్పందిస్తూ 'బెంగాల్ నేల ఐక్యతకు నిలయం. ఇది రవీంద్రనాథ్ (టాగోర్) భూమి, నజ్రుల్ (ఇస్లాం) భూమి, రామకృష్ణవివేకానంద భూమి. ఈ భూమి ఏ విభజన చర్యకు ఎప్పుడూ తల వంచలేదు. రానున్న రోజుల్లో కూడా అలా చేయదు' అని అన్నారు. 'హిందువులు, ముస్లింలు, సిక్కులు, క్రైస్తవులు, జైనులు, బౌద్ధులు బెంగాల్‌లో ఉన్నారు. మేము భుజం భుజం కలిపి ఎలా నడవాలో తెలుసు. మేము ఒకరితో ఒకరం ఆనందాలను పంచుకుంటాం. ఎందుకంటే మత విశ్వాసాల ప్రకారం స్వంత విశ్వాసాన్ని ఆచరించడం ప్రతి ఒక్కరికీ చెందుతుంది.

## 10 నుండి భారత్–అమెరికా కీలక వాణిజ్య చర్చలు షురూ

### సుంకాల తగ్గింపు,ఎగుమతుల పెంపే లక్ష్యం



**న్యూఢిల్లీ:** భారత్–అమెరికా మధ్య ప్రతిపాదిత ద్వైపాక్షిక వాణిజ్యం తొలిదశ ఒప్పందంపై డిసెంబరు 10వ తేదీ నుండి చర్చలు ప్రారంభమవుతాయి. మొదటిదశ ద్వైపాక్షిక ఒప్పందాన్ని ఖరారు చేయడానికి ఉద్దేశించిన ఎంతో కీలకమైన ఈ చర్చలు మూడురోజులపాటు జరుగుతాయని సంబంధితవర్గాలు శనివారం ప్రకటించాయి. అమెరికా వాణిజ్యమంత్రిత్వశాఖ ప్రతినిధి బృందం భారత్‌లో పర్యటించనున్నది. ట్రంప్ సుంకాల భారాలు పెంచిన తర్వాత వరుసగా సెప్టెంబరు, అక్టోబరునెలల్లో భారత్ నుండి అమెరికాకు ఎగుమతులు 8.58 శాతం మేరకు తగ్గిపోయాయి. దీనివల్ల 6.3 బిలియన్ డాలర్ల విలువైన విదేశీ మారకద్రవ్యాన్ని దేశం కోల్పోయింది. అందువల్ల అమెరికా ప్రతినిధి బృందం పర్యటన, ఈ ఒప్పందం ఖరారు కావడం భాదరత్‌కు ఎంతో ముఖ్యమైనది కావడంతో కేంద్ర వాణిజ్యమంత్రిత్వశాఖ ఆచితూచి వ్యవహరించనున్నది. ఈ చర్చల్లో అమెరికా వాణిజ్య బృందానికి ప్రజాప్రతినిధి రిక్ స్విట్జర్ నాయకత్వం వహిస్తారు. భారత్‌పై భారీస్థాయిలో 50 శాతం సుంకాలు ట్రంప్ యంత్రాంగం విధించిన తర్వాత ఈ ప్రతినిధిబృందం చర్చల నిమిత్తం మనదేశానికి రావడం ఇది రెండోసారి. భారత్ నుండి వసూలు చేసే సుంకాలు చాలా చాలా తక్కువగా ఉన్నాయంటూ ట్రంప్ 25 శాతం మేరకు భారాలు వేశారు. రష్యా నుండి ముడిచమురు దిగుమతి చేసి, శుద్ధిచేసి ఇతర దేశాలకు విక్రయించడంద్వారా ఉక్రేన్‌లో రష్యా యుద్ధం చేయడాన్ని ఉసిగొల్పుతున్నారని ఆరోపిస్తూ మరో 25 శాతం సుంకాలను భారత్‌పై జరిమానాగా విధించారు. ఈ సుంకాలను తగ్గించుకునేందుకు, రాబోయే ఐదేళ్ళల్లో అమెరికాకు వాణిజ్య ఎగుమతుల లక్ష్యాన్ని పెంచుకునేందుకు ఈ సమస్యను చాలా సున్నితంగా పరిష్కరించాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తుండగా, మన వ్యవసాయ మార్కెట్‌ను చేజిక్కించుకోవాలనుకుంటున్న అమెరికా వాణిజ్య ప్రతినిధి బృందం, ఈ ఒప్పందం ద్వారా భారత్‌ను ఇరకాటంలో పడేసేందుకు ప్రయత్నిస్తున్నది. ఈ పరిణామాల మధ్య ఒప్పందంలో జాప్యం జరుగుతున్నది. ఈ ఏడాది సెప్టెంబరు 16వ తేదీన అమెరికా వాణిజ్యమంత్రిత్వశాఖ ప్రతినిధి బృందం మనదేశంలో పర్యటించింది. తర్వాత ఐదు రోజులకు వాణిజ్య,పరిశ్రమలశాఖా మంత్రి పీయూశ్ గోయల్ బృందం కూడా అధికారికంగా సెప్టెంబరు 22న చర్చల నిమిత్తం అమెరికా వెళ్ళింది. అంతకుముందు మే నెలలో కూడా గోయల్ వాషింగ్టన్‌లో పర్యటించారు. దక్షిణ,మధ్య ఆసియాలో అమెరికా వాణిజ్య ప్రతినిధి బ్రెండన్ లించ్ ఈ ఒప్పంద చర్చల్లో ప్రధాన సంప్రదింపులకర్తగా వ్యవహరిస్తుండగా, కేంద్ర వాణిజ్యశాఖా సంయుక్త కార్యదర్శి దర్పణ్ జైన్ భారత్ తరపున వాణిజ్య చర్చలకు నాయకత్వం వహిస్తున్నారు. రెండు దేశాలమధ్య వాణిజ్య ఈ ఏడాదిలోనే ఒప్పందం కుదురుతుందని వాణిజ్యశాఖ కార్యదర్శి రాజేశ్ అగర్వాల్ ఇటీవల ఆశాభావం వ్యక్తం చేశారు. సుంకాల సమస్య పరిష్కారమైతే మన ఎగుమతిదారులకు ప్రయోజనం కలుగుతుందని అన్నారు. ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం (బిటిఎ) కుదరడానికి చాలా సమయం పడుతుందని అగర్వాల్ చెబుతూ, సుంకాల సమస్యను పరిష్కరించడానికి ఉద్దేశించిన వాణిజ్య నిబంధనల చట్రంకోసం ఒక చర్చలు కాగా, సమగ్ర వాణిజ్య ఒప్పందం కోసం మరో చర్చలు రెండు రకాలుగా జరుగుతున్నాయన్నారు. ఈ ఏడాది ప్రారంభం ఫిబ్రవరినెలలో రెండు దేశాల నాయకులూ ఈ ఒప్పందంపై సంప్రదింపులు జరపాల్సిందిగా సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఈ ఏడాది ముగిసేనాటికి మొదటిదశ ఒప్పందం పూర్తి కావాలని లక్ష్యంగా నిర్దేశించారు. ఇప్పటివరకూ రెండు దేశాల ప్రతినిధులమధ్యా ఆరు విడతలుగా చర్చలు జరిగాయి. ప్రస్తుతం ఉన్న 191 బిలియన్ డాలర్ల ప్రస్తుత ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 2030వ సంవత్సరం నాటికి రెట్టింపు పైగా అంటే 500 బిలియన్ డాలర్లు స్థాయికి తీసుకువెళ్ళాలనే లక్ష్యంతో ఒప్పందానికి భారత్ కృషి చేస్తోంది. 2024–25 ఆర్థిక సంవత్సరంలో అమెరికా వరుసగా నాలుగో ఏడాది కూడా భారత్‌కు అతిపెద్ద వాణిజ్య భాగస్వామిగా కొనసాగింది. గత ఆర్థిక సంవత్సరంలో 131.84 బిలియన్ డాలర్లు విలువైన ద్వైపాక్షిక వాణిజ్యం అంటే 86.5 బిలియన్ల ఎగుమతులను భారత్ చేసింది.




## మెదళ్లలోనే నేరుగా నైపుణ్యాలు!



ఏ రంగంలోనైనా నైపుణ్యాలు పెంచుకోవాలంటే శ్రమించాలి. కృషి, పట్టుదలతో నేర్చుకోవాలి. నిరంతర సాధన చేస్తూ, నైపుణ్యానికి మెరుగులు దిద్దుకోవాలి. ఇలాంటి సమస్యలేవీ లేకుండా, నేరుగా మెదళ్లలోకే నైపుణ్యాలను జొప్పిస్తే ఎలా ఉంటుంది? ఇది ఒక విచిత్రమైన ఆలోచన. హెచ్‌ఆర్‌ఎల్ లేబొరేటరీస్ అనే సంస్థ 'ట్రాన్స్‌క్రానియల్ డైరెక్ట్ కరెంట్ స్టిమ్యులేషన్' (టిడిసిఎస్) అనే పద్ధతిలో ఇలాంటి ప్రయోగాన్ని నిర్వహిస్తున్నది. అయితే, ఒక చిన్న వాస్తవానికి అతి పెద్ద స్థాయిలో అభూత కల్పనలు జోడించి, మెదళ్లలోకి నైపుణ్యాలను జొప్పించే ప్రక్రియ మొదలైనట్టు వార్తలు, ఫొటోలు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి. ఇందులో నిజానిజాలను పరిశీలిస్తే, హెచ్‌ఆర్‌ఎల్ సంస్థ 2016లో 32 మందిపై టిడిసిఎస్ విధానంలో ప్రయోగం చేసింది. మెదడుకు చేసిన ఇఇజితో పాటు, రక్తంలో ఆక్సిజన్ మార్పులను ట్రాక్ చేసే ఎఫ్ఎన్ఐఆర్ఎస్ పరీక్షలు నిర్వహించి, మెదడు పనితీరు, మార్పులను అధ్యయనం చేశారు. టిడిసిఎస్ ద్వారా మెదడుకు అతి తక్కువ స్థాయిలో స్టిమ్యులేట్స్‌ను పంపినవారు, మిగతా వారితో పోలిస్తే నైపుణ్యాలను 33 శాతం వేగంగా నేర్చుకున్నట్టు గుర్తించారు. అయితే, ప్రయోగం ఇంకా ప్రారంభ దశలోనే ఉంది. క్లినికల్ ట్రయల్స్ కూడా మొదలు కాలేదు. అప్పుడే 'మ్యాట్రిక్స్ స్టయిల్ స్కిల్ అప్‌లోడింగ్' అంటూ హడావుడి చేయడంలో అర్థం లేదు. ఒక చిన్న ప్రయోగాన్ని ఇంతలా పెద్దదిచేసి చూపించడం సోషల్ మీడియా వికృత పోకడలకు నిదర్శనం. మెదళ్లలోకి నేరుగా నైపుణ్యాలను జొప్పించగలిగితే, ప్రపంచంలో అందరూ ఐన్‌స్టీన్లు.. థామస్ అల్వా ఎడిసన్లే ఉంటారు.

## ఎఐ అజేయశక్తి కాదు!



కృత్రిమ మేధస్సు (ఎఐ)ని సర్వజ్ఞానిలా భావిస్తూ, అజేయ శక్తిగా ఆరాధిస్తున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్నది. కానీ, మనిషి మేధస్సు ఎఐ కంటే గొప్పదని నిరూపించిన ఘటనలు లేకపోలేదు. ఈ ఏడాది జులైలో జరిగిన ఓ ఆన్‌లైన్ చెస్ మ్యాచ్‌లో చాట్‌జిపిటిని ప్రపంచ మాజీ చాంపియన్ మాగ్నస్ కార్ల్‌సెన్ ఓడించి, సంచలనం సృష్టించాడు. 53 ఎత్తుల వరకూ సాగిన ఈ గేమ్‌లో కార్ల్‌సన్ ఒక్క పావును కూడా కోల్పోలేదు. ప్రపంచ చెస్ సమాఖ్య అతనికి 2900 రేటింగ్ ఇస్తే, చాట్‌జిపిటి 1800 నుంచి 2000 వరకూ ఉండవచ్చని నిర్ధారించింది. తక్కువ అంచనా వేసినందుకు మూల్యాన్ని చెల్లించుకుంది. ఇది కార్ల్‌సన్ వ్యక్తిగత విజయం మాత్రమేకాదు.. ప్రపంచాన్ని శాసిస్తున్న ఎఐని కట్టడి చేసిన అసాధారణ గెలుపు. ఎఐని సర్వజ్ఞాని అనుకోవడం తప్పు. అది కేవలం మనుషులు అందించిన సమాచారాన్ని క్రోడీకరించి, తిరిగి ఇస్తుందే తప్ప, సొంతంగా ఆలోచించదు. స్పందించదు. నిర్ణయాలు తీసుకోదు. ఏదిఏమైనా మనిషి మనిషే.. యంత్రం యంత్రమే!

## ఏ తరం ఎవరిది?



నేపాల్ రాజకీయాల్లో సునామీ సృష్టించిన ఉద్యమ సమయంలో 'జెన్ జెడ్' ('జెన్ జీ'గా కూడా పిలుస్తారు) పదం విస్తృతంగా ప్రచారంలోకి వచ్చింది. ఖచ్చితమైన శాస్త్రీయ వర్గీకరణ కాకపోయినప్పటికీ, ఒక్కో తరంలో పుట్టిన వారిని ఒక్కో రకంగా పిలవడం సామాన్యమైంది. తరాల మధ్య అంతరాన్ని హాస్యంగా లేదా వ్యంగ్యంగా చూపడాని కి కూడా వర్గీకరణలు ఉపయోగపడుతున్నాయి. కాగా, వివిధ తరాలను విభజించినప్పటికీ, ఇది కేవలం ఒక రకమైన స్థూల అవగాహన కోసం మాత్రమేనని గుర్తుంచుకోవాలి. ఎందుకంటే, ఒక తరానికి చెందిన వారినందరినీ ఒకే గాడికి కట్టడానికి వీల్లేదు. నిజ జీవితంలో ప్రతి తరంలోనూ అన్ని రకాల వ్యక్తులు ఉంటారు. పరిస్థితులు, దేశం, వర్గం, వ్యక్తిగత అనుభవాలు కలిసి మన స్వభావాన్ని నిర్ణయిస్తాయి, కేవలం పుట్టిన సంవత్సరం కాదు.

ఒక్కో తరానికి మధ్య తేడా 15 నుంచి 20 సంవత్సరాలుగా తీసుకుంటే, వివిధ తరాల విభజన ఇలా కొనసాగుతుంది.

1946కు ముందున్న తరాన్ని 'సైలెంట్ జనరేషన్' అంటారు. వీరు నియమాలు పాటించేవారు..గొడవపడకుండా నిశ్శబ్దంగా పని చేసినవారు.. నిజానికి వీళ్లపై పరిశోధనలు కూడా క్రమశిక్షణ, విధేయత ఎక్కువ.



బేబీ బూమర్స్ (1946–1964): యుద్ధాల అనంతరం జనాభా ఒక్కసారిగా పెరిగిన కాలం. లైఫ్‌ని ఫుల్‌గా ఎంజాయ్ చేసి, ఇప్పుడు రిసోర్సులు, అవకాశాలు తక్కువగా ఇస్తారని అంటారు గానీ, వాస్తవంగా వీరిని ఉద్యోగానికి నిబద్ధత ఎక్కువగా ఉన్న వారిగా, కానీ మార్పుల పట్ల కొంచెం ప్రతిఘటన చూపేవారిగా చూడాలి.


జనరేషన్ 'ఎక్స్' (1965–1980): టివి, కంప్యూటర్ మొదలైనవి మొదటిసారి జీవితంలోకి వచ్చిన తరం. ఈ తరానికి చెందిన వారు ఎవరినీ పూర్తిగా నమ్మరు, కానీ నిశ్శబ్దంగా పెద్ద బాధ్యతలు తీసుకుంటారు అనే ఎక్స్‌ప్రెషన్ ఉంది. వీరిని 'లాచ్‌కీ జెనరేషన్' అని, స్వతంత్రత, ప్రాక్టికల్ మైండ్ ఎక్కువగా ఉన్నవారని అంటారు.

మిలినియల్స్ లేదా జెన్ 'వై' (1981–1996): ఇంటర్నెట్, మొబైల్, గ్లోబలైజేషన్ మధ్య పెద్దయ్యారు. అర్థం, పర్పస్ కోసం పరుగెత్తి, ఇప్పుడు బర్నౌట్‌తో ఉంటూ కూడా బాగున్నట్లు నటిస్తున్నారనే అపవాదు ఉంది. డేటాలో వీరు ఉద్యోగ–ప్రెజర్, స్టూడెంట్ లోన్, గిగ్ ఎకానమీ వల్ల మెంటల్ స్ట్రెస్ ఎక్కువగా ఫేస్ చేస్తున్న తరం అని వస్తుంది.

జెన్ 'జెడ్' లేదా జెన్ జీ (1997–2012): స్మార్ట్‌ఫోన్స్, సోషల్ మీడియా పూర్తిగా సాధారణమైన కాలంలో పుట్టినవారు. అన్నింటినీ ప్రశ్నించే, ఎవరినీ నమ్మలేని, కానీ భావోద్వేగంగా చాలా సెన్సిటివ్ తరం. అనేక సర్వేల్లో వీరి గురించి డిజిటల్ నేటివ్స్, సోషల్ జస్టిస్‌కి తగినంత శబ్దం చేసే, మెంటల్ హెల్త్‌పై ఓపెన్‌గా మాట్లాడే తరం అని పాయింట్లు కనిపిస్తాయి

జెన్ 'అల్ఫా' (2010– 2020): స్క్రీన్‌లు, టచ్ డివైసులు పుట్టుకతోనే చేతిలో ఉన్న తరం. ఐపాడ్‌లు, యూట్యూబ్‌తో పెరిగే పిల్లలు. వీరి భవిష్యత్తు ఎలా ఉంటుందనేది చూడాలి. వీరు పూర్తిగా 21వ శతాబ్దంలో, కృత్రిమ మేధస్సు (ఎఐ), పర్యావరణ మార్పులు, హైపర్ కనెక్టెడ్ ప్రపంచంలో పెరిగే మొదటి తరం కాబట్టే, వీరి విలువలు ఇంకా రూపొందుతున్నాయని అంటున్నారు.

## ఉపరితలాన్ని మార్చేస్తున్నాం!



పర్యావరణ సమస్యలు ఎన్ని ఎదురవుతున్నప్పటికీ, మనిషి తనతోపాటు, యావత్ జీవజాలాన్నీ ప్రమాదంలో పడేస్తునే ఉన్నాడు. గనులకోసం కొండలను తవ్వడం, నదుల దారులు మళ్లించడం, లోయలంతా ఆనకట్టలతో నింపడం వంటి చర్యలతో, ఏకంగా భూమి ఉపరితలాన్ని మార్చేస్తున్నాడు. ఈ చేష్టలు తీవ్ర పరిణామాలకు కారణమవుతున్నాయని శాస్త్రవేత్తలు స్పష్టం చేస్తున్నారు. తాజా జియోఫిజికల్ రీసెర్చ్ అధ్యయనాలను అనుసరించి, మనిషి ఏకంగా భూభ్రమణ కక్ష్యాన్ని కదిలించేస్తున్నాడు. 19వ శతాబ్దం నుండి ప్రపంచవ్యాప్తంగా నిర్మించిన ఆనకట్టల ప్రభావంతో 1835 నుండి 2011 మధ్య భూమి భౌగోళిక ధృవాలు సుమారు 1.1 మీటర్లు (3.7 అడుగులు) మారిపోయాయి. స్పష్టంగా చెప్పాలంటే, కాంక్రీట్ గోడల వెనకాల ట్రిలియన్ల టన్నుల నీటిని నిల్వచేయడం ద్వారా, మనం గ్రహం తిరిగే విధానాన్ని స్వల్పంగా మార్చేశాం. భారీ జలాశయా లు నీటితో నిండినప్పుడు, అవి భూమి ద్రవ్యరాశిని పునర్విభజిస్తాయి. భూమిని ఒక తిరిగే భ్రమరంతో పోలిస్తే, ఒక వైపు అదనపు బరువు పెడితే దాని సమతుల్యం మారుతుంది. హూవర్ డ్యాం నుండి త్రీ గోర్జెస్ వరకు ప్రతి కొత్త ఆనకట్ట ఈ విధమైన ఒక్కో చిన్న మార్పు చేసింది. ఫలితంగా, గణనీయమైన మార్పును కలిగించాయి. శాస్త్రవేత్తల అంచనా ప్రకారం, కృత్రిమ జలాశయాలు గ్రౌండ్ కాన్యాన్‌ను రెండుసార్లు నింపగలిగేంత నీటిని నిల్వ చేశాయి. ఈ నీటి నిల్వ భూమి సహజ సమతుల్య స్థితి నుండి ద్రవ్యరాశిని కొంత మేర లాగేసింది. ట్రూ పోలార్ వాండర్ అని పిలువబడే ఈ ప్రక్రియ సాధారణంగా భూగర్భ శిలా చలనాలు లేదా హిమానీనదాల మార్పుల వల్ల జరుగుతుంది. సాధారణంగా సముద్రంలో చేరే నీరు ఇప్పుడు భూభాగంలోనే నిలిచిపోవడమే ఇందుకు కారణం.

— బిఎస్ఎస్ మైత్రేయి

## రూపాయి మారక విలువ పతనం

ఏ దేశంలోనైనా దాని కరెన్సీ విలువ బలం ఆ దేశ ఆర్థిక వ్యవస్థ పటుత్వానికి అద్దం పడుతుంది. అంతర్గత పనితీరుకు సంబంధించి గణాంకాలు ఉట్టంకిస్తూ గొప్పలకు పోవచ్చు. కాని కరెన్సీ మారక విలువ క్షీణింపు ప్రజల జీవితాలపై ప్రతికూల ప్రభావం చూపుతూనే ఉంటుంది. మన రూపాయి నిరంతరాయంగా విలువ కోల్పోతూ ప్రస్తుతం 90 రూపాయలకు పైగా వెచ్చిస్తేగాని ఒక డాలరు దక్కని స్థితికి చేరాం. ఇది చారిత్రికంగా అత్యధిక రేటు. ఇది ఎక్కడ ఆగుతుంది లేదా ఎంత క్షీణింపువరకు వెళుతుంది అనే తర్కం అంతర్జాతీయ మార్కెట్‌లో అనేక సానుకూల, ప్రతికూల అంశాలపై ఆధారపడి ఉంటుంది. రూపాయి విలువ పతనం కొనసాగుతుందని ట్రేడర్లు, ద్రవ్య మార్కెట్ ఆపరేటర్ల లో కొందరు అభిప్రాయపడుతున్నారు. 1992 లో తొలిసారి రూపాయిని ఫ్లోటింగ్ కరెన్సీల బాస్కెట్‌లో (కరెన్సీ విలువను మార్కెట్ నిర్ణయించే పద్ధతి) చేర్చటం జరిగింది. అది ఆశ్చర్యకరంగా రూపాయి బలాన్ని పెంచింది, తర్వాత గణనీయంగా క్షీణించింది. తర్వాత చాలాకాలం నిలకడగా ఉండింది. 1993 మార్చిలో రూపాయి మార్పిడిని పూర్తిగా మార్కెట్‌లో పెట్టినపుడు దాని విలువ డాలరుకు రూ.31.52. ఒక దశాబ్దం తర్వాత దాని విలువ రూ.48.39 పైసలకు తగ్గింది, 2007–08లో రూ.40.28 పైసలకు భారీగా పుంజుకుంది. అమెరికాలో సబ్‌ప్రైమ్ సంక్షోభంతో వ్యాప్తిచెందిన ప్రపంచ ఆర్థిక మాంద్యం నుంచి కోలుకున్నాక, 2009లో రూపాయి విలువ మళ్లీ రూ.47.44 కు దిగజారింది. ఆ తర్వాత 'ట్యాపర్ తంత్రాలు' గా పిలవబడిన సంవత్సరాల్లో రూపాయి విలువ ఒక డాలరుకు రూ.50 నుంచి రూ.60కి క్షీణించింది. అమెరికా ఫెడరల్ రిజర్వు తమ డాలర్‌ను పటిష్టవంతం చేయటానికి తమ మానిటరీ విధానంలో మార్పులు చేయటం, పెద్ద ఎత్తున డాలర్లను మార్కెట్‌కు విడుదల చేయటాన్ని కోతపెట్టిన తంత్రాల కాలమది. ఇప్పుడు, అమెరికాకు భారతదేశ ఎగుమతులపై ట్రంప్ భారీగా సుంకాలు పెంచినందుకు దేశ ఆర్థికవ్యవస్థ అస్థిమితను ఎదుర్కొంటుండగా రూపాయి విలువ భారీగా క్షీణిస్తున్నది. ప్రస్తుతం అమెరికా పెట్టుబడిదారులు మన స్టాక్, రుణమార్కెట్ల నుంచి ఒక బిలియన్ డాలర్లుపైగా ఉపసంహరించుకుని మరింత ఆదాయం వచ్చే దేశాలకు తరలించారు. అమెరికాకు మన ఎగుమతులు తగ్గిపోయి డాలర్ల ఆర్జన తగ్గిపోయింది.

ప్రజాపక్షం 07-12-2025, ఆదివారం

ఎందుకిలా జరుగుతున్నది? అని ఆలోచిస్తే రెండు, మూడు ప్రధాన కారణాలు కనిపిస్తాయి. ఒకటి, ప్రపంచ మార్కెట్లు, ఆర్థిక వ్యవస్థల్లో కల్లోలం, అస్థిరత. రెండు, భారతదేశం, దాని వాణిజ్య భాగస్వామ్య దేశాల్లో ద్రవ్యోల్బణం మధ్య వ్యత్యాసం. మూ డు, వాస్తవిక ఆర్థిక వ్యవస్థలోని లోపాలు ద్రవ్య మార్కెట్‌లోకి ప్రవేశించి కరెన్సీ మారక మార్కెట్‌పై ప్రభావం చూపుతున్నాయి. పైన చెప్పినట్లు విదేశీ పెట్టుబడిదార్లు పెద్దఎత్తున తమ మదుపు ఉపసంహరించుకోవటం అతి పెద్ద తక్షణ కారణం. డాలర్ అతిముఖ్యమైన ఏకైక కరెన్సీగా ఉన్నందున వారు తమ డబ్బును డాలర్ మార్కెట్‌కు తీసుకెళుతుంటారు. భారతదేశ ద్రవ్యోల్బణం రేట్లు 5శాతం పైగా ఉండగా, ప్రధాన ఆర్థిక వ్యవస్థల్లో 2 శాతంలోపు ఉంది.

అయితే చైనా కరెన్సీ రెన్‌మిన్‌బి విలువ డాలర్‌తో దృఢంగా ఉంది. భారత్, చైనా ఆర్థిక వ్యవస్థల మూలాధారాల్లో తీవ్రమైన తేడాలే ఇందుకు కారణం. చైనా తమ వస్తూత్పత్తి పరిశ్రమను గత నాలుగు దశాబ్దాల్లో భారీగా అభివృద్ధి చేసుకుని పోటీగా నిలబడటమే ముఖ్యాంశం.

ఇదే సమయంలో భారత రిజర్వుబ్యాంక్ తమ రెపో రేటును (బ్యాంకులకు ఆర్‌బిఐ సమకూర్చే ధనానికి వసూలు చేసే వడ్డీరేటు) డిసెంబర్ 5న మరో 0.5 శాతం తగ్గించింది. ఇది డాలర్‌తో రూపాయి విలువ పతనాన్ని అడ్డుకునేందుకు కాదని, దేశీయ మార్కెట్‌కు ప్రోత్సాహకంగా ధన లభ్యతను పెంచటానికి, వడ్డీరేట్లు తగ్గింపు ద్వారా ఉపశమనం కలిగించేందుకు ఉద్దేశించిందని ఆర్‌బిఐ గవర్నర్ సంజయ్ మల్‌హోత్రా స్పష్టం చేశారు. రూపాయి తన విలువను ద్రవ్య మార్కెట్‌లో అదే స్థిరపరుచుకుంటుందన్నారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థల్లో అస్థిమిత వాతావరణం, విదేశీ వడగాడ్పులు (వాణిజ్య ఉద్రిక్తతలు, పెట్టుబడి ఉపసంహరణ), ఆర్‌బిఐ వడ్డీరేట్ల తగ్గింపు ప్రభావాలు సానుకూలంగా మారాలంటే పెట్టుబడులు తరలిపోవటం ఆగాలి, ఎగుమతులు పెరగాలి, అంతర్జాతీయ మార్కెట్ పరిస్థితుల్లో మార్పు రావాలి. లేనట్లయితే 2026 లో రూపాయి విలువ మరింత క్షీణిస్తుంది. దీనివల్ల దిగుమతి చేసుకునే వస్తువుల ఖరీదు పెరిగి ఆ వస్తువుల ధరాభారం వినియోగదారులపైకి వస్తుంది. ద్రవ్యోల్బణం పెరుగుతుంది. మన ఎగుమతులు చౌక అయి డాలర్ల ఆర్జన తగ్గుతుంది. ఇదొక విషవలయం.

# సాంప్రదాయక, ఆధునిక జ్ఞానాలు వేరుదారులా?



డాక్టర్ రాం పునియానీ

ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఇటీవల రాంనాథ్ గోయెంకా స్మారకోపన్యాసం చేస్తూ, మన వలసవాద పాలన కాలపు మనస్తత్వాన్ని పదేళ్లలో తొలగిస్తామని ప్రతిన తీసుకోవాలని అన్నారు. లార్డ్ మెకాలే ఇంగ్లీషులో వారి తరహా విద్యను ప్రవేశపెట్టి పదేళ్లలో 200 సంవత్సరాలు అవుతుంది. మోదీ ఏమన్నారంటే, ''దేశీయ జ్ఞాన వ్యవస్థలను కూల్చివేసి, వలసవాద విద్యను ప్రవేశపెట్టటం ద్వారా భారతీయ ఆలోచనను కొత్తదారిలో పెట్టటం మెకాలే ప్రాజెక్టు ఉద్దేశం'' అన్నారు. 'ఆకారంలో భారతీయులుగా ఉన్నవారిని ఆలోచనలో బ్రిటిషువారిగా' మార్చటం మెకాలే నేరం అని కూడా ప్రధాని అన్నారు. ఈ వ్యవస్థ భారతదేశ ఆత్మవిశ్వాసాన్ని ముక్కలు చేసి ఆత్మన్యూనత భావాన్ని ప్రవేశపెట్టిందన్నారు. (ఇండియన్ ఎక్స్‌ప్రెస్, నవంబర్ 18,2025).

మోదీ ఆర్ఎస్ఎస్, హిందూత్వ జాతీయతత్వం ప్రచారకుడు. ఈ భావజాలం ఇంతవరకు 'దుష్ట ముస్లిం రాజుల'పైన, వారు హిందూ దేవాలయాలు బద్దలుకొట్టటం, హిందువులపై ఇస్లాంను విధించటం వంటి చర్యలతో హిందువులకు వ్యతిరేకంగా సాగించిన అత్యాచారాలపై ఎక్కువగా దృష్టి సారించింది. ఈ కథనం ప్రకారం, భారతదేశానికి గతంలో స్వర్ణయుగం ఉండింది, ముస్లిం దండయాత్రికులు రావటం దుష్ట అలవాట్లను ఇక్కడికి తెచ్చింది. ఇప్పుడు హిందూ జాతీయవాద తాత్వికులు బ్రిటిషు పాలన ప్రవేశపెట్టిన 'వలసవాద ఆలోచన'ను దాని దుష్టత్వంగా కొంతకాలంగా దానిపై దృష్టి పెడుతున్నారు. అది సాంప్రదాయక జ్ఞానాన్ని, చింతనా వ్యవస్థలను అణచివేసిందంటున్నారు.

మహాత్మాగాంధి నాయకత్వం కింద భారత ప్రజాబాహుళ్యం వలసవాద పాలనకు వ్యతిరేకంగా అన్ని స్థాయిల్లో పోరాటం చేస్తుండగా తమ కేమీ పట్టనట్లు దూరంగా ఉన్న భావజాలం అనుచరుల నుంచి ఈ ఆలోచనలు వస్తున్నాయి.

మోదీ భావిజాలికులు మన జాడ్యాలకు మెకాలేను నిందిస్తుండగా, చంద్రభాన్ ప్రసాద్ వంటి దళిత తాత్వికులు మెకాలే చేసిన దోహదాన్ని హర్షిస్తున్నారు. ఆయన దోహదం కాలక్రమంలో దళితులు, ఇతర అణగారిన తరగతులు ఆత్మగౌరవం, హక్కులకోసం పోరాడేట్లు చేసిందనేది వారి భావన.

మెకాలే/బ్రిటీష్‌వారు ప్రవేశపెట్టిన సంస్కృతి సరళరేఖగా ప్రయాణించిందని మోదీ ఆయనలాంటి ఆలోచనాపరులు భావిస్తున్నారు. అయితే వారు భాష, మతం ప్రాతిపదికగా ఐరోపా తరహా జాతీయతత్వంకోసం నిలబడటం ఆసక్తిదాయకం. భారతదేశంలో అభివృద్ధిచెందినట్టిది అంతకన్నా ఎన్నోరెట్లు సంక్లిష్టమైంది. ఇంగ్లీషు విద్య ప్రవేశపెట్టటం ఆధునిక ఉదారవాద భావాలు ప్రవేశించేందుకు దోహదకారి అయింది, విద్య నిరాకరించబడిన దళితులు, మహిళలు వంటి సామాజిక విభాగాలకు జ్ఞాన సముపార్జన ద్వారాలు తెరవటానికి దారితీసింది. అప్పటికి గురుకులాలు కేవలం అగ్రవర్ణాల పురుషులకే పరిమితం.

భారతదేశంలో సుశ్రుత, ఆర్యభట్ట, బ్రహ్మగుప్త, లోకాయత, భాస్కర్ వంటివారు దోహదం చేసిన సాంప్రదాయక జ్ఞానం సమాజాన్ని చైతన్యం దిశలో నడిపించేందుకు గొప్ప ప్రభావం చూపాయి. ఆ జ్ఞానం సాంప్రదాయక ఉన్నత తరగతుల నియంత్రణలో ఉండి, కొద్ది మందికే పరిమితం చేయబడింది. జ్ఞానం, తద్వారా అధికారం, సంపద కొద్దిమంది ఉన్నతులకే చెందింది.

బ్రిటిష్ సామ్రాజ్యానికి సేవలందించే గుమాస్తాలు, తదితర ఉద్యోగ విభాగాలను ఉత్పత్తి చేయటంలో మెకాలేకు స్వార్థ ప్రయోజనం ఉంది. ఆధునిక విద్య గర్భం నుంచి బ్రిటిష్ వలసపాలకులపై పోరాడిన గొప్ప జాతీయవాదులు కూడా ఉద్భవించారు. గాంధి, పటేల్, సుభాష్ చంద్రబోస్, నెహ్రూ వంటివారు ఈ వ్యవస్థలో ఇంగ్లాండ్‌లో చదువుకున్నవారే. వలసవాద పాలనను అంతంచేసి, మన అభివృద్ధికి నూతన పంథాను మనకు ఇచ్చేందుకు వారు చేసిన దోహదాలు నెహ్రూ ప్రసిద్ధ ప్రసంగం 'గమ్యంతో సమాగమమం'లో సూక్ష్మంగా ఉంది.

ఇంగ్లీషు ప్రాంతీయ భాషలను అణచివేసిందా? వాస్తవం చెప్పుకోవాలంటే, స్థూలంగా ఇంగ్లీషు విద్య ప్రాంతీయ భాషల అభివృద్ధికి కూడా దోహదం చేసింది. తిలక్(మరాఠా), గాంధీ (నవజీవన్) తమ పత్రికలను ప్రాంతీయ భాషల్లోనే ప్రారంభించారు. ప్రాంతీయ భాషల్లో కూడా ఈ కాలంలోనే గొప్ప రచయితలు రచనలు చేశారు. ఉదాః రవీంద్రనాథ్ ఠాగూర్, మున్షీ ప్రేంచంద్ వగైరాలు.

మన వారసత్వ సంపద అయిన బ్రహ్మి లిపి, అజంతా – ఎల్లోరా వంటి నిర్మాణాలు మనం తిరిగి పొందటానికి అనేకమంది బ్రిటీష్ పరిశోధకులు దోహదం చేశారు. అలెగ్జాండర్ కన్నింగ్‌హాం సారథ్యంలో 'ఆర్కియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా' (భారత పురావస్తు సర్వేక్షణ సంస్థ)ను బ్రిటీష్‌వారు ఏర్పాటు చేసినట్లు స్వామినాథన్ అయ్యర్ (టైమ్స్ ఆఫ్ ఇండియా, నవంబర్ 2025) పేర్కొన్నారు. భారతదేశ నలుదిశలా మట్టిదిబ్బలు త్రవ్వుతూ తక్షశిల నుంచి నలంద వరకూ డజన్ల కొద్ది అద్భుతమైన ప్రదేశాలను వెలుగులోకి తెచ్చారు. వలసపాలన నుంచి భారత్‌కు వనగూరిన ఫలితాలకు ఇదొక ఉదాహరణ. ఇది వారి ధ్యేయం కాదు, కాని పర్యవసానం మాత్ర మే.

బ్రిటీష్‌వారు ప్రోత్సహించిన ఆలోచనను భారతదేశం అ నుంచి క్ష వరకు ఆమోదించలేదు. దాదాభాయి నౌరోజి, ఎం.జె.రణడే, జి.కె. గోఖలే, ఆర్.సి.దత్తా బ్రిటీష్‌వారి విధానాలను గట్టిగా వ్యతిరేకించారు. బ్రిటీష్‌వారు ప్రోత్సహించిన ఆలోచనా ధారకు స్వాతంత్ర్యోద్యమం పెద్ద ప్రతిపక్షం, సవాలు కూడా. ఇంగ్లీషు ఒక పరికరం మాత్రమే. కాలక్రమంలో ఇంగ్లీషు భారతీయకరణ పొందింది. అనేకమంది అద్భుతమైన రచయితలు భారతీయ ఆలోచనా ధారను ప్రతిబింబిస్తూ ఇంగ్లీషులో రచనలు చేశారు. ఉదాహరణకు అమితవ్‌దాస్, అరుంధతిరాయ్, కిరణ్‌దేశాయ్.

సాంప్రదాయక జ్ఞానవ్యవస్థలు ఇతర ఆలోచనా వ్యవస్థలతో అంతర్ సంబంధం కలిగి ఉన్నపుడే సంపద్వంత మవుతాయి. భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుతో ప్రాంతీయ భాషలు, సాంప్రదాయక జ్ఞానవ్యవస్థలు –రెండింటికీ కావలసినంత ఆవరణ ఉంది. ఏకైక షరతు ఏమంటే, పశ్చిమంతోనేగాక ప్రపంచంతో ఆదాన ప్రదానం కలిగి ఉండటం. అది మన సమాజంలో లోతుగా వేళ్లానుకుని ఉన్న సాంప్రదాయక కుల, లింగ వ్యత్యాసాలను ఎదుర్కొనేందుకు సాధనమవుతుంది. ఆధునిక విద్య – దానిలో ఎన్ని లోపాలున్నప్పటికీ, సమాజంలోని ఈ అట్టడుగు తరగతులకు సమానత్వం, న్యాయం దిశగా ద్వారం తెరిచింది.

భారతదేశంలో వలసవాద పాలన పాత్ర గూర్చి ఒక ఆసక్తిదాయకమైన వృత్తాంతం ఉంది. శశిథరూర్ తన ప్రసిద్ధ ఆక్స్‌ఫర్డ్ డిబేట్‌లో బ్రిటీష్‌వారు భారతదేశాన్ని దోచుకున్న తీరును (అది 'డార్క్ ఈరా ఆఫ్ బ్రిటీష్ ఎంపైర్' పేరుతో పుస్తకంగా వచ్చింది) విపులంగా వివరించారు. కొన్ని మాసాల తర్వాత డాక్టర్ మన్మోహన్‌సింగ్ ఇంగ్లండ్‌లో ఉన్నారు. ఆధునిక పరిపాలన, విద్య ఆరంభించటంలో బ్రిటీష్‌వారి ప్రాతను కొనియాడారు.

ప్రధానాంశం ఏమంటే, అదీ భారతదేశంలో ఉదార విలువల పునాదులను పట్టిష్టం చేసిన, ఆధునిక పరిపాలన ఆరంభమైన మార్గం. ఉదార విలువలు స్వాతంత్ర్య ఉద్యమానికి బాటవేశాయి. బ్రిటీష్ పాలనను కూలద్రోయటానికి ప్రజలు తమ మతంతో నిమిత్తం లేకుండా పాల్గొన్నారు. మనుస్మృతి పాలన సాగిన ప్రాచీనకాలపు వైభవాన్ని పునరుద్ధాటించటం తమ లక్ష్యమని ప్రస్తుత హిందూత్వ జాతీయవాదుల పూర్వతరం వారు స్పష్టంగా చెప్పారు. గోల్వాల్కర్ ప్రకటనను షంఘల్ ఇస్లాం ప్రముఖంగా ప్రస్తావించారు. అదేమంటే, ''హిందువులారా, బ్రిటీష్‌వారితో పోట్లాడుతూ మీ శక్తి వృథా చేసుకోకండి. మన అంతర్గత శత్రువులైన ముస్లింలు, క్రైస్తవులు, కమ్యూనిస్టులతో పోరాడేందుకు మీ శక్తిని నిలుపుకోండి''. వలస పాలనపై పోరాటం కన్నా మతతత్వ సమస్యలపై ఎందుకు దృష్టిపెట్టారో ఈ కోణం సూచిస్తున్నది.

హిందూత్వ భారతీయవాదులు ఇప్పుడు తమ శక్తిసామర్థ్యాలను వలసవాద మనస్తత్వంపై పోరాడేందుకు, సాంప్రదాయక జ్ఞానవ్యవస్థలను పునరుద్ధరించటంపై ఎందుకు కేంద్రీకరిస్తున్నారు? ఇది 'నూతన విద్యావిధానంలో' కూడా ప్రతిబింబించింది. మన స్వాతంత్ర్య పోరాటం, మన రాజ్యాంగం స్వల్పంగా కుదిపిన సాంప్రదాయక కుల, లింగ అణచివేతతో కూడిన నిచ్చెనమెట్ల వ్యవస్థను హిందూత్వ జాతీయవాదం బలపరుస్తున్నది. 'సాంప్రదాయక' సాంఘిక నిమ్నోన్నతాలను పునరుద్ధరించేందుకు మెకాలేని, పశ్చిమ జ్ఞాన వ్యవస్థను వ్యతిరేకించే ఈ మార్గాన్ని ప్రముఖంగా ముందుకు తెస్తున్నారు. నాగరికతలు సరళరేఖల్లో ప్రయాణించవు. ''నాగరికతల కలయికలు'' నిరంతరం జరుగుతుంటాయి. అవే మనల్ని న్యాయం, సమానత్వంవైపు తీసుకెళతాయి.

# రెండేళ్ళ కాంగ్రెస్ ప్రభుత్వం..



సరిగ్గా రెండు సంవత్సరాల క్రితం ఇదే రోజున తెలంగాణ రాష్ట్రంలో తొలి కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైంది. పిసిసి అధ్యక్షుడిగా ఎన్నికల్లో పార్టీకి నేతృత్వం వహించి విజయతీరానికి చేర్చిన ఎ.రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారు. ఆయన నేతృత్వంలోని ప్రభుత్వం ఎల్.బి. స్టేడియంలో ప్రమాణ స్వీకారం చేసింది. తెలంగాణ ఏర్పడిన తరువాత పదేళ్ళు, అంతకు ముందు ఐదేళ్ళు ప్రభుత్వం ఉన్నప్పటికీ తెలంగాణ ఉద్యమ అనిశ్చితి కారణంగా దాదాపు 15 ఏళ్ళ పాటు కింది స్థాయిలో కాంగ్రెస్ కార్యకర్తలు అధికార ఫలాలు అందుకోలేదనే చెప్పాలి. టి/బిఆర్ఎస్ అధినేత కె.చంద్రశేఖర్‌రావు అధికారం చేపట్టిన రెండు దఫాల్లో కాంగ్రెస్ పార్టీని చావు దెబ్బ తీశారనే చెప్పొచ్చు. పైన గెలిచిన ఎంఎల్‌ఏలు, ఎంపిలు మొదలు, కింది స్థాయి నాయకులు, శ్రేణుల వరకు అందరినీ తన పార్టీలో కలిపేసుకున్నారు. వరుస రెండు ఎన్నికల్లో దెబ్బమీద దెబ్బ తరువాత ప్రధానంగా మిగిలి ఉన్న కార్యకర్తల బలం, అలాగే కాంగ్రెస్ పెద్ద నాయకుల స్థానబలం, వీటికి తోడు రేవంత్‌రెడ్డి దూకుడు శైలిలో అందించిన నాయకత్వం కాంగ్రెస్ పార్టీని రెండేళ్ళ క్రితం అధికారంలోకి తీసుకువచ్చింది. 2023 డిసెంబర్ 3నే ఎన్నికల ఫలితాలు వచ్చినప్పటికీ, యుపిఏ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుపై అధికారిక ప్రకటన చేసిన డిసెంబర్ 9వ తేదీన, అది కూడా తెలంగాణ ప్రజల అభిమాన పాత్రురాలైన సోనియాగాంధీ జన్మదినం రోజున కాంగ్రెస్ ప్రభుత్వం ప్రమాణ స్వీకారం చేయాలని భావించింది. అనివార్య కారణాల వల్ల డిసెంబర్ 7వ తేదీనే ఎల్.బి.స్టేడియంలో రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా, అంతకుముందు వరకు సిఎల్‌పి నేతగా ఉన్న మల్లు భట్టి విక్రమార్క డిప్యూటీ సిఎంగా, పిసిసి మాజీ అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్‌రెడ్డి తదితరులు మంత్రులుగా సోనియాగాంధీ సమక్షంలో ప్రమాణ స్వీకారం చేశారు.

ప్రభుత్వం రెండేళ్ళు పూర్తి చేసుకున్నప్పటికీ, వెన్వెంటనే వచ్చిన పార్లమెంటు సాధారణ ఎన్నికల కారణంగా ఎన్నికల కోడ్ కారణంగా సాంకేతికంగా తొలి ఆరు నెలలు ఏమీ చేయలేని పరిస్థితి. అంటే ఏడాదిన్నరే పనిచేసినట్లు లెక్క. గత ప్రభుత్వ హయాంలో చేసిన అప్పుల కారణంగా కాంగ్రెస్ పార్టీ చేసిన ఎన్నికల వాగ్దానాలను పూర్తిస్థాయిలో అమలు చేయలేనప్పటికీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500లకు గ్యాస్, 200 యూనిట్ల వరకు ఉచిత గృహ విద్యుత్ వంటి పథకాలు అమలుతో కుటుంబ ఆదాయంలో మిగులు కనిపించింది. ఈ చర్య తెలంగాణలో ద్రవ్యోల్బణం ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు కూడా ఉపకరించినట్లు కేంద్ర ప్రభుత్వ సర్వేలు వెల్లడించాయి. అలాగే రైతులకు సంబంధించి రూ.2 లక్షల వరకు రుణమాఫీ జరగడంతో పాటు, సన్న వడ్లకు రూ.500 బోనస్‌లు కర్షకులకు ఆదాయాన్ని సమకూర్చింది. రేషన్ షాపుల ద్వారా ఉచిత సన్న బియ్యం పథకం కాంగ్రెస్ ప్రభుత్వ మార్క్ పథకం,పేదలతో పాటు పట్టణ మధ్య తరగతి కుటుంబాలు కూడా ఆదరించాయి. ప్రభుత్వానికి మంచి మార్కులే లభించాయి.అలాగే ఇందిరమ్మ ఇళ్ళ పథకం కూడా పట్టాలెక్కింది. అనేక ఆటంకాలను అధిగమించి 61వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేయడం ఒక రికార్డే. ముఖ్యంగా కోర్టుల అవాంతరాలను తొలగించుకుంటూ తెలంగాణ ఏర్పడిన తరువాత తొలిసారిగావిజయవంతంగా గ్రూప్ 1 ఉద్యోగాలను భర్తీ చేయడం ఈ ప్రభుత్వానికి గొప్ప ఘనత.

సంక్షేమం విషయంలో ఇలా ఉండే సామాజిక అంశాలలో సుదీర్ఘ కాలం పెండింగ్‌లో ఉన్న ఎస్‌సి వర్గీకరణకు చిక్కు ముడులను విప్పుకుంటూ పోయి, వర్గీకరణ చట్టం చేయడం రేవంత్ సర్కార్‌కు మైలేజీనిచ్చింది. అలాగే బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌ల పెంపు విషయంలో పెద్ద ముందడుకు వేసినప్పటికీ, ఫలాలు త్రిశంకు స్వర్గంలో ఉన్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వ హాయంలో శాస్త్రీయ పద్ధతిలో కులగ

## రాజధాని సందడి

– బొమ్మగాని కిరణ్‌కుమార్

ణను పూర్తి చేసి, డెడికేటెడ్ కమిషన్ వేసి, చట్టం కూడా చేసారు. అయితే, దానిని అమలు కాకుండా గవర్నర్, కేంద్ర ప్రభుత్వం తొక్కి పెట్టారు. అయినప్పటికీ, ప్రభుత్వం నుంచి ఇంకొంచెం ప్రయత్నం చేయాల్సిందనే అభిప్రాయం నెలకొంది. కోర్టు కేసుల సమయంలో ప్రభుత్వం వైపు సరిచూసుకోవాల్సిన అంశాలు బైటికివచ్చాయి. అయితే, ప్రధాన, ఏకైక బాధ్యత మాత్రం కేంద్రంలోని బిజెపి ప్రభుత్వంపైనే ఉంది. మంత్రివర్గంలో ఎస్‌సిలకు సముచిత స్థానం కల్పించినప్పటికీ, ఎస్‌టి, బిసి వర్గాలు మరింత ప్రాధాన్యతను ఆశిస్తున్నారు. మంత్రివర్గంలో చోటు లభించని ముస్లిం మైనారిటీ విషయంలో అనేక ఊగిసలాటలు సాగి, చివరకు జూబ్లీహిల్స్ ఉపఎన్నిక సమయంలో ఆ వర్గానికి ప్రాతినిధ్యం లభించింది.

ఆర్థికరంగం విషయంలో ప్రభుత్వానికి ఆరంభంలో అనేక సవాళ్ళు ఎదురయ్యాయి. అప్పుల ఖజానా ఒకవైపు, హామీల భారం మరోవైపు తీవ్ర ఇబ్బంది కలిగించినప్పటికీ, కత్తిమీద సాములా ప్రభుత్వం జాగ్రత్తగా ముందుకు సాగుతుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనే ప్రభుత్వానికి ఆర్థిక వెసులుబాటు లభిస్తున్నట్లు కనిపిస్తోంది. మొదట్లో భూముల వేలం ద్వారా ఆదాయాన్ని సమకూర్చుకునే యత్నాలకు ప్రధాన ప్రతిపక్షం బిఆర్ఎస్ గండి కొట్టినా, ఇప్పుడిప్పుడే కొలిక్కి వచ్చి, కోకాపేట్ వంటి ప్రాంతాలలో ప్రభుత్వ వేలం పాటకు మంచి స్పందన లభించి, ఆదాయం సమకూరుతోంది. అలాగే, దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక వేదిక సమావేశాలలో తెలంగాణకు రూ.3లక్షల పెట్టుబడులకు హామీలు లభించాయి. అవి నెమ్మదిగా ఇప్పుడిప్పుడే ఆచరణ దిశలో ఉన్నాయి. ముఖ్యంగా డిసెంబర్ 9న విడుదల చేయబోతున్న 'తెలంగాణ రైజింగ్' పేరుతో విజన్ డాక్యుమెంట్ –2047' , ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కలల నగరి 'భారత్ ఫ్యూచర్ సిటీ' పైనే ప్రభుత్వం ఎక్కువ ఆశలు పెట్టుకుంది. దాని ద్వారానే ఖజానాకు, పథకాలకు అవసరమైన ఆదాయాన్ని సమకూర్చుకోవాలనే దాని ఆలోచన. పరిపాలన విషయంలో దాదాపు ఏడాదికిపైగా పాత వాసనలు ఉన్న అధికారులతో రేవంత్ రెడ్డి ఇబ్బందులు పడింది. కొద్ది నెలలుగా ప్రభుత్వంపై పట్టు చిక్కినట్లు కనపడుతోంది.

ఇక ప్రభుత్వంపై ప్రజల్లో నెలకొన్న అభిప్రాయానికి గీటురాయిగా నిలిచే ఎన్నికల్లో రెండేళ్ళుగా కాంగ్రెస్ చెప్పుకోదగ్గ విజయాలనే సాధిస్తూ వస్తోంది. లోకసభ ఎన్నికల్లో సగం స్థానాలు, తరువాత ఒక పట్టభద్రుల ఎంఎల్‌సి స్థానం, కంటోన్మెంట్ ఉప ఎన్నికలో విజయం భరోసానిచ్చాయి. అన్నిటికి మించి రెండేళ్లు నిండడానికి ముందు జరిగిన జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ ఘనవిజయం ద్వారా ప్రజల్లో ప్రభుత్వంపై విశ్వాసం కనబడుతోంది.

అనేక హామీలు అమలు చేస్తున్నప్పటికీ, వృద్ధాప్య పెన్షన్‌ల పెంపు, కొత్త పెన్షన్‌లు, పదవీ విరమణ పొందిన ఉద్యోగుల బకాయిలు, ప్రభుత్వ ఉద్యోగుల పిఆర్‌సి, హెల్త్ కార్డులు, జర్నలిస్టుల సమస్యలు, ఆటో డ్రైవర్ల పథకం, ఆరు గ్యారెంటీలలో పలు హామీలు పెండింగ్‌లోనే ఉన్నాయి. ముఖ్యంగా దశాబ్దానికిపైగా కష్టాలను ఎదుర్కొని పార్టీనే పట్టుకొని నిలబడ్డ కార్యకర్తలు తమ ప్రభుత్వ కాలం సగం తీరిపోయినప్పటికీ ఇంకా నామినేటెడ్ పదవుల రావడం లేదని బాధపడుతున్నారు. తమను సమన్వయం చేసుకోవడం లేదనే అభిప్రాయం వారిలో నాటుకొని ఉంది. అది దూరం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. ఇంకా నెరవేర్చాల్సిన హామీలు, వాగ్దానాల అమలు కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారు. ఇప్పటి వరకు ఆర్థిక వెసులుబాటు లేకపోవడం, గత ప్రభుత్వంపై ఉన్న కోపంతో ఓపికపట్టారు. రెండేళ్ళు పూర్తవడంతో కాంగ్రెస్ ప్రభుత్వం తనను తాను నిరూపించుకోవాల్సిన సమయం వచ్చింది.

## సమిష్టి కృషితో విజయం తథ్యం

ఎన్నికల ప్రచారంలో మాజీ మంత్రి పువ్వాడ

**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సమిష్టిగా పనిచేస్తే విజయం తథ్యమని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తెలిపారు. శనివారం రఘునాథపాలెం మండలంలో పలు గ్రామాల్లో బిఆర్ఎస్ తరుపున గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు గ్రామాల్లో జరిగిన సభలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ మాట్లాడుతూ ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్న గ్రామాల్లో జరిగిన అభివృద్ధిని చూసి ఓటేయాలని తెలిపారు. వందల కోట్ల రూపాయల నిధులు తీసుకు వచ్చి రఘునాథపాలెం మండల అభివృద్ధికి కృషి చేశామని తెలిపారు. గ్రామాల్లో మట్టి రోడ్లు లేకుండా అన్ని రహదారులను సిసి రోడ్లుగా తీర్చిదిద్దామని తెలిపారు. గత ఎన్నికల్లో ఆరు గ్యారెంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ హామీలను విస్మరించి పాలన సాగిస్తుందన్నారు. పింఛన్ల పెంపు, మహిళలకు రూ. 2500, స్కూటీలు, తులం బంగారం వంటి హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. ఏ గ్రామంలోనూ రుణమాఫీ సక్రమంగా జరగలేదన్నారు.

## సుపరిపాలనకు కాంగ్రెస్ అభ్యర్థులను బలపరచండి

**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** గ్రామ పంచాయతీల్లో సుపరిపాలన కోసం కాంగ్రెస్ తరుపున పోటీ చేస్తున్న అభ్యర్థులను గెలిపించాలని జిల్లా కాంగ్రెస్ నాయకులు తుమ్మల యుగంధర్ తెలిపారు. శనివారం గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రచారంలో భాగంగా తుమ్మల యుగంధర్ మండలంలోని చింత గుర్తి, గణేశ్వరం, వేపకుంట్ల గ్రామాల్లో పర్యటించారు. కాంగ్రెస్ తరుపున సర్పంచ్ అభ్యర్థులుగా పోటీ చేస్తున్న తమ్మిని ప్రియాంక, చల్లగుండ్ల శ్రీవిద్య, భూక్యా నాగేశ్వరరావు ల విజయాన్ని కాంక్షిస్తూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా యుగంధర్ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందన్నారు. ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనన్నారు.

## గడప గడపకూ సిపిఐ ప్రచారం



**ప్రజాపక్షం/భద్రాచలం :** గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా సిపిఐ గడప గడపకు ప్రచారం చేస్తోంది. శనివారం కాంగ్రెస్ శ్రేణులతో కలిసి సిపిఐ పోటీ చేసిన 16,19 వార్డుల్లో విస్తృత ప్రచారాన్ని నిర్వహించారు. కాంగ్రెస్ పొత్తుతో 16వ వార్డులో సిపిఐ అభ్యర్థి పితాని హెబ్సిబా, 19వ వార్డుల్లో తుర్రం మహేష్‌లు పోటీలో ఉన్నారు. అభ్యర్థులు ఓ టర్లను ప్రసన్నత చేసుకుంటూ ముందుకు సాగుతున్నారు. కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సిపిఐ అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని కోరుతున్నారు. తమకు ఓట్లు వేసి వార్డు సభ్యులుగా గెలిపిస్తే వార్డులను అభివృద్ధి పథంలో నడిపిస్తామని, ప్రతీ సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామని చెప్పారు. అదే విధంగా సిపిఐ, కాంగ్రెస్ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పూనెం కృష్ణకు అమూల్యమైన ఓట్లు వేసి గెలిపించాలని కోరుతున్నారు. సిపిఐ, కాంగ్రెస్ శ్రేణులు మారెడ్డి శివాజీ, మీసాల భాస్కర్ రావు, కంభంమెట్టు శ్రీనివాస్, గుంజా రామారావు, నారపోగు ఏసు, మణి, బత్తుల శ్రీను, గురవయ్య, సాధనపల్లి సతీష్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## నినాదంగానే ప్లాస్టిక్ నిషేధం

సిపిఐ కార్పొరేటర్ బి.జి. క్లైమెంట్



**ప్రజాపక్షం/ ఖమ్మం :** నగరంలో ప్లాస్టిక్ నిషేధం నినాదంగానే మిగులుతుందని సిపిఐ కార్పోరేటర్ బిజి క్లైమెంట్ తెలిపారు. కార్పోరేషన్‌లో ప్లాస్టిక్ నిషేధానికి సంబంధించి సరైన కార్యాచరణ లేదని గుర్తుకొచ్చినప్పుడల్లా ప్రకటనలు చేయడం ఆ తర్వాత మరిచిపోవడం అలవాటుగా మారిందని ఆయన తెలిపారు. ఖమ్మం నగరాన్ని ప్లాస్టిక్ రహిత నగరంగా మార్చాలని పాలక వర్గం పలు నగరాలను సందర్శించడం జరిగిందని కానీ ఆచరణలో లోటుపాట్లు ఎదురవుతున్నాయన్నారు. పాలక వర్గ సమావేశంలో ప్లాస్టిక్ నిషేధంపై మాట్లాడుతున్నప్పుడు నగరంలో ప్లాస్టిక్ నిషేధం సాధ్యం కాదని పాలక వర్గానికి చెందిన కొందరు కార్పోరేటర్లే వ్యాఖ్యానిస్తున్నారని ఆ తర్వాత ప్లాస్టిక్ నిషేధం గురించి మాట్లాడుతూ ప్రజలను మభ్యపెడుతున్నారని ఆయన ఆరోపించారు. ప్లాస్టిక్ కవర్లను, వ్యర్థాలను ఎక్కడ పడితే అక్కడ వేయడం వల్ల పారిశుధ్యానికి ఇబ్బంది కలగడంతో పాటు నీటి పైపుల్లో చేరి నీటి సరఫరాకు అడ్డంకిగా తయారవుతున్నాయన్నారు.మొత్తంగా పాలక వర్గం ప్లాస్టిక్ నిషేధానికి సంబంధించి సమావేశం ఏర్పాటు చేసి నిర్ణీత గడువు విధించి నగరంలో ప్లాస్టిక్‌ను నిషేధించాలని క్లైమెంట్ కోరారు.

## పోస్టల్ బ్యాలెట్‌ను సద్వినియోగం చేసుకోవాలి

కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** పంచాయతీ ఎన్నికల్లో విధులు నిర్వహించే సిబ్బంది తమ ఓటు హక్కు వేసేందుకు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల కమిషన్ సూచనల మేరకు ఎన్నికల విధులు నిర్వహించే ఓటర్లకు, అత్యవసర సేవల్లో పనిచేసే ఓటర్లకు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించబడుతుందని తెలిపారు. దీని కోసం పోస్టల్ ఓటింగ్ సెంటర్, ఓటర్ ఫెసిలిటేషన్ సెంటర్ సంబంధిత మండల ఎంపిడివో కార్యాలయం వద్ద ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. మొదటి విడత పోలింగ్ జరిగే గ్రామాలు, ఓటు హక్కు ఉండి ఎన్నికల విధులను నిర్వహించే సిబ్బంది డిసెంబర్ ఎనిమిదిన రెండవ విడత పోలింగ్ జరిగే గ్రామాల్లో విధులు నిర్వహించే సిబ్బంది, డిసెంబర్ 12న మూడవ విడత పోలింగ్ జరిగే గ్రామాల్లో ఓటు హక్కు ఉండి ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బంది డిసెంబర్ 15న ఓటు హక్కు పోస్టల్ బ్యాలెట్ ద్వారా సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు.

## వన్య ప్రాణుల వేట కేసులో ప్రధాన నిందితుల అరెస్టు



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** సత్తుపల్లి అర్బన్ పార్కు పరిధిలో జరిగిన వన్య ప్రాణుల అక్రమ వేట కేసులో ప్రధాన నిందితులను అరెస్టు చేసినట్లు జిల్లా అటవీ శాఖాధికారి సిద్దార్థ్ విక్రం సింగ్ తెలిపారు. శనివారం జిల్లా అటవీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేసుకు సంబంధించి వివరాలు వెల్లడించారు. ఇటీవల సత్తుపల్లి అర్బన్ పార్కు పరిధిలో వన్య ప్రాణులను అక్రమంగా వేటాడారన్నారు. ఈ కేసుకు సంబంధించి ప్రత్యేక బృందాలతో దర్యాప్తు చేపట్టామన్నారు. ఈ కేసులో ప్రధాన నిందితులుగా మెచ్చా రాము, కుంజా భరత్ లను గుర్తించి అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఆయన తెలిపారు. అడవి జంతువుల వేట, వన్య ప్రాణుల హానీ, అక్రమ ఆయుధ వినియోగంపై శూన్య సహన విధానంతో కొనసాగుతున్నామన్నారు. భవిష్యత్తులో ఇలాంటి అక్రమ వేట ఘటనలు నిరోధించడానికి జిల్లాలో పహరా వ్యవస్థను బలోపేతం చేయడం, రహస్య సమాచార సేకరణను విస్తరించడం వంటి చర్యలను మరింత ధృడంగా అమలు చేయనున్నట్లు ఆయన తెలిపారు.

## వివి పాలెంలో సిపిఐ విస్తృత ప్రచారం

**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** గ్రామ పంచాయతీ ఎన్నికల్లో వి. వెంకటాయపాలెం సర్పంచ్ అభ్యర్థిగా సిపిఐ తరుపున పోటీ చేస్తున్న శాఖమూరి శ్రీనివాసరావు విస్తృత ప్రచారం నిర్వహించారు. శనివారం పలు వార్డుల్లో శాఖమూరి శ్రీనివాసరావు వార్డు అభ్యర్థులతో కలిసి ఇంటింటికి వెళ్లి ఓటర్లను కలిసి ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా శాఖమూరి శ్రీనివాసరావు సుస్థిర, నిజాయితీగా పాలన అందించేందుకు సిపిఐ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. గత ఐదేండ్ల సిపిఐ పాలనలో గ్రామ పంచాయతీలో జరిగిన అభివృద్ధిని చూసి మరోమారు సిపిఐకి పట్టం కట్టాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలను అందించడంతో పాటు గ్రామాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. డిసెంబర్ 11న జరిగే ఎన్నికల్లో బ్యాట్ గుర్తుపై ఓటేసి అత్యధిక మెజార్టీతో సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను గెలిపించాలని అదేవిధంగా వార్డు సభ్యులను కూడా గెలిపించాలని కోరారు. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజలకు సేవ చేస్తానని ఆయన తెలిపారు. మాజీ సర్పంచ్ వెంపటి కృష్ణమోహన్, గ్రామశాఖ కార్యదర్శి రావెళ్ల సురేష్, రావెళ్ల వాసు, గరిడి రాంబాబు, నాదం, శాఖమూరి సుధాకర్, శివరామకృష్ణ పాల్గొన్నారు.

# పంచాయతీ పోరులో కాంగ్రెస్ 'వర్సెస్' కాంగ్రెస్

- కాంగ్రెస్‌లోనే రెండు వర్గాల నేతలు పరస్పరం నామినేషన్లు
- కత్తి మీద సాములా మారిన నాయకుల బుజ్జగింపులు



**ప్రజాపక్షం/జూలూరుపాడు:** పల్లెపోరు హస్తం పార్టీలో అగ్గి రాజేసిందా? మరో మారు వర్గ పోరును బట్టబయలు చేసిందా? పాత, కొత్తగా విడిపోతున్న నేతలు పార్టీకి కొత్త తలనొప్పులు తెస్తున్నారా? లోపం ఎక్కడుందో సమస్య ఎవరి వల్ల వస్తోందో తెలిసినా నోరెత్తలేని పరిస్థితులు పార్టీలో ఉన్నాయా? జూలూరుపాడు మండలంలోనే అలా ఉందా? జిల్లా వ్యాప్తంగా ఇదే తంతు కొనసాగుతుందా? కాంగ్రెస్ వర్గపోరుకు సమస్య ఎక్కడుంది? జూలూరుపాడు మండల పంచాయతీ పోరు రసవత్తరంగా మారుతోంది. జూలూరుపాడు మండలవ్యాప్తంగా 24గ్రామ పంచాయతీలకుగాను కోర్టు ఆదేశాలతో జూలూరుపాడు పంచాయతీ ఎన్నికలు నిలపగా మిగిలిన 23 పంచాయతీలలో 124 సర్పంచ్ అభ్యర్థులు నామినేషన్లు దాఖలుచేశారు. 188 వార్డు లకు 452 మంది అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేశారు. దాఖలవుతున్న నామినేషన్లను పరిశీలిస్తే దాదాపు అన్నిచోట్ల పోటీ కాంగ్రెస్ వరెస్ కాంగ్రెస్ అన్నట్టుగానే ఉంటోంది తప్ప అధికార పార్టీ వర్సెస్ ప్రతిపక్షంలా కనిపించడం లేదని స్వయంగా హస్తం నేతలే అంటున్నారు. దాదాపు మండలంలోని ఒరిజినల్ కాంగ్రెస్, వలస కాంగ్రెస్ లీడర్ల మధ్య గట్టి పోటీ ఉందట. ముఖ్యంగా సీనియర్ లీడర్ల అనుచరులు కూడా రంగంలోకి దిగడంతో బుజ్జగింపులు కత్తిమీద సాములా మారాయన్న మాటలు వినిపిస్తున్నాయి. నామినేషన్స్ ఉపసంహరణకు ఎమ్మెల్యే అనుచరులు చేస్తున్న బుజ్జగింపు ప్రయత్నాలు ఏ మేరకు ఫలితం ఇస్తాయోనన్న భయాలు పెరుగుతున్నాయి. కొత్త, పాత కాంగ్రెస్ వర్గాల్లో తాను బలపరిచిన అభ్యర్థులను బరిలో దింపి గెలిపించుకునే పనిలో నాయకులు లీనమై ఉన్నారు.

### కాంగ్రెస్‌లోనే రెండు వర్గాల నేతలు పరస్పరం నామినేషన్

జూలూరుపాడు మండలంలో మూడవ దశ పోలింగ్ జరిగే మెజారీటీ పంచాయతీలన్నిటిలో దాదాపుగా కొత్త, పాత కాంగ్రెస్ గా విడిపోయి నామినేషన్లు దాఖలు చేశారు. కాకర్ల, పాపకొల్లు, గుండ్లరేవు, బేతాలపాడు, గాంధీనగర్, చింతలతండా పంచాయతీ లలో కాగ్రెస్ వర్సెస్ కాంగ్రెస్ నువ్వా నేనా అన్నట్టుగా ఉందట. కీలకమైన, పొలిటికల్‌గా ఉపయోగపడే పంచాయతీలలో మంత్రి అనుచరులు కూడా నామినేషన్ వేయడంతో జూ లూరుపాడు మండల హస్తం రాజకీయం రోజు రోజుకీ వేడెక్కుతోంది. ఎవ రిని బరిలో ఉంచాలి, ఎవరిని బుజ్జగించాలి, ఇంకెవరిని తప్పించాలి. తప్పించిన వారికి ఏఏ పదవుల హామీ ఇవ్వాలి అన్న కన్ఫ్యూజన్ నా యకులలో పెరిగిపోతోందట. ఎమ్మెల్యే రాందాస్ నాయక్ అండ చూసుకొని కొందరు గ్రామ, మండల స్థాయి నేతలు వ్యవహరిస్తున్న తీరుపై ఎమ్మెల్యే అసహనంగా ఉన్నట్టు గుసగుసలు వినబడుతున్నాయి. బరిలో ఉన్నవాళ్ళలో ఎక్కువ మంది మా వాళ్ళే దీన్ని బట్టి పార్టీలో పంచాయతీ పోరు ఏ స్థాయిలో జరుగుతోందో మీరే అర్థం చేసుకోండని కాంగ్రెస్ నేతలే అంటున్నారు. కొత్త కాంగ్రెస్, పాత కాంగ్రెస్‌గా విడిపోయిన క్యాడర్. నామినేషన్లు దాఖలు చేశారు. మండలంలోని కొన్ని గ్రామ పంచాయతీల్లో కాంగ్రెస్ పార్టీ వారే ముగ్గురికి తగ్గ కుండా నామినేషన్లు దాఖలు చేయడంతో ఎవరిని ఎవరు బుజ్జగించాలో అర్థ ంకాని పరిస్థితి నెలకొందట. ఎమ్మెల్యే వర్గీయులు, ఎన్నికలకు ముందు, ఎన్ని కల తర్వాత బీఆర్ఎస్ నుంచి వచ్చిన నాయకులు వర్గాలుగా ఏర్పడటం. అ లా ఎవరికి వారు నామినేషన్లు దాఖలు చేయడంతో ఎవరిని తప్పించాలి. ఇం కెవరిని బుజ్జగించాలి. అసలు ఆ పని చేయాల్సింది ఎవరో కూడా తేల్చుకోలేక నాయకులు తలప ట్టుకుం టున్నారట. మండల వ్యాప్తంగా పార్టీ లోని మారిన వాతావరణాన్ని కంట్రో ల్‌లోకి తెస్తారా? లేక ముందు మీరు మీరు కొ ట్టుకోండి. గెలిచి వచ్చిన వారి మెడలో మేం వీరతాడు వేస్తామని పార్టీ పెద్దలు చూస్తూ కూర్చుంటారా? అన్నది ఇక్కడ ఇంట్రస్టింగ్ పాయింట్. ఇక్కడున్న ఇంకో మహా గొప్ప అడ్వాంటేజ్ ఏంటంటే. ఎవరు గెలిచినా కాంగ్రెస్ అభ్యర్థే కాబట్టి పార్టీకి వచ్చే నష్టం ఏదీ లేదు. కాకుంటే. లోకల్ పట్టు పాత కాంగ్రెస్ కు ఎక్కువ ఉందా? లేక కొత్త కాంగ్రెస్ కు ఉందా అన్నది మాత్రమే తేలాల్సి ఉంది.

# సిపిఐ అభ్యర్థుల విజయకేతనం

- ఏకగ్రీవంతో ఎరుపెక్కిన గ్రామాలు,
- అంబరాన్నంటిన శ్రేణుల సంబురాలు



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఖమ్మం రూరల్ మండలం సిపిఐ పార్టీ తన సత్తాను పంచాయతీ ఎన్నికల సాక్షిగా నిలబెట్టుకుంది. అధికార పార్టీ సైతం దక్కని గౌరవాన్ని దక్కించుకుంది. పెట్టని కంచుకోటలైన దారేడు, పల్లెగూడెంలను పోలింగ్‌కు ముందే ఏకగ్రీవంగా కైవసం చేసుకొని, విజయధూమ్‌ధూబిని మోగించింది. దారేడులో 8వార్డుల గాను సిపిఐ 2వార్డులు, బిఆర్ఎస్ 3వార్డులు, కాంగ్రెస్ 3వార్డులు తీసుకున్నాయి. అలాగే పల్లెగూడెం 10వార్డులకు గాను బిఆర్ఎస్ 2,కాంగ్రెస్ 1, సిపిఎం 1వార్డు తీసుకున్నాయి. ఈ నేపథ్యంలో దారేడు సిపిఐ సర్పంచ్‌గా బత్తుల వెంకటేశ్వర్లు, పల్లెగూడెం సర్పంచ్‌గా చుండురు సృజన ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపసర్పంచ్‌లకు సంబంధించి చర్చలు నడుస్తున్నాయి. దారేడు 5వ సారి సర్పంచ్‌గా వరుసగా గెలుస్తుండటం విశేషం. సిపిఐ జిల్లా పార్టీతో పాటు సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, సిపిఐ జిల్లాకార్యవర్గ సభ్యులు పుచ్చకాయల కమలాకర్, పాలేరు సిపిఐ నాయకులు లింగ వెంకటనారాయణ, అగ్రస్థాయి నాయకత్వం చూపిన చొరవ ఈ విజయానికి ఎర్రమాలలను అందించింది. సిపిఐ ఏకగ్రీవంగా సాధించిన ఘనత సాక్షిగా గ్రామాలు ఎరుపెక్కడంతో పాటు సంబురాలు అంబరాన్నంటాయి.

### అభినందనలు తెలిపిన దండి సురేష్

పల్లెగూడెందారేడులు ఏకగ్రీవ పంచాయతీలుగ ఎన్నుకోవడంలో సిపిఐ శాఖలు చూపిన చొరవపై సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ అభినందనలు తెలిపారు. సిపిఐ జాతీయ సమితి సభ్యుడు భాగం హేమంత్‌రావు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మిడకంటి చిన్న వెంకట్‌రెడ్డి, సిపిఐ జిల్లా సమితి సభ్యుడు వెంపటి సురేందర్ అభినందించారు. సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు మెంబర్లుగా ఎన్నికైన అభ్యర్థులకు శుభాకాంక్షలు అందించారు. అలాగే పడమటితండాలో నాలుగు వార్డులను సిపిఐ ఏకగ్రీవంగా ఎన్నిక కావడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ గెలుపుకు క్రియాశీలకంగా వ్యవహరించిన సిపిఐ జిల్లా కార్యవర సభ్యులు పుచ్చకాయల కమలాకర్, సిపిఐ పాలేరు నియోజకవర్గ నాయకులు లింగ వెంకటనారాయణ, సిపిఐ జిల్లా పార్టీకి ప్రత్యేకధన్యవాదాలు తెలిపారు. అలాగే ఏకగ్రీవానికి సహకరించిన పార్టీలకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామాలలో శ్రేణులు రెట్టింపు ఉత్సాహంతో గెలుపుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు

## బెండాలపాడు, మంగయ్యబంజర్ పంచాయతీ సర్పంచ్‌ల ఏకగ్రీవం



**ప్రజాపక్షం/చంద్రుగొండ:** మండల పరిధిలోని 14 గ్రామ పంచాయతీలకు గాను రెండు గ్రామ పంచాయతీలు కాంగ్రెస్ పార్టీ ఏకగ్రీవంగా కైవసం చేసుకుంది. బెండాలపాడు, మంగయ్య బంజర్ ఈ రెండు పంచాయతీల కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు బొర్రా లలితా, మాలోత్ గోపాలకృష్ణలు ఏకగ్రీవంగా ఎన్నికైన్నారు. అదే విధంగా బెండాలపాడు గ్రామ పంచాయతీలో 10 వార్డులు, మంగయ్యబంజర్ గ్రామ పంచాయతీలో 8 వార్డులు ఏకగ్రీవంగా ఎన్నికైన్నా రు. అందరి సమన్వయంతో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి లలితా, మాలోత్ గోపాలకృష్ణలను ఏకగ్రీవంగా ప్రకటించారు.బెండాలపాడు పంచాయతీని ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని ఇందిరమ్మ ఇండ్లు పైలెట్ ప్రాజెక్ట్ కింద రాష్ట్రంలోని ఎక్కడ లేని విధంగా అత్యధికంగా 312 ఇండ్లు ఇచ్చి సుమారు 15కోట్ల 60లక్షల రూపాయల వ్యయంతో నిర్మాణం చేపట్టారు. ఇందిరమ్మ ఇండ్ల రాష్ట్ర వ్యాప్త గృహ ప్రవేశ ప్రారంభోత్సవ కార్యక్రమాలను సిఎం ప్రారంభించారు. ఎంఎల్ఏ పంచాయతీ గ్రామాభివృద్ధిని గ్రామస్తుల సమన్వయంతో కలుపుకొని రాజకీయాలకు అతీతంగా తన భుజాలపై వేసుకుని వివిధ దశల్లో అభివృద్ధి పనులు చేస్తున్నారు. మంగయ్యబంజర్ సర్పంచ్‌గా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మాలోత్ గోపాలకృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.8 వార్డులు ఏకగ్రీవంగా అయ్యాయి. మాలోత్ గోపాలకృష్ణ మాట్లాడుతూ తనపై నమ్మకంలో గ్రామ పంచాయతీ ప్రజలు, పెద్దలు, అన్ని పార్టీల నాయకులకు ధన్యవాదాలు తెలిపారు.

## హోంగార్డ్ పనితీరుపై ప్రశంసనీయం

ఎస్‌పి రోహిత్ రాజ్

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** పోలీస్ శాఖలో హోంగార్డ్స్ ఆఫీసర్స్ పనితీరు ప్రశంసనీయమని ఎస్‌పి రోహిత్ రాజ్ అన్నారు. 63వ హోంగార్డ్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యాతిథిగా హాజరైన ఎస్‌పి శాంతి కపోతాన్ని ఎగురవేశారు. పోలీస్ శాఖలో భాగంగా పనిచేస్తున్న హోంగార్డ్స్ ఆఫీసర్స్ నుండి గౌరవ వందనం స్వీకరించారు. పోలీసులతో సమానంగా నిరంతరం విధులు నిర్వహిస్తూ హోంగార్డ్ ఆఫీసర్స్ అందిస్తున్న సేవలు అమోఘం అన్నారు. ఎన్నికల సమయంలో, రోజువారీ విధుల్లో అంకితభావంతో సేవలందిస్తున్నారని అన్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో ప్రజలకు రక్షణ కల్పించడంతో బాధ్యతాయుతమైన సేవలు అందిచడంతో పాటు పొరుగు రాష్ట్రాలలో కూడా ఎన్నికల బందోబస్తులో అప్పగించిన బాధ్యతలను నిబద్ధతతో నిర్వహిస్తున్నారని వారి సేవలను కొనియాడారు. నిత్యం క్రమశిక్షణతో మెలుగుతూ పోలీసు శాఖ ప్రతిష్టను మరింత పెంచేలా విధులు నిర్వర్తించాలని సూచించారు.

## పలు గ్రామ పంచాయతీలలో దండి సురేష్ విస్తృత ప్రచారం



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** గ్రామాభివృద్ధి, నిజాయితీతో కూడిన పాలన కోసం సిపిఐ, సిపిఐ బలపర్చిన అభ్యర్థులను గెలిపించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. శనివారం రఘునాథపాలెం మండలంలోని పంగిడి, చిమ్మపుడి, ఈర్లపుడి తదితర గ్రామాల్లో విస్తృతంగా పర్యటించారు. ఇంటింటికి తిరిగి సిపిఐ, సిపిఐ బలపర్చిన అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో జరిగిన ప్రచార కార్యక్రమంలో దండి సురేష్ మాట్లాడుతూ అభివృద్ధే ధ్యేయంగా సిపిఐ కృషి చేస్తుందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో గ్రామాలు అభివృద్ధి చెందాలంటే నిజాయితీపరులను, అభివృద్ధి కాముకులను ఎన్నికల్లో గెలిపించాలన్నారు. ప్రభుత్వంపై పోరాడి నిధులు సాధించడంతో పాటు నిష్పక్షపాతంగా సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయాలని అందుకు సిపిఐ అభ్యర్థులు సమర్థులని సురేష్ తెలిపారు. పంగిడి గ్రామ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న భూక్యా పోలి జామ్లాను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. ఖమ్మం నియోజక వర్గ కార్యదర్శి ఎస్‌కె జానిమియా, జిల్లా కార్యవర్గ సభ్యులు సలాం, పగడాల మల్లేష్, మేకల శ్రీనివాసరావు, యానాలి సాంబశివరెడ్డి, నూనె శశిధర్, పీట్ల కృష్ణమూర్తి, బానోత్ వీరన్న, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ స్ఫూర్తితో రాజ్యాంగాన్ని రక్షించుకుందాం

సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఉప్పుశెట్టి రాహుల్



**ప్రజాపక్షం/పాల్వంచ :** భారత రాజ్యాంగాన్ని అమలు చేస్తామని, రాజ్యాంగంపై ప్రమాణం చేసి గద్దెనెక్కిన పాలకులు రాజ్యాంగాన్ని అమలు పరచ టం లేదని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఉప్పుశె ట్టి రాహుల్ అన్నారు. సిపిఐ ఆధ్వర్యంలో బాబా సా హెబ్ అంబేద్కర్ 69 వ, వర్ధంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా అంబేద్కర్ సెంటర్‌లో గల అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అ నంతరం రాహుల్ మాట్లాడుతూ బిఆర్ అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగం దేశానికి సర్వోత్కృ ష్ట చట్టమని, భారత రాజ్యాంగం ద్వారా దేశానికి గణతంత్ర ప్రతిపత్తి వచ్చిందన్నారు. రాజ్యాంగాన్ని అమలు పరిచిన తరువాత స్వతంత్ర భారతదేశం సర్వసత్తాక ప్రజాస్వామ్య, గణతంత్ర రా జ్యంగా అవతరించినదన్నారు. భారత రాజ్యాంగం ద్వా రా కల్పించబడిన ప్రాథమిక హక్కులను అమలు చే యకుండా పాలక వర్గాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం మతచాందస విధానాలతో దేశాన్ని పాలిస్తున్నదని, తమ ఎజెండా, విధానాలను ప్రజలపై రుద్ది, మత విద్వేషాలను సృష్టించాలను కుయుక్తులు పన్నుతుందని విమర్శించారు. ప్రధానమంత్రి నరేంద్రమోడి విధానాలు దేశానికి , బిజేపి సిద్దాంతాలతో రా జ్యాంగం ప్రమాదపుటంచుల్లో పడే పరిస్థితులు ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.అంబేద్కర్ స్ఫూర్తితో రాజ్యాంగాన్ని పరిరక్షించుకొందామన్నా రు. సమాన హక్కుల హక్కుల సాధన కోసం, అసమాన నవ సమాజ నిర్మాణం కోసం కమ్యూనిస్టు కార్యకర్తలు పాటుపడాలని, పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.సిపిఐ జిల్లా సమితి సభ్యులు వీసంశెట్టి పద్మజ, నిమ్మల రాంబాబు, ఇట్టి వెంకటరావు, ప్రజానాట్య మండలి జిల్లా అధ్యక్షులు శనగారపు శ్రీనివాసరావు, మిల్లు డ్రైవర్స్ యూనియన్ రాష్ట్ర నాయకులు నరహరి నాగేశ్వరరావు, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు డి. చెన్నయ్య, నాయకులుకరీమ్, కోమటి శ్రీను, లాల్‌పాషా పాల్గొన్నారు.

**ఎస్‌సి,ఎస్‌టి హక్కుల పరి రక్షణ సంఘం ఆధ్వర్యంలో :** రాజ్యాంగాన్ని ఎవరైనా మార్చాలని చూస్తే ప్రభుత్వాలు కూలిపోతాయని నాయకులు హెచ్చరించారు. ఆసంఘం ఆధ్వర్యంలో రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్ 69వ, వ ర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక అంబేద్కర్ సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ అంబేద్కర్‌రాజ్యా ంగ ఫలితంగానే ఎస్‌సి, ఎస్‌టి, మైనారిటలు, బిసీ లు వారి హక్కులను అనుభవిస్తున్నారని అన్నారు. అంబేద్కర్ కొందరి వాడు కాదని, అందరివాడన్నారు. కాల్వ దేవదాసు, కాల్వ భాస్కర్, ప్రకాష్, దాసరి నాగేశ్వరరావు, ముళ్ళపూడి రాజేంద్రకుమార్ పాల్గొన్నారు.

**అంబేద్క్ ఆశయ సాధన కోసం పోరాడాలి:** తెలంగాణ స్టేట్ ఎలక్ట్రిసిటి ఎస్‌సి, ఎస్‌టి వెల్ఫేర్ అసోసియేషన్ అధ్వర్యంలో అంబేద్కర్ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేటిపిఎస్ అంబేద్కర్ సెంటర్‌లో గల అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాజ్యాంగాన్ని రక్షించుకొందామన్నారు. ఆసంఘం స్టేట్ డిప్యూ టి జనరల్ సెక్రటరి కూరపాటి రమేష్, రీజినల్ ప్రసిడెంట్ వరీకుటి శ్రీనివాసరావు,డి. శ్యాంసుందర్, సిహెచ్ విద్యాసాగర్, పొదెం క్రిష్ణ, తంబాల సత్యనారాయణ పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** సమానత్వం, న్యాయం కోసం పోరాడిన యోధుడు డా॥ బిఆర్ అంబేద్కర్ అని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణ తెలిపారు. అంబేద్కర్ 69వ వర్ధంతిని పురస్కరించుకుని కాంగ్రెస్ జిల్లా కార్యాలయం సంజీవరెడ్డి భవన్‌లో డా॥ బిఆర్ అంబేడ్కర్ వర్ధంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ చిత్ర పటానికి పలువురు నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. బడుగు, బలహీన వర్గాలకు దేశంలో రక్షణ కల్పించిన మహనీయుడు అంబేడ్కర్ అని కొనియాడారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, మాజీ ఎంఎల్‌సి పోట్ల నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు, ఖమ్మం నగర అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి, మాజీ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, వడ్డెబోయిన నర్సింహారావు, బాలగంగాధర్ తిలక్, పలువురు కార్పొరేటర్లు, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, నాయకులు పాల్గొన్నారు.



## బెల్టు షాపులు రద్దు చేయాలి

ఎక్సైజ్ సూపరిండెంట్ కార్యాలయం ముందు మహిళలు నిరసన



**ప్రజాపక్షం/జూలూరుపాడు:** జూలూరుపాడు మండల వ్యాప్తంగా రోజురోజుకు పెరుగుతున్న బెల్ట్ షాపులను నియంత్రించాలని కోరుతూ జిల్లా ఎక్సైజ్ కార్యాలయం ఎదుట శనివారం మహిళలు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం జిల్లా ఎక్సైజ్ సూపరిండెంట్ జానయ్యకి వినతి పత్రం అందజేశారు.మద్యం వ్యాపారాలు బెల్ట్ షాపుల ద్వారా తమ యొక్క వ్యాపారాన్ని పెంచుకుంటూ ఆదాయాన్ని సంపాదిస్తున్నారు.దీనిపై జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారులు దృష్టి సారించాలని వినతిపత్రం అందజేశారు. బెల్ట్ షాపుల నియంత్రణపై చర్యలు తీసుకొని పక్షంలో రానున్న రోజుల్లో మండల వ్యాప్తంగా తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. వినతిపత్రంలో కోరారు ఎక్సైజ్ సూపరిండెంట్ దీనిపై స్పందిస్తూ తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎస్కే ఫరీనా, భోగ లక్ష్మి, మంజుల, కాసింబి, నూర్జ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు కోడ్

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం జిల్లాల్లో గ్రామ పంచాయతీ ఎన్నికలను మూడు విడతల్లో నిర్వహించనున్నట్లు ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు ఎన్నికల ప్రవర్తన నియామవళి (ఎంసిసి) గ్రామీణ ప్రాంతాల్లో అమల్లో ఉంటుందని జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి దశ పోలింగ్‌తో పాటు రెండవ దశ పోలింగ్ పూర్తయిన తర్వాత కూడా సంబంధిత గ్రామాలు, మండలాల్లో ఎన్నికల కోడ్ అమల్లో ఉంటుందని తెలిపారు. మూడవ దశ ఎన్నికల ప్రక్రియ పూర్తయిన తర్వాత మాత్రమే ఎన్నికల ప్రవర్తన నియామవళి తొలిగి పోతుందన్నారు. మొదటి, రెండవ దశ అభ్యర్థులు, ఇతరులు ఎన్నికల ప్రవర్తన నియామవళిని ఉల్లంఘించరాదన్నారు. ఏకగ్రీవమైన పంచాయతీల్లో సైతం ఎన్నికల కోడ్ అమల్లో ఉంటుందన్నారు. అతిక్రమించిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు.

## వరంగల్ సిపిని కలిసిన ములుగు ఎస్‌పి



**ప్రజాపక్షం/ములుగు:** ములుగు జిల్లా ఎస్‌పి సుధీర్ రామ్‌నాథ్ కేకన్ ఐపిఎస్, వరంగల్ సిటీ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్ ఐపిఎస్‌ను శనివారం కమిషనర్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. రెండు జిల్లాల మధ్య పోలింగ్ సమన్వయం, న్యాయ, శాంతి వ్యవస్థల బలోపేతం, నేరాల నివారణ చర్యలు, ప్రధాన ఆపరేషన్ల సమయంలో సమన్వయంతో పనిచేయడం తీసుకోవాల్సిన జాగ్రత్తలు భద్రతా వంటి అంశాలపై చర్చ జరిగింది. ముఖ్యంగా వచ్చే నెలలో జరుగు మేడారం జాతర ఏర్పాట్లు పోలిసింగ్ ట్రాఫిక్ నిర్వహణ వంటి కీలక అంశాలపై చర్చించారు. మేడారం జాతర విజయవంతం అయ్యేలా తగు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు ఎస్‌పి తెలిపారు. సైబర్ నేరాలు అన్ని వర్గాల ప్రజలకు అవగాహన కార్యక్రమాలు, కమ్యూనిటీ పోలిసింగ్, టెక్నాలజి ఆధారిత దర్యాప్తు పద్ధతులు, మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో ఆపరేషనల్ సామర్థ్యాన్ని పెంపొందించడం వంటి విషయాలపై చర్చ జరిగింది. ములుగు జిల్లా పోలీస్ విభాగం చేపడుతున్న ప్రజాహిత కార్యక్రమాలు, చురుకైన పోలిసింగ్‌ను కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ ఐపిఎస్ అభినందించారు.

## ప్రిసైడింగ్ అధికారుల శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలించిన కలెక్టర్



**ప్రజాపక్షం/రాయపర్తి:** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన తెలంగాణ రెండవ సాధారణ గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ సత్య శారద సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సత్యశారద మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో స్థానిక ఎన్నికలు జరుటకు ప్రిసైడింగ్ అధికారులు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పి సిఈఓ రామ్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపిడిఓ కిషన్, టిఓటిలు సుధీర్ బాబు, నాగేశ్వరరావు, పరమేశ్వర్, ఆచార్యులు, పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ సర్పంచ్‌లను అత్యధిక మెజారిటీతో గెలిపించుకోవాలి

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థులకు ఓట్లేసి అత్యధిక మెజారిటీతో గెలిపించుకోవాలని, ప్రజా పాలనలోనే అభివృద్ధి, సంక్షేమం జరుగుతుందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. శనివారం భూపాలపల్లి నియోజకవర్గం మొగుళ్ళపల్లి మండలం రంగాపురం, ఇస్సిపేట, ములుకలపల్లి, పిడిసిల్ల గ్రామాలల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థుల గెలుపు కొరకు ఎమ్మెల్యే ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలల్లో ఏర్పాటు చేసిన పబ్లిక్ కార్నర్ మీటింగ్ లలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, సిఎం రేవంత్ రెడ్డి ప్రజా పాలనలోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని అన్నారు. పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో గ్రామాలలో అభివృద్ధి శూన్యమన్నారు. గ్రామాల్లో నాయకులు పాత, కొత్త తేడా లేకుండా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపు కొరకు కలిసికట్టుగా పనిచేయాలన్నారు. కాంగ్రెస్ పాలనలో ప్రజలే పాలకులని, ప్రజా సంక్షేమం కోసం ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. రెండేళ్లలో భూపాలపల్లి నియోజకవర్గంలోని అన్ని గ్రామాలలో వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేసినట్లు, రాబోయే రోజుల్లో మరింత అభివృద్ధి పనులను చేయనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, నాయకులు పాల్గొన్నారు.

## ఆదరించండి... అభివృద్ధి చేసి చూపిస్తా



**ప్రజాపక్షం/రాయపర్తి:** జేతురాం తండా గ్రామాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసి చూపిస్తానని కాంగ్రెస్ సర్పంచ్ అభ్యర్థి గుగులోత్ స్వప్న విజయ్ అన్నారు. శనివారం జేతురాం తండా గ్రామంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొని ఉంగరం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలలో తనను సర్పంచ్‌గా గెలిపిస్తే గ్రామాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తానని అన్నారు. గత బిఆర్ఎస్ పాలనలో గ్రామం ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదని అన్నారు. గ్రామానికి సేవ చేయాలనే ఉద్దేశ్యంతో రాజకీయాలలోకి వచ్చానని అన్నారు. పాలకుర్తి ఎంఎల్ఏ యశస్విని రెడ్డి, టిపిసిసి వైస్ ప్రెసిడెంట్ ఝాన్సీ రెడ్డిల సహకారంతో గ్రామానికి అధిక నిధులు తీసుకువచ్చి గ్రామ అభివృద్ధికి పాటుపడతానిని అన్నారు. ఏకగ్రీవ వార్డు మెంబర్ గుగులోత్ రవి, గుగులోత్ లాలు, నేతావత్ వీరు, జాటోత్ బద్రు, గుగులోత్ సుకుని, గుగులోత్ యాకూబ్, నేతావత్ బద్రు, జాటోత్ వీరన్న, జాటోతు శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి స్వగ్రామంలో సర్పంచ్ ఏకగ్రీవం

**ప్రజాపక్షం/ములుగు:** స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క స్వంత గ్రామం ములుగు మండలం జగ్గన్నపేట గ్రామంలో పార్టీలకు అతీతంగా గ్రామాభివృద్ధి కోసం జగ్గన్నపేట గ్రామ పంచాయతీ పరిధిలోని 7 పల్లెలు రాష్ట్ర మంత్రి సీతక్క చొరవతో ఏకగ్రీవంగా కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థి అర్రెం వెంకన్నను సర్పంచ్‌గా మాజీ మంత్రి అజ్మీరా చందూలాల్ అనుచరులకు ఉప సర్పంచ్ పదవి ఏకగ్రీవంగా గ్రామస్థులు ఎన్నుకున్నారు. తమ స్వగ్రామంలో గ్రామ సర్పంచ్‌ను ఏకగ్రీవంగా ఎన్నికైనందుకు మంత్రి సీతక్క సంతోషాన్ని వ్యక్తం చేశారు. గ్రామాభివృద్ధి కోసం నిత్యం కృషి చేస్తూనే ఉంటానని మంత్రి సీతక్క అన్నారు.

## సమానత్వ మార్గమే దేశాన్ని ఏకతా దిశగా నడిపిస్తుంది

అంబేద్కర్‌కు నివాళులు అర్పించిన చెన్నకేశవులు



**ప్రజాపక్షం/నెక్కొండ:** రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా నెక్కొండలో జరిగిన నివా ళి కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి కందిక చెన్నకేశవులు పాల్గొని అం బేద్కర్ విగ్రహానికి పూలమాలలు అర్పించారు. ఈ సందర్భంగా కందిక చెన్న కే శవులు మాట్లాడుతూ అంబేద్కర్ చూపి న సమానత్వ మార్గమే ఈ దేశాన్ని ఏకతా దిశగా నడిపిస్తుందని, సామాజిక న్యాయం కార్మిక హక్కులు, అణగారిన వర్గాల కోసం ఆయన ఆలోచనలు మార్గదర్శకం అన్నారు. అలాగే అంబేద్కర్ స్ఫూర్తితో అణగారిన వర్గాల హక్కుల కోసం సిపిఐ పోరాటం కొనసాగిస్తుందని తెలిపారు.

## రాజ్యాంగ నిర్మాత ఎంతోమంది జీవితంలో స్ఫూర్తి ప్రదాత



**ప్రజాపక్షం/కాజీపేట:** హనుమకొండ జిల్లాలోని కాజీపేట మండలం అరుట్ల రామచంద్రారెడ్డి కాలనీలో సిపిఐ శాఖ కార్యదర్శి సాలాకుల సరూప ఆధ్వర్యంలో డాక్టర్ బాబాసాహెబ్ బి.ఆర్ అంబేద్కర్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ముందుగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా భారత జాతీయ మ హిళా సమాఖ్య హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రాస మల్ల దీన పాల్గొని మాట్లాడుతూ ప్రపంచ మేధావి జ్ఞాన శిఖరం మొట్టమొదటి న్యాయ శాఖ మంత్రి భారత రాజ్యాంగ నిర్మాత ఎంతోమందికి జీవితంలో పూర్తి దాత బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, మహిళల జీవితాలలో వెలుగులు నింపిన స్ఫూర్తి దాత అను కొనియాడారు. ఆయనకు ఇవే ఘన నివాళులు అని పేర్కొన్నారు. పోగులజ్యోతి, గద్దం మరియా, ఉషారాణి, పార్లపల్లి శ్రీదేవి, పిట్టల పిట్ట సావిత్రి, అనిత, శ్రీదేవి ,సంగీత, అంగన్‌వాడీ టీచర్స్ పాల్గొన్నారు.

# నిర్ణీత గడువులోగా పనులు పూర్తి

మేడారం జాతర అభివృద్ధి పనులను పరిశీలించి ములుగు కలెక్టర్



**ప్రజాపక్షం/ములుగు:** మేడారం శ్రీసమ్మక్క సారలమ్మ గద్దెల పునరుద్దరణ, జాతర అభివృద్ధి పనులను, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సూచించారు. శనివారం ఎస్ఎస్ తాడ్వాయి మండలం శ్రీ సమ్మక్క సారలమ్మ దేవాలయ గద్దెల పునరుద్దరణ అభివృద్ధి పనులను, దేవాదాయ ప్రాంగణంలోని పగిడిద్ద రాజు గోవిందరాజుల గద్దెల రాతి నిర్మాణాలను, ఆలయ ప్రాంగణ ఫ్లోరింగ్ పనులను, ప్రధాన ద్వారానికి సంబంధించిన భారీ రాతి స్తంభాలను వాటి నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నిర్ణీత గడువులోపు పనులను పూర్తి చేయాలని,అవసరం అయితే అదనపు సిబ్బందిని, యంత్రాలను ఉపయోగించి పనులల్లో వేగం పెంచి త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను, గుత్తేదారులను ఆదేశించారు. జాతర సమయంలో కోట్లాది మంది భక్తులు వనదేవతలను దర్శించుకోవడం కోసం వస్తూ ఉంటారని, దర్శనానికి పంపే సమయంలో క్యూలైన్స్ అతి ముఖ్యమని, క్యూలైన్ల నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. జాతర సమీపిస్తున్న నేపథ్యంలో రహదారుల నిర్మాణం పనులలో వేగం పెంచాలని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ నిర్ధేశించిన గడువులోపు అన్ని పనులను పూర్తి చేయాలని సూచించారు. ఆర్అండ్‌బి, పిఆర్ ఇంజనీరింగ్ అధికారులు, గుత్తేదారులు, సంబంధితఅధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ జీవిత పోరాటం ప్రతి పౌరుడికీ మార్గదర్శకం



**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 69వ వర్ధంతి సందర్భంగా శనివారం వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, వర్ధన్నపేట శాసన సభ్యులు కెఆర్ నాగరాజు, కుడా చైర్మన్, డిసిసి అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డితో కలిసి హనుమకొండ డిసిసి భవన్‌లో అంబేద్కర్ చిత్రానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం అంబేద్కర్ కూడలి వద్దగల అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. స్థానికంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ అంబేద్కర్ జీవిత పోరాటం ప్రతి పౌరుడికి మార్గదర్శకం అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ,జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్,మున్సిపల్ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు ,కార్పొరేటర్లు విజయశ్రీ రాజాలీ ,మామిండ్ల రాజు, ఇతర ప్రజా ప్రతినిధులు,సీనియర్ నాయకులు,అభిమానులు పాల్గొన్నారు .

## అంబేద్కర్ ఆశయాలు కొనసాగిస్తాం

సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి అజయ్ సారధి రెడ్డి



**ప్రజాపక్షం/మహబూబాబాద్:** మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో భారత కమ్యూని స్టు పార్టీ సిపిఐ దళిత హక్కుల పోరాట సమితి (డిహెచ్ పిఎస్) ఆధ్వర్యంలో దాదాసాహెబ్ భారతరత్న రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 69వ వర్ధంతి సందర్భంగా అంబేద్కర్ విగ్రహం దగ్గర పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బి అజయ్ సారధి రెడ్డి, డిహెచ్‌పిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి వంకాయలపాటి చిరంజీవి మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాలు కొనసాగిస్తామని, రా జ్యాంగ పరిరక్షణకు నిరంతర పోరాటాలు చేస్తామని అన్నారు. దేశంలో అంటరానితనాన్ని పారదోలి సమసమాజ నిర్మాణానికి అంబేద్కర్ కృషి చేశాడన్నారు. ముఖ్యంగా మూడు పర్యాయాలు అధికారంలోకి వచ్చిన బిజెపి మోదీ సర్కార్ రాజ్యాంగాన్ని తూట్లు పొడుస్తూ వారికి ఇష్టమొచ్చినట్టు మారుస్తూ మతోన్మాద రాజకీయాలు చేస్తూ కులాల మధ్య మతాల మధ్య చిచ్చులు పెట్టి మోదీ రాజకీయం చేస్తున్నాడని రాబోవు తున్న కాలంలో దేశంలో ప్రజలంతా ఏకమై మోదీని గద్దె దించక తప్పదని అజయ్‌సారథి రెడ్డి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పెరుగు కుమా ర్, చింతకుంట్ల వెంకన్న, మామిండ్ల సాంబలక్ష్మి, వీరవెల్లి రవి, మంద శంకర్, ఎర్రోజు పద్మ, తండా శ్రీనాథ్, కవిత పద్మ, గంగ తదితరులు పాల్గొన్నారు.

## సామాజిక తెలంగాణ లక్ష్యంగా ప్రభుత్వ అడుగులు

వరంగల్ లో రాష్ట్ర మంత్రి కొండా సురేఖ



**ప్రజాపక్షం / వరంగల్ :** భారత రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందని, సామాజిక తెలంగాణే లక్ష్యంగా ప్రభుత్వ అడుగులు వేస్తుందని వరంగల్‌లో శనివారం రాష్ట్ర మంత్రి కొండా సురేఖ అన్నారు. బాబాసాహెబ్ వర్ధంతి సందర్భంగా కాశిబుగ్గలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ అంబేద్కర్ స్ఫూర్తితో సామాజిక న్యాయం, విద్యా, ఉద్యోగ అవకాశం, సమాన హక్కులు అందరికీ చేరేలా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. యువత అంబేద్కర్ ఆలోచనలను తెలుసుకుని, ఆయన చూపించిన విద్యా సాధన మార్గాన్ని అనుసరించి ముందుకు సాగాలని ఆకాంక్షిస్తున్నామన్నారు. భారత రాజ్యాంగాన్ని రూపొందించి ప్రతి పౌరుడికి అధికారం, హక్కులు కలిగేలా చేసిన మహానుభావుడు అంబేద్కర్ అని కొనియాడారు. ఆయన చూపించిన మార్గం తమ ప్రభుత్వం అనుసరిస్తోందన్నారు. పేద, బలహీన వర్గాల అభివృద్ధే తమ లక్ష్యమన్నారు. ప్రతి ఇంటికి విద్య, ఆరోగ్యం, ఉపాధి అందేలా కృషి చేస్తామన్నారు. అంబేద్కర్ ఆశయాలను ఆచరణలో పెట్టడమే ఆయనకు నిజమైన నివాళి అని మంత్రి తెలిపారు. భారత రాజ్యాంగ శిల్పిగా, సామాజిక న్యాయం కోసం అహర్నిశలు పోరాడిన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సేవలు అపారమని అన్నారు. సమాజంలో విద్యా, అవగాహన, హక్కుల గురించి ప్రజలకు అంబేద్కర్ అందించిన ప్రేరణ నేటికీ మార్గదర్శకమని చెప్పారన్నారు. బలహీన వర్గాల అభివృద్ధి కోసం ప్రభుత్వం సంకల్పబద్ధంగా పనిచేస్తుందన్నారు. అంబేద్కర్ కలలుగన్న సమాన సమాజ నిర్మాణం దిశగా అడుగులు వేస్తున్నామన్నారు.

## పోరాటం చేస్తున్న నాయకులపై పెట్టిన కేసులు ఎత్తివేయాలి

**ప్రజాపక్షం/ తొర్రూరు :** డివిజన్ కేంద్రంలోని గోపాలగిరి రోడ్డులో నిర్మించిన 280డబుల్ బెడ్రూం ఇండ్లను అర్హులైన నిరుపేదలకు పంపిణీ చేయాలని పోరాటం చేస్తున్న సిపిఎం పార్టీ నాయకులపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని సిపిఐ పార్టీ సీనియర్ నాయకులు తమ్మెర విశ్వేశ్వర్‌రావు, ఓమ భిక్షపతి, సిపిఐ మండల కార్యదర్శి బందు మహేందర్, సహాయ కార్యదర్శి గణపురం లక్ష్మ ణ్‌లు డిమాండ్ చేశారు. గోపాలగిరి రోడ్డులో 280డబుల్ బెడ్రూం ఇండ్లను గత బిఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించి పంపిణీ చేయలేదని అన్నారు. ప్రజా ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి ఏర్పడి రెండేళ్లు కావస్తున్నా అర్హులైన నిరుపేదలకు డబుల్ బెడ్రూం ఇండ్లను పంపిణీ చేయడం లేదన్నారు. కమ్యూనిస్టులపై కేసులు పెడితే పోరాటం ఆగదన్నారు. ఇప్పటికైనా సిపిఎం పార్టీ నాయకులపై పెట్టిన కేసులను వెంటనే ఉపసంహరించుకొని అర్హులైన కుటుంబాలకు డబుల్ బెడ్రూం ఇండ్లను పంపిణీ చేయాలన్నారు.

# ప్రజల పక్షాన పోరాడేది కమ్యూనిస్టులే

సిపిఐ జిల్లా కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడేది కమ్యూనిస్టులేనని, పిడిసిల్ల సిపిఐ సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తాటిపాముల కవిత శ్రీహరిని అధికమేజారిటీతో గెలిపించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ పిలుపునిచ్చారు. శనివారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలో మీడియాతో మాట్లాడుతూ.. భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ నుండి భూపాలపల్లి నియోజకవర్గంలో మొగుళ్లపల్లి మండలం పిడిసిల్ల గ్రామ సర్పంచ్ తాటిపాముల కవిత శ్రీహరితో పాటు చెల్పూర్ వార్డు మెంబర్ 1, గోరికొత్తపల్లిలో 3, రేగొండ మండలం పోచంపల్లి 1, ఎల్లారెడ్డి పల్లిలో వార్డు మెంబర్లకు పోటీ చేయడం జరుగుతుందని ప్రజా సమస్యల పట్ల అవగాహన ఉన్న కమ్యూనిస్టు సిపిఐ బలపరిచిన సర్పంచ్, వార్డు సభ్యులను ప్రజలు గెలిపించాలని కోరారు. ఈ సర్పంచ్ ఎన్నికల్లో ప్రజలకు సేవ చేసే వారినే గ్రామ సర్పంచిని ఎన్నుకోవాలని డబ్బులతో ఓట్లు కొనే నాయకులకు ఓటు వేసి మీ విలువైన ఓటును అమ్ముకోరాదని అన్నారు. తాటిపాముల కవిత శ్రీహరి గెలిపిస్తే మీ గ్రామం అభివృద్ధి అవుతుందని కావున వారిని ఆశీర్వదించాలని కోరారు.

నేడు పిడిసిల్లలో సిపిఐ ఎన్నికల ప్రచారం

ఈనెల 11న జరిగే గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా ఆదివారం మొగుళ్లపల్లి మండలం పిడిసిల్ల గ్రామ సర్పంచిగా సిపిఐ నుండి పోటీ చేస్తున్న తాటిపాముల కవిత శ్రీహరి గెలుపును కాంక్షిస్తూ సిపిఐ జిల్లా కార్యదర్శి కొరిమిరాజు కుమార్ ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారు. ఈ ప్రచారంలో స్థానిక ప్రజలు పార్టీ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొనాలని విజయవంతం చేయాలని రాజ్ కుమార్ విజ్ఞప్తి చేశారు.

# పారదర్శకంగా ఎన్నికలు : అబ్జర్వర్



**ప్రజాపక్షం / జనగామ:** పారదర్శకంగా ఎన్నికలు జరగాలని ఎన్నికల పరిశీలకులు రవికిరణ్, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ మైక్రో అబ్జర్వర్లకు సూచించారు. శనివారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో గ్రామ పంచాయతీ, వార్డు సభ్యుల ఎన్నికలపై మైక్రో అబ్జర్వర్‌అల సమావేశం నిర్వయించారు. ఈ సందర్భంగా పరిశీలకులు రవికిరణ్, కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ మాట్లాడుతూ ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించడంలో మైక్రో అబ్జర్వర్ల పాత్ర కీలకమైందన్నారు. నైతికంగా వ్యవహరిస్తూ ఎలాంటి పక్షపాతం లేకుండా వ్యవహరించాలని సూచించారు. మైక్రో అబ్జర్వర్లు తన చెక్‌లిస్ట్‌లో ప్రతి అంశంపై అవును/కాదు గా నమోదు చేసిన గమనించిన లోపాలు సంఘటనలను ప్రత్యేక రిపోర్ట్‌లో పొందుపర్చాలన్నారు. పోలింగ్ స్టేషన్‌లో బ్యాలట్ బాక్స్‌ను సరియైన విధంగా ఫిక్స్ చేయాలని, ఎంట్రీ ఫాస్ సిస్టమ్‌ను కచ్చితంగా అమలు చేయాలన్నారు. ఓటరు గుర్తింపు రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం చేయాలన్నారు. ఇండలిబుల్ ఇంక్ సరియైన విధంగా అప్లయ్ చేయాలని, బ్యాలెట్ పేపర్ కౌంటర్ ఫైల్‌లో ఓటర్ వివరాల నమోదు, పోలింగ్‌లో రహస్యత్వం పూర్తి స్థాయిలో నిర్ధారించాలన్నారు. పోలింగ్ ఏజెంట్ల ప్రవర్తన, వారి ఫిర్యాదులపై తక్షణ చర్య, గ్రామ పంచాయతీ కౌంటింగ్ సెంటర్‌లో ఏర్పాట్ల పరిలించడం, కౌంటర్ సంబంధిత ప్రతి దశను నిబంధనలకు అనుగుణంగా నిర్వయించడం, ఫలితాల ప్రకటన, ఎన్నిక సర్టిఫికెట్ జారీ సక్రమంగా జరిగేలా చూడాలన్నారు. ఫలితాల అనంతరం నిర్వయించే ఉప సర్పంచ్ ఎన్నికను తెలంగాణ పంచాయతీ రాజ్ నియమాల ప్రకారం పర్యవేక్షించాలన్నారు. జడ్‌పి సిఇఒ మాధురిఇషా, ఇన్‌చార్జి డిపిఓ వసంత తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐ బలపర్చిన సర్పంచ్ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా కృషి



**ప్రజాపక్షం/ తొర్రూరు :** మండలంలోని కంఠాయపాలెం గ్రామంలో సిపిఐ పార్టీ బలపర్చిన స్వతంత్ర సర్పంచ్ అభ్యర్థి ఆవుల శ్యామలత ఉపేందర్ గెలుపు కోసం ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని సీపీఐ పార్టీ సీనియర్ నాయకులు తమ్మెర విశ్వేశ్వర్‌రావు, ఓమ బిక్షపతి అన్నారు. గ్రామాభివృద్ధి కోసం స్వతంత్రంగా సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆవుల శ్యామలత ఉపేందర్‌ను ఆదరించాలన్నారు. గ్రామస్తులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## మహిళా శక్తి భవన నిర్మాణానికి చర్యలు చేపట్టండి : మేయర్ సుధారాణి




**ప్రజాపక్షం/ఖిలా వరంగల్:** మహిళా శక్తి భవన నిర్మాణానికి చర్యలు చేపట్టాలని నగర మేయర్ గుండు సుధారాణి ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. శనివారం బల్దియా ప్రధాన కార్యాలయ ఆవరణలో మేయర్ క్షేత్రస్థాయిలో మహిళ శక్తి భవన నిర్మాణానికి స్థల పరిశీలన చేసి సమర్థవంతంగా చేపట్టుటకు అధికారులకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ బల్దియా ప్రధాన కార్యాలయ ఆవరణలో గల వనిత వనం ప్రాంతంలో మహిళా శక్తి, భవన నిర్మాణానికి స్థల పరిశీలన చేయడం జరిగిందని, వనిత వనం ప్రాంతంలో గల లోటస్ పాండ్‌ను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించి ఇదే ప్రాంతంలో ప్రవహిస్తున్న నాలా ప్రవాహా తీరును మేయర్ ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ సత్యనారాయణ, సిహెచ్‌ఓ రమేష్, ఎంహెచ్‌ఓ డాక్టర్ రాజేష్, హెచ్‌ఓ లక్ష్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# సాయి ఈశ్వరా చారి ప్రాణ త్యాగం వృథా కాదు

బిసి జెఎసి ఉమ్మడి వరంగల్ జిల్లా చైర్మన్ వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్



**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్:** నాడు ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం బీసీల ముద్దుబిడ్డ శ్రీకాంతాచారి ప్రాణ త్యాగంతో సాధించుకున్న తెలంగాణలో రెడ్లు, వెలమలు తెలంగాణ రాష్ట్రంలో అధికారాన్ని కబ్జా చేసి, రాష్ట్రంలో 90 శాతం ఉన్న ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీ, బిసిలను రాజకీయంగా అణిచివేస్తున్నారని, కామారెడ్డి డిక్లరేషన్ పేరుతో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పిస్తామని చెప్పిన కాంగ్రెస్, దేశాన్ని పరిపాలిస్తున్న బిజెపిలు బిసిలకు రిజర్వేషన్లు కేటాయించకుండా అన్యాయం చేస్తున్నారనే ఆవేదనతో మనస్థాపం చెందిన బిసిల ముద్దుబిడ్డ సాయి ఈశ్వరచారి నేడు ఆత్మ బలిదానం చేసుకున్నాడని బిసి జెఎసి ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ ఆవేదన వ్యక్తం చేసారు. బిసిరిజర్వేషన్ల కోసం ప్రాణత్యాగం చేసిన సాయి ఈశ్వరాచారి ఆత్మకు శాంతి చేకూరాలని శనివారం హనుమకొండ జిల్లా స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో హనుమకొండ టైలర్ స్ట్రీట్‌లో దివంగత సాయి ఈశ్వర చారికి నివాళులు అర్పించారు. ముందుగా సాయి ఈశ్వర చారి చిత్రపటానికి పూల మాలలు వేసి, మౌనం పాటించి ఘనంగా నివాళులు అర్పించి వారి ఆశయ సాధన కోసం బిసిలందరు ప్రభుత్వలపైన పోరాడాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమానికి హాజరైన వడ్లకొండ వేణుగోపాల్ మాట్లాడుతూ సాయి ఈశ్వరాచారి మృతికి కాంగ్రెస్, బిజెపి పార్టీలే నైతిక బాధ్యత వహించాలన్నారు. ఇది ముమ్మాటికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల హత్యగానే బీసీ సమాజం పరిగణిస్తుందన్నారు. ఈ హత్యకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిలు బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. సాయి ఈశ్వరాచారి మృతితోనైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దిగిరావాలన్నారు. బిసి రిజర్వేషన్ల చట్టాన్ని రాజ్యాంగం ద్వారా 9వ, షెడ్యూల్లో నేర్పించి, ఈ పార్లమెంట్ సమావేశాల్లోనే బిసి రిజర్వేషన్ల బిల్లును ఆమోదింప చేయాలన్నారు. తక్షణమే సర్పంచ్ ఎన్నికలను నిలిపివేయకుంటే, బిసి ద్రోహుల పార్టీలైన కాంగ్రెస్, బిజెపి నాయకుల ఇండ్లను ముట్టడిస్తామని హెచ్చరించారు. సాయి ఈశ్వరాచారి ఆత్మ త్యాగంతోనైనా కాంగ్రెస్, బిజెపి పార్టీలలోని బిసి నేతలంతా రాజీనామా చేయాలని కోరారు. బిసి జెఎసి వరంగల్ ఉమ్మడి జిల్లా వైస్ చైర్మన్ బోనగాని యాదగిరి గౌడ్ మాట్లాడుతూ సాయి ఈశ్వరాచారి మృతిపై అఖిల పక్ష పార్టీల వైఖరిని ప్రకటించాలన్నారు. బిసి సమాజానికి రిజర్వేషన్లను కల్పించడం కోసం ఆత్మహుతి చేసుకున్న సాయి ఈశ్వరాచారి కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం కోటి రూపాయల ఎక్స్ గ్రేషియాను ప్రకటించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్వర్ణకార సంఘ ఉపాధ్యక్షలు కొత్తగట్టు వీరబ్రహ్మాచారి, తెలంగాణ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పెండోట చక్రపాణి, రాష్ట్ర కార్యదర్శులు డాక్టర్ పొడిచెట్టి విష్ణువర్ధన్, కటుకోజ్వల సత్యనారాయణ, జక్కోజు కోటేశ్వర్ రావు, స్వర్ణకార సంఘం నాయకులు, కార్యకర్తలు పానుగంటి రవీందర్, ఆసం రవి, మధు, శ్రీను, శ్రీధర్, మనోజ్ కుమార్, శ్రీనివాస్, సురేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# క్రీడ

## డికాక్ సెంచరీ..

రాయ్‌పూర్ వన్డేలో తేలిపోయిన భారత బౌలర్లు శనివారం వైజాగ్‌లో చెలరేగారు. సిరీస్ విజేతను నిర్ణయించే ఈ మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా హిట్టర్ల జోరుకు కళ్లెం వేశారు. ప్రసిధ్ కృష్ణ(4–66) టాపార్డర్‌ను దెబ్బకొట్టగా.. స్పిన్నర్ కుల్దీప్ యాదవ్(4–41) మిడిలార్డర్‌ను పడగొట్టి సఫారీలకు షాకిచ్చాడు. ఒకే ఓవర్లో డేంజరస్ డెవాల్డ్ బ్రెవిస్(29), మార్కో యాన్సెన్(17)లను ఔట్ చేసి భారీ స్కోర్ ఆశలపై నీళ్లు చల్లాడు కుల్దీప్. ఓపెనర్ క్వింటన్ డికాక్(106) సెంచరీతో కదం తొక్కగా.. కెప్టెన్ తెంబా బవుమా(48) రాణించగా ప్రొటీస్ టీమ్ 270కి ఆలౌటయ్యింది. సిరీస్ విజేతను నిర్ణయించే మూడో వన్డేలో భారత బౌలర్లు గొప్పగా పుంజుకున్నారు. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన దక్షిణాఫ్రికాను ఇన్నింగ్స్ మొదటి ఓవర్లోనే యువ పేసర్ అర్ష్‌దీప్ సింగ్(1–30) దెబ్బకొట్టాడు. ఓపెనర్ రియాన్ రికెల్టన్(0) వికెట్ తీసి సఫారీలపై ఒత్తిడి పెంచాడు సింగ్. అయితే.. క్వింటన్ డికాక్(106), కెప్టెన్ తెంబా బవుమా(48)లు రెండో వికెట్‌కు అర్ధ శతకం భాగస్వామ్యంతో దక్షిణాఫ్రికాను ఆదుకున్నారు. హాఫ్ సెంచరీకి చేరువైన బవుమాను జడేజా బోల్తా కొట్టించాడు. ఆ తర్వాత వచ్చిన మ్యాథ్యూ బ్రీట్జ్(24), రాయ్‌పూర్ శతక వీరుడు మర్క్‌రమ్(1)లను ఔట్ చేసిన ప్రసిధ్ కృష్ణ(4–66) స్కోర్ వేగానికి బ్రేకులు వేశాడు.



270కే దక్షిణాఫ్రికా ఆలౌట్
చెరో నాలుగు వికెట్లు పడగొట్టిన ప్రసిధ్, కుల్దీప్
భారత్ టార్గెట్ 271

### ఇండియాపై ఏడో సెంచరీ..

ఓవైపు వికెట్లు పడుతున్నా డికాక్ మాత్రం దూకుడు తగ్గించలేదు. 80 బంతుల్లో సెంచరీకి చేరువైన డికాక్ భారత్‌పై ఏడోసారి ఈ ఫీట్ నమోదు చేశాడు. శతకం తర్వాత మరింత చెలరేగాలనుకున్న డికాక్‌ను ప్రసిధ్ బౌల్డ్ చేసి సఫారీలను దెబ్బకొట్టాడు. 99కే ఐదు వికెట్ల పడిన వేళ.. యువకెరటం డెవాల్డ్ బ్రెవిస్(29), మార్కో యాన్సెన్(17)లు బౌండరీలతో చెలరేగారు. డెత్ ఓవర్లలో మరింత దంచేయాలనుకున్న ఈ ఇద్దరిని 39వ ఓవర్లో ఔట్ చేశాడు కుల్దీప్. ఒక్క పరుగు తేడాతో హిట్టర్లు వెనుదిరగడంతో పర్యాటక జట్టు 300ల మార్క్ చేరుకోలేకపోయింది. కాసేపటికే కార్బిన్ బాష్(9)ను సైతం రిటర్న్ క్యాచ్‌తో వెనక్కి పంపాడు కుల్దీప్. ఆఖర్లో .. కేశవ్ మహారాజ్(20 నాటౌట్) కాసేపు పోరాడగా.. బార్ట్‌మన్‌ను ప్రసిధ్ బౌల్డ్ చేయడంతో 270కే సఫారీ టీమ్ ఆలౌటయ్యింది.

## 2026 ఫుట్‌బాల్ వరల్డ్‌కప్ డ్రా విడుదల..

వచ్చే ఏడాది ఫిఫా ఫుట్‌బాల్ వరల్డ్‌కప్ జరగనున్నది. దీని కోసం వాషింగ్టన్ డీసీలో తుది డ్రా చేశారు. ఆ కార్యక్రమంలో ట్రంప్ పాల్గొన్నారు. మొత్తం మూడు దేశాలు వచ్చే ఏడాది ఫుట్‌బాల్ వరల్డ్‌కప్ నిర్వహించనున్నాయి. అమెరికా, కెనడా, మెక్సికో దేశాల్లో ఆ మ్యాచ్‌లు ఉంటాయి. మొత్తం 48 దేశాలు వరల్డ్‌కప్‌లో తలపడనున్నాయి. 2026 జూన్ 11న టోర్నీ ప్రారంభంకానున్నది. మొత్తం 104 మ్యాచ్‌లు నిర్వహించనున్నారు. గత చాంపియన్ అర్జెంటీనా తమ టైటిల్‌ను డిఫెండ్ చేసుకునేందుకు ట్రై చేయనున్నది. మేటి ప్లేయర్ లియోనల్ మెస్సీకి చెందిన అర్జెంటీనా తన తొలి మ్యాచ్‌లో అల్జీరియాతో తలపడనున్నది. కేప్ వర్డీ, కురకావో, జోర్డాన్, ఉజ్బెకిస్తాన్ దేశాల్లో తమ గ్రూపు ప్రత్యర్థులు ఎవరో తెలుసుకున్నారు. నాలుగు సార్లు చాంపియన్‌షిప్ గెలిచిన జర్మనీతో కురకావో తన ఫస్ట్ మ్యాచ్‌లో పోటీపడనున్నది. టోర్నమెంట్ ఓపెనింగ్ మ్యాచ్‌కు మెక్సికో వేదిక కానున్నది. మెక్సికో సిటీలో ఉన్న అజ్‌టెకా స్టేడియంలో ఫస్ట్ మ్యాచ్ ఆడనున్నారు. గ్రూపు ఏలో జూన్ 11న దక్షిణాఫ్రికాతో ఆ మ్యాచ్ ఉండనున్నది. ఇప్పటికే టోర్నీలో పాల్గొనే 42 జట్లు ఖరారు అయ్యాయి. ఇక ప్లేఆఫ్స్‌లో ఉన్న ఆరు బెర్తుల కోసం 22 జట్లు పోటీపడనున్నాయి. వాటి ఫలితాలు మార్చి 31 వరకు తెలుస్తుంది. క్వార్టర్ ఫైనల్స్ నుంచి అన్ని మ్యాచ్‌లను అమెరికాలో నిర్వహించనున్నారు. జూలై 19న న్యూజెర్సీలోని ఈస్ట్ రూథర్‌ఫోర్డ్ స్టేడియంలో ఫైనల్ మ్యాచ్ జరగనున్నది.

## పింక్‌బాల్ టెస్టులో పట్టుబిగించిన ఆసీస్

స్వదేశంలో జరుగుతున్న యాషెస్ సిరీస్‌లో ఆస్ట్రేలియా జోరు కొనసాగుతోంది. పెర్త్‌లో రెండో రోజే ఇంగ్లాండ్‌ను ఓడించిన ఆతిథ్య జట్టు పింక్ బాల్ టెస్టులోనూ పట్టుబిగించింది. తొలి ఇన్నింగ్స్‌లో భారీ స్కోర్ చేసిన ఆసీస్.. రెండో ఇన్నింగ్స్‌లో మిచెల్ స్టార్క్(2–48), స్కాట్ బొలాండ్(2–33)ల ప్రత్యర్థి జట్టును వణికించగా సగం వికెట్లు తీసింది. ప్రధాన బ్యాటర్లు పెవిలియన్ చేరగా స్టోక్స్ సేన ఇంకా 43 పరుగులు వెనకబడిది. నాలుగోరోజు టెయిలెండర్లను త్వరగా చుట్టేస్తే.. కంగారూ టీమ్ వరుసగా రెండో విజయం సాధించడం లాంఛనమే. యాషెస్ సిరీస్‌లో ఇంగ్లాండ్ జట్టుకు కష్టాలు తప్పడం లేదు. పెర్త్‌లో దారుణ ఓటమి చవిచూసిన బెన్ స్టోక్స్ సేన.. గబ్బాలో జరుగుతున్న పింక్ బాల్ టెస్టులోనూ ఓటమి దిశగా పయనిస్తోంది. తొలి ఇన్నింగ్స్‌లో జో రూట్(1378 నాటౌట్) అజేయ శతకంతో పటిష్టంగా కనిపించిన ఇంగ్లండ్‌పై ఆస్ట్రేలియా మరోసారి పైచేయి సాధించింది. ఇంగ్లిష్ బౌలర్లను దీటుగా ఎదుర్కొన్న ఓపెనర్ వెథర్‌లాండ్(72), లబూసేన్ (65), మిచెల్ స్టార్క్(77), స్టీవెన్ స్మిత్(61), అలెక్స్ క్యారీ(63)ల అర్ధ శతకాలతో ఆసీస్‌కు భారీ స్కోర్ అందించారు. 416కే ఎనిమిది వికెట్లు పడిన ఆతిథ్య జట్టు స్టార్క్ హాఫ్ సెంచరీతో తొలి ఇన్నింగ్స్‌లో 511 పరుగులకు ఆలౌటయ్యింది.

### తొలి వికెట్‌కు 48 రన్స్



అనంతరం రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన ఇంగ్లాండ్ చూస్తుండగానే కీలక వికెట్లు కోల్పోయింది. ఓపెనర్లు జాక్ క్రాలే(44), బెన్ డకెట్(15) శుభారంభమిచ్చారు. తొలి వికెట్‌కు 48 రన్స్ జోడించిన ఈ ద్వయాన్ని విడదీసిన బోలాండ్ వికెట్ల వేటకు తెరతీశాడు. కాసేపటికే ఓలీ పోప్(26)ను నేసర్ రిటర్న్ క్యాచ్‌తో వెనక్కి పంపాడు. ఆ తర్వాత బొలాండ్ (2–33), స్టార్క్(2–48) కట్టుదిట్టమైన బౌలింగ్‌తో రూట్(15), హ్యారీ బ్రూక్(15), జేమీ స్మిత్(4)లు పెవిలియన్‌కు క్యూ కట్టారు. ఆసీస్ పేసర్ల జోరుతో 128కే ఆరు వికెట్లు పడిన జట్టును ఆదుకునేందుకు బెన్ స్టోక్స్(4 నాటౌట్), విల్ జాక్స్(4 నాటౌట్) ప్రయత్నిస్తున్నారు. వీరిద్దరూ అజేయంగా నిలవగా మూడోరోజు ఆట ముగిసే సరికి 6 వికెట్లు కోల్పోయి 136 పరుగులు చేసిన ఇంగ్లాండ్ ఇంకా 43 రన్స్ వెనకబడి ఉంది. నాలుగో రోజు తొలి సెషన్‌లో స్టోక్స్, జాక్స్ నిలబడితే సరి. లేదంటే ఇంగ్లాండ్‌కు మరో పరాభవం ఎదురవ్వడం ఖాయం.

# ఫోకస్ బిజినెస్





### ఈ వారం స్టాక్ మార్కెట్లు

బాంబే స్టాక్ ఎక్స్‌చేంజ్ (బిఎస్‌ఇ/ క్లోజింగ్): సెన్సెక్స్ 85,712.37 పాయింట్లు (ఈ వారం ప్రారంభంలో 85,706.67 పాయింట్లు. లాభం 5.7 పాయింట్లు).
**జాతీయ స్టాక్ ఎక్స్‌చేంజ్ (ఎన్‌ఎస్‌ఇ/ క్లోజింగ్):** నిఫ్టీ 26,186.45 పాయింట్లు (ఈ వారం ప్రారంభంలో 26,202.95 పాయింట్లు. నష్టం 16.5 పాయింట్లు)

### బులియన్ మార్కెట్లు

బంగారం నుంచి మదుపరుల దృష్టి క్రమంగా ఇతరత్రా పెట్టుబడులపైకి మారుతున్న నేపథ్యంలో, ఈ వారం బులియన్ మార్కెట్లు అటు భారీ లాభాలనుగానీ, ఇటు భారీ నష్టాలనుగానీ చవిచూడకుండా దాదాపుగా స్థిరంగా ఉన్నాయి. శనివారం నాటికి గ్రాము బంగారం 24 క్యారెట్లు రూ.12,982 నుంచి రూ.13,009కు, అదే విధంగా 22 క్యారెట్లు రూ.11,900 నుంచి 11,926కు, 18 క్యారెట్లు రూ.9,737 నుంచి రూ.9.809లకు చేరింది. ఇటీవలి కాలంలో బులియన్ మార్కెట్లు మొదటిసారి ఒక వారం దాదాపు స్థిరంగా కొనసాగడం ఇదే మొదటిసారి.

## రూపాయి భారీ పతనం



గతంలో ఎన్నడూ లేనంతగా, డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ భారీగా పతనమైంది. ఈవారం డాలర్ మారకపు విలువ రికార్డు స్థాయిలో 90 రూపాయలు దాటింది. శనివారం నాటికి ఫోరెక్స్ మార్కెట్‌లో డాలర్ 89.8960 రూపాయలుగా ఉంది. ఈ పరిణామం వివిధ రంగాలపై తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉంది. విదేశాల నుండి తెచ్చే చమురు, బంగారం, ఎలక్ట్రానిక్స్ వంటి వస్తువుల ధరలు పెరుగుతాయి. ఫలితంగా ద్రవ్యోల్బణం పెరుగుతుంది. ఇంధన ధరలు, రవాణా ఖర్చులు, రోజువారీ వస్తువుల ధరలు పెరగడం వల్ల ప్రజల ఖర్చులు పెరుగుతాయి. కొనుగోలు శక్తి దారుణంగా తగ్గుతుంది. దిగుమతులపై ఆధారపడే కంపెనీల తయారీ ఖర్చులు పెరుగుతాయి. ఎగుమతి కంపెనీలకు మాత్రమే రూపాయి బలహీనత కొంతమేర లాభం ఇవ్వొచ్చు. స్థూలంగా చూస్తే, ద్రవ్యోల్బణం పెరగడం, పెట్టుబడిదారుల్లో అనిశ్చితి రావడం వల్ల దేశ ఆర్థిక స్థిరత్వంపై ప్రభావం పడే ప్రమాదం కనిపిస్తున్నది. రూపాయి పతనాన్ని నిలువరించడానికి కేంద్రం, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) తక్షణ చర్యలు చేపట్టాలి. లేకపోతే, పరిస్థితి ప్రమాదకరంగా మారుతుంది.

## రుణాలపై వడ్డీలు తగ్గే అవకాశం





రెపో రేటు 25 బేసిస్ పాయింట్లు తగ్గించి, 5.25 శాతానికి తేవాలన్న రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) తీసుకున్న కీలక నిర్ణయంతో రుణాలపై వడ్డీ రేట్లు తగ్గే సూచనలు కనిపిస్తున్నాయి. ఇది ఈ ఏడాది జరిగిన ముఖ్యమైన వడ్డీ రేటు తగ్గింపుల్లో ఒకటిగా పేర్కొనాల్సిన ఈ నిర్ణయం వల్ల హోమ్ లోన్‌పై ఇఎంఐలు తగ్గవచ్చు. అదే విధంగా ఒకటి. కార్ లోన్, పర్సనల్ లోన్ వంటి రుణాలు కూడా చౌక అవుతాయి. కొత్తగా రుణాలు తీసుకోవాలని అనుకునేవారికి ఇది అనుకూల సమయం. రుణగ్రహీతలకు మద్దతునిచ్చే వడ్డీ రేటు తగ్గింపు, రుణదాతలను నిరుత్సాహ పరిచే అవకాశాలు ఉన్నాయి. కాగా, పెట్టుబడిదారులకు ప్రస్తుతం మార్కెట్లో కొన్ని ప్రతికూల సంకేతాలు కనిపిస్తున్నాయి. విదేశీ మదుపరులు భారీగా పెట్టుబడులు పెట్టవచ్చు. రూపాయి మారకం విలువ బలహీనంగా ఉండడం కూడా ఈ మార్పుకు ఒక కారణం. అంతేగాక, అంతర్జాతీయ షేర్ మార్కెట్లు డోలాయన పరిస్థితులు ఎదుర్కొంటున్నాయి. కాబట్టి, పెట్టుబడిదారులు జాగ్రతగా ఆలోచించి, నిర్ణయాలు తీసుకోవడం మంచిది.

## ఇండిగో సంక్షోభం

ప్రముఖ విమానయాన సంస్థ ఇండియో సంక్షేమం అటు ప్రయాణికులను, ఇటు వివిధ సంస్థలను ఇబ్బందులకు గురి చేస్తున్నది. సకాలంలో గమ్యాలకు చేరుకోలేక, ఉద్యోగాలు ఉంటాయో, ఊడుతాయో తెలియని పరిస్థితిలో చాలా మంది కన్నీళ్లు పెట్టుకుంటున్న వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ప్రయాణికులకు టికెట్ సొమ్మును తిరిగి ఇవ్వాలని, ప్రత్యేక సహాయక కౌంటర్లు ఏర్పాటు చేయాలని ఇండిగో సంస్థకు కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడం ఒకింత ఊరట మాత్రమే. కాగా, గత ఐదు రోజుల్లో 1,500 కంటే ఎక్కువ ఇండిగో విమానాలు రద్దయ్యాయి. చాలా సర్వీసులు ఆలస్యంగా నడుస్తున్నాయి. భారత పౌర విమానయాన సంస్థ ప్రవేశపెట్టిన కొత్త నిబంధనలు (ఫ్లైట్ డ్యూటీ టైమ్ లిమిటెడ్/ ఎఫ్‌డిటిఎల్) అమల్లోకి రావడమే ఈ సమస్యకు ప్రధాన కారణంగా చెప్తున్నారు. పైలట్లకు విశ్రాంతి సమయం పెరగడంతో సిబ్బంది కొరత ఏర్పడి, పెద్ద సంఖ్యలో విమాన సేవలు నిలిచిపోయాయి. ఆపరేషనల్ సిస్టమ్ ఒక్కసారిగా దెబ్బతినడంతో దేశవ్యాప్తంగా ఇండిగో సేవలు స్తంభించిపోయాయి. ఈ పరిణామాల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని, పైలట్లకు వారపు విశ్రాంతి సంబంధించిన కొత్త విధానాన్ని తాత్కాలికంగా వెనక్కి తీసుకుంది. విమాన భద్రతపై రాజీ పడకుండా, ప్రయాణికుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని కొత్త నిబంధనలు అమలు చేస్తున్నట్టు కేంద్రం ప్రకటించింది. భారతదేశంలో అతిపెద్ద, అత్యంత రద్దీగా ఉన్న విమానయాన సంస్థగా ఉన్న ఇండిగో, ఇలాంటి సంక్షోభాన్ని ఎదుర్కోవడం అరుదు. ఒకటి రెండు రోజుల్లో పరిస్థితి చక్కబడుతుందని ఇండిగో సంస్థ ప్రకటిస్తున్నప్పటికీ, సిబ్బంది కొరతను ఇంత హఠాత్తుగా ఎలా పరిష్కరిస్తారన్న ప్రశ్న తలెత్తుతున్నది.





## గ్రామాల అభివృద్ధికి సేవకులుగా పని చేస్తాం

సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి బి.అజయ్ సారధి రెడ్డి



**ప్రజాపక్షం/మహబూబాబాద్:** మహబూబాద్ మండలంలోని ముడుపుగల్, దామ్య తండా గ్రామపంచాయతీ సిపిఐ అభ్యర్థులు తండా సందీప్ బానోత్ లింగ్య నాయక్‌ల గెలుపు కోరుతూ శనివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి బి.అజయ్ సారధి రెడ్డి మాట్లాడుతూ సిపిఐ అభ్యర్థులను గెలిపించాలని సేవకులుగా పనిచేస్తామని హామీ ఇచ్చారు. గ్రామాల అభివృద్ధికై సిపిఐ అభ్యర్థులకే ఓటు వేయాలని, గ్రామాలలో రైతాంగ సమస్యలు, ఎరువుల సమస్యలు, యూరియా సమస్యలకు విత్తనాల సమస్యలు, స్థానిక సైడ్ కాలువలు, సిసి డ్రైనేజీలు అభివృద్ధి కై సిపిఐ అభ్యర్థులకు ఓటు వేయాలని ఆయన కోరారు. మహబూబాబాద్ మండలంలో సిపిఐ అనేక పోరాటాలు నిర్వహించిందని ఈ ప్రాంతంలో దొరలకు ఎదురొడ్డి రైతుల కోసం ప్రజల కోసం పోరాటం చేసిన చరిత్ర సిపిఐకి ఉందన్నారు. గ్రామాల సమస్యల పరిష్కారం కోసం సిపిఐ అభ్యర్థులను గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో వార్డు అభ్యర్థులు పొలగాని అరుణ్ కుమార్, వినయ్ కుమార్, తం డా శ్రీనాథ్, సుమన్, పెరుగు కుమార్, రేసపల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, మామిండ్ల సాంబలక్ష్మి, వీరవెల్లి రవి, వెలుగు శ్రావణ్, కేదాసు రమేష్, వంకాయలపాటి చిరంజీవి, జలగం ప్ర వీణ్, ఆబోతు అశోక్, వంకాయలపాటి చిరంజీవి, తోట రాజకుమారి, మంద శం కర్, ఎర్రో జు పద్మ, తండ శ్రీనాథ్, మంద శ్రీను, కవిత, పద్మ, ఎండి రఫీ తదితరులు పాల్గొన్నారు.

### బలపాల గ్రామంలో సిపిఐలో చేరిక

బూర్జువా పార్టీల విధానాలు నచ్చక సిపిఐ విధానాలకు ఆకర్షితులై బలపాల గ్రామంలో వివిధ పార్టీల నుండి పెద్ద ఎత్తున సిపిఐలో చేరారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి బి.విజయ సారథి మాట్లాడుతూ పాలక పార్టీలు ప్రజలను ఎప్పటికప్పుడు మభ్యపెడుతూ తమ అవకాశవా ద రాజకీయాలకు వాడుకుంటుందని అలాంటి పార్టీలకు ఎన్నికల సమయంలో తగిన బుద్ధి చెప్పాలని, ప్రజల హక్కుల కోసం, సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటాలు నిర్వహించే సిపిఐ పార్టీ పట్ల అకర్షితులై వివిధ పార్టీల నుండి వచ్చిన రునావత్ రమేష్ సూరి , రొయ్యల రమేష్ బాల్ని వెంకన్న తదితరులకు, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్ రెడ్డితో కలసి పార్టీ కండువాలు కప్పి సిపిఐ పార్టీ లోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నెల్లూరు నాగేశ్వరరా వు, తురక రమేష్, రామగొని రవి, వెంకటేశ్వ ర్లు, వెంకటనారాయణ, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.



# రెండు విడతల్లో నాలుగు పంచాయతీలు సిపిఐ కైవసం

ఐదు ఉప సర్పంచ్‌లు, 30 వార్డుల్లో సిపిఐ సభ్యుల ఏకగ్రీవ ఎన్నిక









**ప్రజాపక్షం/ ఖమ్మం :** గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సిపిఐ శుభారంభం చేసింది. మొదటి, రెండవ విడత పంచాయతీ ఎన్నికల నామినేషన్ల ఉపసంహరణ ఘట్టం తర్వాత నాలుగు పంచాయతీలలో సిపిఐ అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సిపిఐ సర్పంచ్‌లు ఎన్నికైన చోట వార్డులు కూడా ఏకగ్రీవంగా ఎన్నిక కావడం గమనార్హం. తొలి విడత పంచాయతీ ఎన్నికలకు సంబంధించి చింతకాని మండలం రాఘవాపురం గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా కాంపల్లి కోటమ్మ ఏకగ్రీవంగా ఎన్నిక కాగా సిపిఐకి చెందిన అబ్బూరి మహేష్ ఉప సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కామేపల్లి మండలం ఊటుకూరు గ్రామ పంచాయతీని సిపిఐ కైవసం చేసుకుంది. రెండవ విడత నామినేషన్ల సందర్భంగా సిపిఐకి చెందిన ఈసం హన్మంతరావు ఒక్కరే సర్పంచ్‌గా నామినేషన్ వేయడంతో గ్రామ పంచాయతీలోని 10 వార్డులు కూడా ఏకగ్రీవమయ్యాయి. రెండవ దశ నామినేషన్ల ఉపసంహరణ ఘట్టం శనివారంతో ముగియగా ఖమ్మం రూరల్ మండలంలోని రెండు గ్రామ పంచాయతీలను సిపిఐ అభ్యరులు ఏకగ్రీవంగా గెలుచుకున్నారు. ఖమ్మం రూరల్ మండలం పల్లె గూడెంలో సిపిఐకి చెందిన చుండూరి సృజన సర్పంచ్ అభ్యర్థిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. దారెడు గ్రామ పంచాయతీని వరుసగా సిపిఐ ఐదవ సారి కైవసం చేసుకుంది. గతంలో వరుసగా నాలుగు సార్లు సిపిఐ అభ్యర్థులు విజయం సాధించగా ఈ దఫా ఎన్నికల్లో సిపిఐకి చెందిన బత్తుల వెంకటేశ్వర్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇక్కడ వార్డులు కూడా ఏకగ్రీవమయ్యాయి. కూసుమంచి మండలంలోని లాల్‌సింగ్ తండాలో సిపిఐ అభ్యర్థి ఉప సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తిరుమలాయపాలెం మండలం ఎర్రగడ్డలో సిపిఐకి చెందిన అభ్యర్థి ఉప సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. ఏకగ్రీవంగా ఎన్నికైన పంచాయతీలను నాలుగు గ్రామ పంచాయతీ సర్పంచ్‌లు, ఐదు ఉప సర్పంచ్‌లను సిపిఐ ఏకగ్రీవంగా గెలుచుకోగా ఇప్పటికే 30 వార్డుల్లో సిపిఐకి చెందిన వారు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వివిధ వార్డుల్లో ఒక్కొక్కరు నామినేషన్ వేయడంతో అభ్యర్థుల ఎన్నిక ఏకగ్రీవమైంది. సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మహ్మద్ మౌలానా, జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, రాష్ట్ర సమితి సభ్యులు కొండపర్తి గోవిందరావు, ఏపూరి లతాదేవి, జిల్లా కార్యవర్గ సభ్యులు పుచ్చకాయల కమలాకర్ తదితరులు ఎన్నికైన వారిని అభినందించారు. ఈ సందర్భంగా బాగం హేమంతరావు మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి కోసం నిజాయితీతో కూడిన పరిపాలన కోసం సిపిఐ అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుత ఎన్నికల్లో బరిలో ఉన్న సిపిఐ అభ్యర్థులకు ఆయా గ్రామ పంచాయతీల ప్రజలు తోడ్పాటునందించాలని ఆయన కోరారు.గ్రామ పంచాయతీ ఎన్నికల్లో విచ్చలవిడిగా ఖర్చు చేస్తున్నప్పటికి ప్రజలు సిపిఐ అభ్యర్థులకు అపూర్వ మద్దతునిస్తున్నారన్నా రు. సిపిఐ అభ్యర్థులకు మద్దతునిస్తున్న ప్రతి ఒక్కరికి కృ తజ్ఞతలు తెలుపుతున్నట్లు హేమంతరావు తెలిపారు. సిపిఐ, సిపిఐ బలపర్చిన అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

## ఓటు అనే వజ్రాయుధాన్ని రాజ్యాంగం ద్వారా ప్రజలకు అందించిన మహనీయుడు అంబేద్కర్

సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ బాష్ మియా





**ప్రజాపక్షం/ వరంగల్ :** ఓటు అనే వజ్రాయుధాన్ని రాజ్యాంగం ద్వారా ప్రజలకు అందించిన మహనీయుడు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అని సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ బాష్ మియా అన్నారు. అంబేద్కర్ 69వ వర్ధంతి సందర్భంగా సిపిఐ కార్యాలయం శివనగర్ తమ్మెర భవన్‌లో శనివారం అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయవాదిగా, ఆర్థికవేత్తగా, రాజకీయవేత్తగా, సామాజిక సంస్కర్తగా రాజ్యాంగ నిర్మాతగా భారతీయుల గుండెల్లో ఎప్పటికీ నిలిచిపోయే మహనీయుడు డాక్టర్ భీమ్‌రావ్ అంబేద్కర్ అన్నారు. అంటరానితనాన్ని వ్యతిరేకిస్తూ దళితులు, మహిళలు, కార్మికుల హక్కుల కోసం అలుపెరుగని పోరాటం చేసిన యోధుడు అంబేద్కర్ అని కొనియాడారు. దేశంలో అన్ని మతాలు, తెగలు, దళితులు, గిరిజనులు, వెనుకబడిన కులాలు, తదితర వర్గాలకు సమన్యాయం జరిగేలా వారి హక్కులకు భంగం వాటిల్లకుండా ఉండేందుకు సర్వసత్తాక సార్వభౌమాధికారాన్ని దక్కించుకొనేందుకు వీలుగా రాజ్యాంగాన్ని రూపొందించిన రూపశిల్పి అన్నారు. అంబేద్కర్ భారత రాజ్యాంగం ద్వారా ప్రతి పౌరునికి సమాన హ క్కులు అవకాశాలు, ఓటు హక్కుకల్పించి, సా మాజిక అసమానతలకై రిజర్వేషన్లు కల్పించి, అంటరాని సమాజాన్ని రూపుమాపాలని కుల నిర్మూలనకై పరితపించిన యోధుడు అంబేద్కర్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి దండు లక్ష్మ ణ్, జిల్లా కార్యవర్గ సభ్యులు గుండె బద్రి, గన్నారపు రమేష్ ,జిల్లా కౌన్సిల్ సభ్యులు ల్యాదల్ల శరత్, బెజ్జంకి యాకాంబ్ర చారి, జాన్ పాల్, యాకుబ్, యాదగిరి, జన్ను రవి తదితరులు పాల్గొన్నారు

## సిపిఐ అభివృద్ధే ఎజెండాగా ముందుకు

సర్పంచ్ అభ్యర్థి మెస్సు మమత ప్రచారం

**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సిపిఐ కార్యవర్గ సభ్యులు, ఆళ్లపల్లి మండల మాజీ వైస్ ఎంపిపి రేసు ఎల్లయ్య ఆధ్వర్యంలో ఆల్లపల్లి గ్రామ పంచాయతీ సిపిఐ సర్పంచ్ అభ్యర్థి మెస్సు మమత విజయమే లక్ష్యంగా మైలారం గ్రామంలో శనివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రేసు ఎల్లయ్య మాట్లాడుతూ 100 సంవత్సరాలుగా ప్రజలను కాపాడుతు న్న పార్టీ సిపిఐ అని అన్నారు. ప్రచారంలో ప్రజల నుండి వస్తున్న స్పందన గాను సిపిఐ యువజన విభాగం తరపున కృతజ్ఞతలు తెలిపారు. మూడో సారి సర్పంచ్ పదవిని కైవసం చేసుకునే విధంగా కార్యకర్తల వ్యూహరచరణ, అదే విధంగా గత పది సంవత్సరాలుగా ఆళ్లపల్లి మండల కేంద్రంలో సిపిఐ చేసిన అభివృద్ధే ఎజెండాగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో ఆళ్లపల్లి మండల మాజీ ఉపసర్పంచ్ గుంతోజు సదానంద చారి, మద్దెల వెంకటేశ్వర్లు, కుంట సహదేవ్, పరమ ఇమ్మానేయులు, శ్రీరామ్ హరీష్, నరెడ్ల బిక్షం, నరెడ్ల శివ, తదితరులు పాల్గొన్నారు.





# స్థానికం
REGIONAL NEWS
కరీంనగర్, మెదక్ ఆదిలాబాద్, నిజామాబాద్

## స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపే ధ్యేయం :కూచాడి

**ప్రజాపక్షం/నిర్మల్ కలెక్టరేట్:**స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపే ధ్యేయంగా ముందుకెళ్తున్నామని నిర్మల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కూచాడి శ్రీహరిరావు అన్నారు.సారంగాపూర్ మండల కేంద్రానికి చెందిన బిజెపి నాయకులు సామల వీరయ్య,మాజీ ఎంపిటిసిపద్మ వీరయ్యలు బిజెపి కి రాజీనామా చేసి హస్తం పార్టీలో 100 మందితో శనివారం శ్రీహరిరావు కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి,సంక్షేమ పథకాలను చూసి పార్టీలో చేరినట్లు వారు పేర్కొన్నారు.రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ బలపర్చిన అభ్యర్థుల విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు.



## రాజ్యాంగ రక్షణకు పోరాటాలు



**ప్రజాపక్షం / బెల్లంపల్లి :**కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం మతతత్వాన్ని ప్రోత్సహిస్తూ రాజ్యాంగ మౌలిక సూత్రాలను తుంగలో తొక్కి నిరంకుశ పాలన సాగిస్తోందని, ఈ విధానాలకు వ్యతిరేకంగా రాజ్యాంగ రక్షణకు ప్రజలు పోరాటాలు చేయాలని సిపిఐ నాయకులు పిలుపునిచ్చారు. బెల్లంపల్లిలోని సిపిఐ కార్యాలయంలో, కాంటా చౌరస్తా వద్ద డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 69వ వర్థంతి సందర్భంగా సిపిఐ పట్టణ సమితి ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి, విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ పట్టణ కార్యదర్శి ఆడెపు రాజమౌళి, రాష్ట్ర సమితి సభ్యులు బొల్లం పూర్ణిమ, జిల్లా కార్యవర్గ సభ్యులు చిప్ప నరసయ్య మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పట్టణ సహాయ కార్యదర్శి బొల్లం తిలక్ అంబేద్కర్, మండల కార్యదర్శి బొంతల లక్ష్మి నారాయణ, జిల్లా సమితి సభ్యులు దాసరి శ్రీధర్, కొంకుల రాజేష్, రత్నం రాజం, పట్టణ కార్యవర్గ సభ్యులు బొంకూర్ రామచందర్, ఇనుముల రాయమల్లు, కలువల రాయమల్లు పాల్గొన్నారు.

## గుడుంబా తయారీ, విక్రయాలపై కఠిన చర్యలు



**ప్రజాపక్షం/కాసిపేట:**గుడుంబా తయారు చేసినా, విక్రయించినా చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని దేవాపూర్ ఎస్ఐ గంగారాం హెచ్చరించారు. దేవాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని లంబాడీతండా (డి) గ్రామ శివారులో ఉన్న గుడుంబా స్థావరాలపై శనివారం ఎస్ఐ తమ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. అక్కడ గుట్టుచప్పుడు కాకుండా గుడుంబా తయారు చేస్తున్నారని తెలుసుకొని 1500 లీటర్ల బెల్లం పానకాన్ని, త యారీ సామగ్రిని ధ్వంసం చేశారు. అనంతరం గ్రామస్తులతో మాట్లాడా రు. గ్రామంపై నిరంతరం నిఘా ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో దేవాపూర్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## బెల్ట్ షాప్ నిర్వాహకుల బైండోవర్



**ప్రజాపక్షం/హాజీపూర్:**రాబోయే గ్రామపంచాయతీ ఎన్నికల దృష్ట్యా రాపల్లి గ్రామానికి చెందిన ఐదుగురు బెల్ట్ షాప్ నిర్వాహకులను బైండోవర్ చేసినట్లు హాజీపూర్ ఎస్ఐ ఎన్. స్వరూప్ రాజ్ తెలిపారు. శనివారం హాజీపూర్ తహసీల్దార్ శ్రీనివాసరావు దేశ్ పాండే సమక్షంలో వీరిని హాజరుపరిచారు. గ్రామానికి చెందిన గున్నాల సత్య గౌడ్, కొమిరె రాజేందర్, వెల్దండి శేఖర్, గణపతి హరీష్, దేనవేని రాజశేఖర్‌లను ఒక సంవత్సరం పాటు సత్ప్రవర్తనతో ఉండాలని ఆదేశించారు. నిబంధనలు ఉల్లంఘించి ఏదైనా నేరానికి పాల్పడితే ఆరు నెలల జైలు శిక్ష లేదా లక్ష రూపాయల జరిమానా విధిస్తామని హెచ్చరిస్తూ వారిని బైండోవర్ చేశారు.

## నామినేషన్ స్క్రూటినీ పరిశీలన



**ప్రజాపక్షం/శివ్వంపేట :** సర్పంచ్, వార్డు స్థానాలకు అభ్యర్థులు దాఖలు చేసిన ఎన్నికల నామినేషన్ పత్రాల పరిశీలన కార్యక్రమం శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఎన్నికల అధికారులు నిర్వహించడం జరిగింది. మండలంలోని 37 గ్రామ పంచాయతీ స్థానాలకు గాను మొత్తం 209 నామినేషన్లు పోటీ చేయు అభ్యర్థులు దాఖలు చేయగా అన్ని 37 గ్రామ పంచాయతీలలోని వార్డుసభ్యుల స్థానాలకు మొత్తం 779 నామినేషన్లు అభ్యర్థులు దాఖలు చేసినట్టు మండల ఎన్నికల అధికారులు తెలిపారు. అభ్యర్థులు దాఖలు చేసిన నామినేషన్ పత్రాలను స్క్రూటినీ సందర్భంగా ఎన్నికల అధికారులు క్షుణ్ణంగా పరిశీలించడం జరిగిందని మండల రిటర్నింగ్ అధికారి వెంకటలక్ష్మమ్మ తెలిపారు. తమ మద్దతుదారులతో వేసిన ఎన్నికల నామినేషన్ల పరిశీలన కార్యక్రమానికి సర్పంచ్ అభ్యర్థులు, వార్డు మెంబర్ అభ్యర్థులతో మండల పరిషత్ కార్యాలయానికి తరలివచ్చారు. దాఖలు చేసిన తమ ప్యానల్ అభ్యర్థుల నామినేషన్లు అన్ని సక్రమమని ఎన్నికల అధికారులు తెలుపడంతో అభ్యర్థులంతా సంతోషంగా వెనుదిరిగారు.

## ఎన్నికల ప్రవర్తన నియమావళి పాటించాలి: డిసిపి భాస్కర్

**ప్రజాపక్షం/జన్నారం:** రానున్న గ్రామపంచాయతీ ఎన్నికల సందర్భంగా ప్రజలందరూ ఎన్నికల ప్రవర్తన నియమావళిని కచ్చితంగా పాటించాలని డిసిపి భాస్కర్ సూచించారు. శనివారం జన్నారం మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా పోలీసుల ఆధ్వర్యంలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డిసిపి మాట్లాడుతూ ఎన్నికలు స్వేచ్ఛాయుతంగా, నిష్పాక్షికంగా, శాంతియుతంగా జరగడానికి పోలీస్ భద్రత పూర్తి చేశామని తెలిపారు. ప్రజల్లో నమ్మకం పెంపొందించడం, అవాంఛనీయ చర్యలను అరికట్టడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. అనుమతి లేకుండా ఎలాంటి ర్యాలీలు నిర్వహించరాదని తెలిపారు. డబ్బులు, మద్యం, బహుమతుల ద్వారా ఓటర్లను ప్రభావితం చేసే ప్రయత్నాలు గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎసిపి ప్రకాష్, లక్సెట్టిపేట సిఐ రమణమూర్తి, జన్నారం ఎస్ఐ అనూష, దండేపల్లి ఎస్ఐ తహసీనోద్దిన్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



## వృథాగా పోతున్న మిషన్ భగీరథ నీరు



**ప్రజాపక్షం/అల్లాదుర్గం:**మిషన్ భగీరథ తాగునీరు అందక అవస్థలు పడుతున్న ఆయా గ్రామాల ప్రజలు సంబంధిత అధికారుల నిర్లక్ష్య ధోరణికి నీళ్లు కాస్త వృధాగా పారుతున్నాయి. ఈ భగీరథ నీళ్లు వృధాగాపారుతూ పక్షం రోజులు గడుస్తున్న అధికారులు ఆ వైపు కన్నెత్తి చూడకపోవటం గమనార్హం. మెదక్ జిల్లా అల్లాదుర్గం మండలం ముప్పారం గ్రామానికి వెళ్లే రహదారి పక్కనే మిషన్ భగీరథ పైప్‌లైన్ పగిలి నీళ్లు వృధాగా రైతుల పంట చేలలో పారుతున్నాయి. మిషన్ భగీరథ పథకం ద్వారా ప్రతి ఇంటింటికి నిత్యం త్రాగునీళ్లు అందించాలనే సంకల్పంతో ప్రభుత్వం ముందడుగులు వేస్తున్న నేపథ్యంలో కిందిస్థాయి అధికారుల విధి నిర్వహణ లోపంతో మండల స్థాయి అధికారుల పర్యవేక్షణ కరువై ఈ పథకంపై పలు గ్రామాల నుండి విమర్శలు వినిపిస్తున్నాయి. ఐపి చౌరస్తా పక్కన, ముప్పారం తాండకు వారానికి ఒకరోజు లేదా ఎప్పుడో ఒకసారి భగీరథ నీళ్లు సరఫరా చేస్తున్నారని తండావాసులు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మిషన్ భగీరథ అధికారుల పర్యవేక్షణ కొరవడిందని దీంతో గ్రామాలకు నీటి కష్టాలు తప్పడం లేదని వారు ఆరోపించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ప్రత్యేక చొరవ చూపి, నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులపై చర్యలు తీసుకుని, పగిలిన పైప్ లైన్‌కు మరమ్మతులు చేపట్టి, నీటి వృధాను అరికట్టలన్నారు. గ్రామానికి నిత్యం త్రాగునీళ్లు సరఫరా అయ్యే దిశగా కృషి చేయాలని అధికారులను కోరారు.

## ఎన్నికల కోడ్‌లో ఎఫ్ఎస్‌టి తనిఖీలు



**ప్రజాపక్షం/నిజాంపేట్:**గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఎఫ్ఎస్టి బృందాలు తనిఖీలు చేపట్టారు. నిజాంపేట మండల కేంద్రంలో శనివారం డిప్యూటీ తహసిల్దార్ రమ్యశ్రీ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రజలు ఎన్నికల కోడ్ నేపథ్యంలో ప్రతి ఒక్కరు ఎన్నికల నియమావళికి లోబడి ఉండాలన్నారు. 50 వేల కంటే ఎక్కువ డబ్బులు రవాణా చేయవద్దని సూచించారు. ఎన్నికల కోడ్ను ఉల్లంఘిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## కేంద్ర ప్రభుత్వ నిధులతోనే గ్రామాల అభివృద్ధి

### మెదక్ ఎంపి రఘునందన్ రావు



**ప్రజాపక్షం/మెదక్ :**కేంద్ర ప్రభుత్వం నిధులతోనే పల్లెల్లో అభివృద్ధి సాధ్యపడుతుందని, మోదీ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధి కోసం 3,500 కోట్ల రూపాయలు విడుదల చేసిందని మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావు తెలిపారు. శనివారం మెదక్ జిల్లా కేంద్రం లోని టిఎన్‌జిఒభవన్ లో మెదక్ ఎంపి రఘునందన్ రావు ,జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ మల్లేష్ గౌడ్, మాజీ అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్ లతో కలిసి స్థానిక సంస్థల ఎన్నికలపై విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపి మాట్లాడుతూ సర్పంచ్ ఎన్నికల్లో వేలంపాటలకు రాజకీయ పార్టీలు తెరలేపాయని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీకి విరమణ చేసిన వారికి పింఛన్ డబ్బులు ఇచ్చేందుకే లేదని వారు గ్రామాల అభివృద్ధి ఎలా చేస్తారని ఎంపి ప్రశ్నించారు. ఉపాధి హామీ పథకం, కేంద్ర ప్రభుత్వ నిధులతో గ్రామాలను అభివృద్ధి చేసే అవకాశం ఉందన్నారు. ఈ సమావేశంలో పట్టణ అధ్యక్షుడు నాయిని ప్రసాద్, నాయకులు మండలాల అధ్యక్షుడు శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

## ఎన్నికల విధులు సమర్థవంతంగా నిర్వర్తించాలి




**ప్రజాపక్షం/నిర్మల్‌కలెక్టరేట్ :**గ్రామ పంచాయతీ ఎన్నికల విధుల్లో పాల్గొనబోయే పిఒ,ఎపిఒలు త మ బాధ్యతలు సమర్థవంతంగా నిర్వర్తించాలని జి ల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదేశించారు.శనివా రం మామడ మం డల కేంద్రంలోని రైతువేదికలో ఎన్నికల విధుల్లో పాల్గొనబోయే పిఒ, ఎపిఒలకు శి క్షణ కార్యక్రమం నిర్వహించారు.శిక్షకులు అందిస్తున్న శిక్షణ సరళిని ఆమె పరిశీలించారు.ఈ స ంద ర్భంగా కలెక్టర్ మాట్లాడు తూ,గ్రామపంచా యతీ ఎన్నికల నిర్వహణలో పిఓ ల పాత్ర కీలకమ ని తెలిపారు.మండలాల వారిగా పీఓలకు,ఎపిఓల కు ఎన్నికల విధులపై శిక్షణ ఇస్తున్నామని వివరించారు.పిఒలు బాధ్యతాయుతంగా తమ విధులు పూర్తిచేయాలన్నారు.పిఒలకు ఎన్నికల నిర్వహణపై పలు కీలక సూచనలు చేశారు.అధికారులకు సమయపాలన, క్రమశిక్షణ అత్యంత కీలకమని చెప్పారు. ఎన్నికల విధుల పారదర్శకంగా జవాబుదారీతనం తో,ఖచ్చితత్వంతో నిర్వర్తించాలని వివరించారు.ఎన్నికల నియమావళిని అనుసరించి అధికారులకు అప్పజెప్పిన బాధ్యతలు సక్రమంగా నిర్వహించి,ఎన్నికలను ప్రశాంతంగా పూర్తి చేయాలని అన్నారు.ఎటువంటి సందేహాలు ఉన్నా పై అధికారులను అడిగి తెలుసుకోవాలని సూచించారు.ఎన్నికల విధులపై పిఒలకు పలు ప్రశ్నలు అడిగారు.కలెక్టర్ అడిగిన ప్రశ్నలకు అధికారులు జవాబులు ఇచ్చారు.ఈ శిక్షణ కార్యక్రమంలో ఆర్‌డిఒ రత్నకళ్యాణి,డిపిఒశ్రీనివాస్, డిఇఒ భోజన్న,తహసిల్దార్ శ్రీనివాస్, ఎంపిడిఒ సుశీల్,ఇతర అధికారులు, సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

## బైంసా, తానూర్ ఫేజ్-3 నామినేషన్ ప్రక్రియ పర్యవేక్షణ



**ప్రజాపక్షం/బైంసా:**ముధోల్ నియోజకవర్గంలోని తానూర్, బైంసా మండలంలో గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధి ంచి జనరల్ అబ్జర్వర్ ఆయిషా మస్రత్ ఖానం ఎన్నికల ఏర్పాట్లను పరిశీలించేందుకు శనివారం రోజు ఫేజ్3 మండలాల్లోని నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ సజావుగా,నిబంధనల ప్రకారం జరుగుతున్న తీరును క్షుణ్ణంగా సమీక్షించారు.ఆయిషా మస్ర త్ ఖానం మొదటగా తానూర్ మండలం పరిధిలోని జిపిక్లస్టర్ బెల్తరోడాను సందర్శించి అక్కడి అధికారులతో మాట్లాడారు.ఆ తర్వాత ఆమె బైంసా మండలంలోని జిపి క్లస్టర్ దేగామ్ కేంద్రానికి వెళ్లి నామినేషన్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు.అనంతరం,ముధోల్ మండలంలోని కీలకమైన జిపి క్లస్టర్ తరోడాలో జరుగుతున్న నామినేషన్ల స్వీకరణ,పత్రాల పరిశీలన వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి,కేంద్రం వద్ద కల్పించిన సౌకర్యాలపై సంతృప్తి వ్యక్తం చేశారు.ఈ పర్యటనలో అబ్జర్వర్‌తో పాటు ఆయా మండలాలకు చెందిన ఎంపిడిఒ(మండల పరిషత్ అభివృద్ధి అధికారి)లు వెంట ఉండి,నామినేషన్ ప్రక్రియకు సంబంధించిన ప్రస్తుత స్థితిగతులను,నిబంధనల అమలు తీరును ఆమెకు వివరించారు.ఎన్నికల కోడ్ ఉల్లంఘనలు జరగకుండా,ఎలాంటి ఇబ్బందులు లేకుండా నామినేషన్ల స్వీకరణ కార్యక్రమం ప్రశాంతంగా పూర్తయ్యేలా చూడాలని ఈ సందర్భంగా జనరల్ అబ్జర్వర్ సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

## పారదర్శకంగా ప్రభుత్వ సేవలు




**ప్రజాపక్షం/మంచిర్యాల:**ప్రభుత్వం అందించే సంక్షేమ, అభివృద్ధి సేవలను పొందడం ప్రతి పౌరుడి హక్కు అని, ప్రజలకు పారదర్శకంగా సేవలు అందించేందుకు ప్రతి ఒక్కరూ సమన్వయంతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. అంతర్జాతీయ అవినీతి నిరోధక దినోత్సవం పురస్కరించుకొని అవినీతి నిరోధక శాఖ ఆధ్వర్యంలో ఈనెల 3వ తేదీ నుంచి 9వ తేదీ వరకు నిర్వహిస్తున్న వారోత్సవాల సందర్భంగా శనివారం నస్పూర్ లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్ లో గోడ ప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎవరైనా ప్రభుత్వ ఉద్యోగి లంచం అడిగితే 1064 నంబర్ కు డయల్ చేసి ఫిర్యాదు చేయవచ్చని, ఫిర్యాదు దారుల వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అవినీతి నిరోధక శాఖ డిఎస్పి జి.మధు, ఇన్స్పెక్టర్లు ఎం. స్వామి, ఎన్. కిరణ్ రెడ్డి, కలెక్టరేట్ పరిపాలన అధికారి పిన్న రాజేశ్వర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## శాంతి భద్రతల పరిరక్షణ పోలీస్ బాధ్యత




**ప్రజాపక్షం /నిజామాబాద్ అర్బన్ :**గ్రామ పంచాయతీ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది అప్రమత్తతతో విదులు నిర్వహించాలని, ప్రజల భద్రత, శాంతి భద్రతల పరిరక్షణ పోలీసుల తక్షణ కర్తవ్యమని నిజామాబాద్ పోలీసు కమిషనర్ పి. సాయి చైతన్య అన్నారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయం మినీ కాన్ఫరెన్సు హాల్ నుండి జిల్లా పోలీసు అధికారులు, ఎస్‌హెచ్‌వోలతో విడియో కాన్ఫరెన్సులో పాల్గొని, ఎన్నికల భద్రత, శాంతి బద్రత చర్యలు, పర్యవేక్షణకు సంబంధించిన సూచనలు, సలహాలను అడిషనల్ సిపి బసవారెడ్డితో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ పంచాయతీ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది అప్రమత్తతతో విధులు నిర్వహించాలని, జిల్లాలో ఎన్నికల నియమావళిని కట్టుదిట్టంగా అమలు చేయాలని, ఎన్నికలలో ఓటర్లను ప్రభావితం చేయడానికి అక్రమంగా డబ్బు, మద్యం ఇతర పదార్థాలు రాకుండాచెక్ పోస్టుల వద్ద ఇతర శాఖల సమన్వయంతో తనిఖీలు నిర్వహించాలన్నారు. విజిబుల్ పోలిసింగ్, నాకబందీలు, ఆకస్మిక తనిఖీలు నిరంతరం జరగాలని తెలిపారు. ఎస్‌హెచ్‌వోలు, విపివో లు ప్రతి గ్రామాన్ని సందర్శించి పోలింగ్ కేంద్రాలను పరిశీలించడంతో పాటు గ్రామాల్లో పెట్రోలింగ్‌ను మరింత బలోపేతం చేయాలని జాగ్రత్తలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు డిసిపి (అడ్మిన్) బస్వారెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్‌పెక్టర్ శ్రీశైలం, డిసిఆర్‌బి ఇన్స్‌పెక్టర్ రమేష్, అంజయ్య, ఎలక్షన్స్ సెల్ ఇన్స్‌పెక్టర్ వీరయ్య, కమ్యూనికేషన్ సిబ్బంది, విడియో కాన్ఫరెన్సు ద్వారా పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## రైతులను ఇబ్బంది పెడితే సహించేది లేదు



**ప్రజాపక్షం/గజ్వేల్:**ధాన్యం కొనుగోలును వెంట వెంటనే చేపట్టి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని, అందుకు భిన్నంగా వ్యవహరిస్తే సహించేది లేదని జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ అమీద్ హెచ్చరించారు. శనివారం మైలారంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, వెంట వెంటనే ట్యాగింగ్ చేయాలని సూచించారు. ముఖ్యంగా రైతుల నుండి చివరి ధాన్యం గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, ఇందులో అన్నదాతలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వివరించారు. ఆయన వెంట తహసీల్దార్ రఘువీర్ రెడ్డి, పిఎసిఎస్ సిఇఒ జితేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పోలింగ్ కేంద్రాల్లో కలెక్టర్ తనిఖీ





**ప్రజాపక్షం/ఎడపల్లి:**గ్రామ పంచాయతీ ఎన్నికలను పురస్కరించుకొని నిజామాబాద్ జిల్లా కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి శనివారం నవీపేట్, ఎడపల్లి మండలంలోని పోలింగ్ కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించారు. ఎన్నికల ఏర్పాట్లు పోలింగ్ ప్రక్రియ సజావుగా సాగేందుకు తీసుకుంటున్న చర్యలను ఆయన స్వయంగా పర్యవేక్షించారు. కలెక్టర్ మొదటగా నవీపేట్ మండలం అభంగపట్నం, ఆ తరువాత ఎడపల్లి మండలం జానకంపేట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పోలింగ్ స్టేషన్ల పరిధిలో నమోదైన ఓటర్ల సంఖ్య, సర్పంచ్, వార్డు స్థానాలకు పోటీలో ఉన్న అభ్యర్థుల వివరాలను స్థానిక అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల విధుల్లో ఉన్న సిబ్బందికి కలెక్టర్ పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఏకగ్రీవమైన సర్పంచ్, వార్డు స్థానాలను మినహాయించి, మిగిలిన స్థానాలకు మాత్రమే ఎన్నిక జరపాలని స్పష్టం చేశారు. పోలింగ్ ప్రక్రియకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఓటర్లు స్వేచ్ఛగా తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు వీలుగా ప్రతి పోలింగ్ స్టేషన్‌లో మౌళిక వసతులు కల్పించాలని అధికారులకు సూచించారు. పోలింగ్ ముగిసిన తరువాత ఓట్ల లెక్కింపును జాగ్రత్తగా నిర్వహించి, ఫలితాలను ప్రకటించాలని సూచించారు. ఉప సర్పంచ్ ఎన్నిక ప్రక్రియను కోరంను సరిచూసుకొని, నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని ఆదేశించారు. ఎన్నికల నియమావళి పక్కగా అమలు జరిగేలా పర్యవేక్షణ చేయాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి జానకంపేట్‌లో సిబ్బంది ఇంటింటికి తిరుగుతూ ఓటరు స్లిప్పులు పంపిణీ చేస్తున్న ప్రక్రియను స్వయంగా తనిఖీ చేశారు. అలాగే పోలింగ్ కేంద్రాలలో కూడా హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేసి, ఓటర్లకు వారి పోలింగ్ కేంద్రం వివరాలు తెలియచేసేలా చర్యలు తీసుకోవాలని అధికారుల కు సూచించారు. కలెక్టర్ వెంట స్థానిక తహసీల్దార్ ద త్తాత్రి,సెక్రెటరీలు,సహా ఇతర అధికారులు పాల్గొన్నా రు.

**రేషన్ పంపిణీ పారదర్శకంగా జరగాలి**

ఎడపల్లి మండలం నెహ్రూనగర్‌లోని రేషన్ దుకాణంలో శనివారం జిల్లా కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా లబ్ధిదారులకు బియ్యం పంపిణీ జరుగుతున్న తీరును, ముఖ్యంగా సన్నబియ్యం సరఫరాను ఆయన స్వయంగా పరిశీలించారు. లబ్ధిదారులకు సన్న బియ్యం సజావుగా, సక్రమంగా అందుతున్నాయా.. లేదా..? అనే విషయంపై కలెక్టర్ ఆరా తీశారు. రేషన్ కార్డుల్లో నమోదైన కుటుంబ సభ్యుల సంఖ్యకు అనుగుణంగా బియ్యం నిల్వలు దుకాణానికి కేటాయించబడ్డాయా లేదా..? అని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు ఎంత పరిమాణంలో బియ్యం పంపిణీ జరిగింది. ఇంకా ఎంత మంది లబ్ధిదారులకు పంపిణీ చేయాల్సి ఉందనే వివరాలను డీలర్ నుంచి తీసుకున్నారు. రికార్డులను తనిఖీ మేరకు బియ్యం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి రేషన్ డీలర్‌కు స్పష్టమైన సూచనలు ఇచ్చారు.

# స్థానికం
REGIONAL NEWS
కరీంనగర్, మెదక్ ఆదిలాబాద్, నిజామాబాద్



## ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యేంత వరకూ కోడ్ అమలు: కలెక్టర్

**ప్రజాపక్షం/కరీంనగర్:** గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యేంత వరకు జిల్లా అంతటా ఎన్నికల ప్రవర్తన నియమావళి (ఎంసిసి) అమలులో ఉంటుందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. కరీంనగర్ జిల్లాలో గ్రామ పంచాయతీ ఎన్నికలు మూడు దశల్లో నిర్వహించనున్న నేపథ్యంలో ఈ విషయాన్ని వెల్లడించారు. మొదటి దశ పోలింగ్ తో పాటు రెండవ దశ పోలింగ్ పూర్తయిన తర్వాత కూడా సంబంధిత గ్రామాలు, మండలాల్లో ఎన్నికల కోడ్ అమల్లోనే ఉంటుందని స్పష్టం చేశారు. మూడవ దశ ఎన్నికల ప్రక్రియ పూర్తయిన తర్వాత మాత్రమే ఎన్నికల ప్రవర్తనా నియమావళి తొలగిపోతుందని వివరించారు. మొదటి, రెండవ దశలో ఎన్నికైన అభ్యర్థులు, ఇతరులు ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించరాదని సూచించారు. ఏకగ్రీవమైన గ్రామ పంచాయతీలలో సైతం ఎన్నికల కోడ్ అమలులోనే ఉంటుందని పేర్కొన్నారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై ఎన్నికలకు దూరమయ్యేలా చర్యలు తీసుకోవడంతో పాటు చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## ఎన్నికల నియమావళి ఉల్లంఘిస్తే కఠిన చర్యలు: ఎస్పి



**ప్రజాపక్షం/ధర్మపురి :** గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో పోలీసు శాఖ తనిఖీలు, భద్రతా చర్యలు కట్టుదిట్టం చేసినట్లు జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు. ధర్మపురి మండలం రాయపట్నం జిల్లా సరిహద్దులో పోలీస్ శాఖ పక్షాన ఏర్పాటు చేసిన చెక్ పోస్టును శనివారం ఎస్పీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ అశోక్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళిని పగడ్బంధీగా అమలుచేస్తున్నట్లు తెలిపారు. అక్రమ నగదు,మద్యం,ఉచిత పంపిణీలు,ఇతర ప్రలోభాలపై ప్రత్యేక నిఘా కొనసాగుతుందని చెప్పారు.ఎన్నికలకు సంబంధించిన అనుచిత చర్యలకు పాల్పడితే ఎవరికైనా కఠిన చర్యలు తప్పవని ఎస్పీ హెచ్చరించారు.సరైన పత్రాలు, ఆధారాలు లేకుండా భారీ మొత్తంలో నగదు తీసుకెళ్ల వద్దని పేర్కొన్నారు. అత్యవసర అవసరాలకు తీసుకెళ్తే తగిన బిల్లులు,సంబంధిత పత్రాలు వెంట ఉంచుకోవాలన్నారు.చెక్ పోస్ట్ సిబ్బంది అన్ని వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని ఆదేశించారు. ఎలాంటి అక్రమాలు చోటు చేసుకోకుండా,ఎన్నికలు ప్రశాంతంగా ముగిసేలా విధులు నిర్వర్తించాలని పోలీసు సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ధర్మపురి సీఐ ఎలపాటి రాం నర్సింహారెడ్డి, ధర్మపురి, వెల్గటూర్,బుగ్గారం ఎస్సైలు జి.మహేష్,పులిచెర్ల ఉదయ్ కుమార్,జి.సతీష్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఇవిఎం గోదాం తనిఖీ



**ప్రజాపక్షం/కరీంనగర్ :** ఎన్నికల సంఘం మార్గనిర్దేశాల మేరకు ఎప్పటికప్పుడు ఈవిఎం, వివిప్యాట్ గోదాంను తనిఖీ చేసి సమగ్ర నివేదికను పంపిస్తున్నట్లు అదనపు కలెక్టర్ (రెవెన్యూ) లక్ష్మి కిరణ్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం సమీపంలో ఉన్న ఈవిఎం గోదాంను శనివారం రాజకీయ పార్టీ ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఈవిఎంల రక్షణ, భద్రతకు సంబంధించిన ఏర్పాట్ల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. గోదాం వద్ద సిబ్బంది హాజరు తీరుపై ఆరా తీశారు. ఈవిఎం గోదాం వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీస్ గార్డులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈవిఎం, వివిప్యాట్ గదుల ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఒ కె మహేశ్వర్, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి మడుపు మోహన్, బిఆర్ఎస్ పార్టీ ప్రతినిధి సత్తినేని శ్రీనివాస్, బిజెపి పార్టీ ప్రతినిధి నాంపల్లి శ్రీనివాస్, సిపిఐఎం పార్టీ ప్రతినిధి మిల్కూరి వాసుదేవ రెడ్డి, ఎంఐఎం పార్టీ ప్రతినిధి బర్కత్ ఆలీ, బిఎస్పి పార్టీ ప్రతినిధి సిరిసిల్ల రాజయ్య, ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ చూపిన మార్గాన్నే కాంగ్రెస్ ముందుకు తీసుకువెళ్తుంది



**ప్రజాపక్షం/సిద్దిపేట అర్బన్:** భారత రాజ్యాంగ శిల్పి,సమాజ సమానత్వం కోసం జీవితాంతం పోరాటం చేసిన మహానుభావుడు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆశయాలను కొనసాగించాలని సిద్దిపేట కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ పూజల హరికృష్ణ పిలుపు నిచ్చారు. శనివారం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా సిద్దిపేట అర్బన్ మండలం ఎన్సాన్‌పల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ ఆలోచనలే మన దేశానికి దిశా నిర్దేశం చేశాయని, సామాజిక న్యాయం కోసం ఆయన చూపిన మార్గాన్నే కాంగ్రెస్ పార్టీ ముందుకు తీసుకువెళ్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అర్బన్ మండల అధ్యక్షుడు కొలిమి బిక్షపతి,సీనియర్ నాయకులు బొమ్మల యాదగిరి,కలీమోద్దీన్,దాస అంజయ్య,ముద్దం లక్ష్మి ,మార్క సతీష్,రాజబహదూర్ రెడ్డి,సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు కఠిన శిక్షణ

**ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట:** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో చదివే విద్యార్థులకు కఠిన శిక్షణలు అమలు చేస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు అందోళన చెందుతున్నారు. విద్యార్థులు అలస్యంగా పాఠశాలకు వెళితే గేటు మూసి వేసి,లోనికి రాకుండా కఠినంగా వ్యవహరిస్తూ, విద్యార్థులతో గుంజీలు తీయిస్తూ, కర్రతో చేతి మట్టలపై కొట్టడం లాంటివి చేస్తూన్నారని, దీనితో తల్లిదండ్రులు తీవ్ర విమర్శలు చేస్తున్నారు. అలాగే ఓ ఉపాధ్యాయుడు అసభ్యపదజాలన్ని వాడుతూ విద్యార్థుల పట్ల అవివేకంగా ప్రవర్తించడం సరియైనది కాదని మండిపడుతున్నారు. ఇటీవలే పాఠశాలలో విద్యార్థుల ముందు ఇదే విషయంలో ఇద్దరు ఉపాధ్యాయులు గొడవ పడిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దీనిపై ఎంఈవో విచరణ చేసి సదరు ఉపాధ్యాయుడిపై తగిన చర్యలు తీసుకోవాలని, పాఠశాలకు పీఈటీని, డిప్యూటేషన్‌పై ఉన్న ఆంగ్ల ఉపాధ్యాయున్ని తిరిగి రప్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

## యువకుడి ఆత్మహత్య



**ప్రజాపక్షం/ధర్మపురి:** జగిత్యాల జిల్లా ధర్మపురి పట్టణానికి చెందిన చెరుకు రాకేష్ (32) అనే యువకుడు శనివారం సాయంత్రం ఉరివేసుకుని ఆత్మహత్య కు పాల్పడ్డాడు. బంధువుల కథనం ప్రకారం ధర్మపురి పట్టణానికి చెందిన రాకేష్ గల్ఫ్ లో ఉండి నెలరోజుల క్రితం స్వగ్రామానికి వచ్చాడు. అప్పటినుంచి తనకు సరైన ఉపాధి లేదని జీవితం పై విరక్తిగా ఉందని సన్నిహితుల వద్ద వాపోయేవాడని తెలిపారు.కాగా ధర్మపురి జాతీయ రహదారి పక్కన ట్రావెల్స్, ఆన్లైన్ సెంటర్ నడుపుకునే రాకేష్ సోదరుడు నాగరాజు దగ్గరికి శనివారం మధ్యాహ్నం వచ్చి నేను షాపులో ఉంటా ఇంటికి వెళ్ళమని అతన్ని పంపించాడు.5 గంటల ప్రాంతంలో నాగరాజు షాపుకి వచ్చి చూడగా ఉరివేసుకుని ఉండటంతో వెంటనే పోలీసులకు సమాచారం అందించాడు.మృతుడు రాకేష్‌కు భార్యా ఇద్దరు కుమారులున్నారు. ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది. ధర్మపురి ఎస్సై జి.మహేష్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.

# భారతీయ సంస్కృతి, సంప్రదాయానికి ప్రతీక యోగా

కేంద్ర మంత్రి బండి సంజయ్, రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్



**ప్రజాపక్షం/కరీంనగర్:** భారతీయ సంస్కృతి, సాంప్రదాయానికి ప్రతీక యోగా అని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. కరీంనగర్ లోని మహాశక్తి ఆలయంలో శనివారం రాష్ట్రస్థాయిలో పతకాలు సాధించి జాతీయ స్థాయికి ఎంపికైన జిల్లా యోగా క్రీడాకారులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయస్థాయిలో కూడా పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. ప్రపంచానికి భగవద్గీతను అందించిన భారతదేశం నేడు యోగాను విశ్వవ్యాప్తంగా అమలు చేయడం గొప్ప విషయమని పేర్కొన్నారు. అనంతరం రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ యోగా సాధన వల్ల సార్వత్రిక శక్తి, ఆధ్యాత్మిక జ్ఞానం కలుగుతుందని తెలిపారు. వ్యక్తి పరిపూర్ణతకు యోగా దోహదపడుతుందని, ప్రతి ఒక్కరూ యోగాలో భాగస్వాములు కావాలని కోరారు. యోగాను ముందు తరాల వారికి అందించాలనే లక్ష్యంతో క్రీడాకారుల సంక్షేమాన్ని గుర్తించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యోగాను స్పోర్ట్స్ కోటాలో చేర్చాయని తెలంగాణ యోగా అసోసియేషన్ చైర్మన్ సర్దార్ రవీందర్ సింగ్ తెలిపారు. రంగారెడ్డి జిల్లాలోని ఎస్ఎంపి అంతర్జాతీయ పాఠశాలలో ఇటీవల నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులు రాంచిలో ఈనెల 27 నుంచి 30 వరకు జరిగే జాతీయ స్థాయి యోగా పోటీల్లో పాల్గొంటారని వెల్లడించారు. కార్యక్రమంలో రాష్ట్ర విప్ ఆది శ్రీనివాస్, చొప్పదండి ఎంఎల్ఎ మేడిపల్లి సత్యం, మానకొండూర్ ఎంఎల్ఎ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, సిటీ కాంగ్రెస్ అధ్యక్షులు వి. అంజనీ కుమార్, జిల్లా యోగా అసోసియేషన్ అధ్యక్షులు నాగిరెడ్డి సిద్ధారెడ్డి, ఉపాధ్యక్షులు కన్న కృష్ణ, కార్యదర్శి గుంటి రామ కృష్ణ, కోశాధికారి పి. స్వరూప చారి, బండ రమణారెడ్డి, యోగ కోచ్ లు కిష్టయ్య, ఆనంద కిషోర్, ప్రవీణ్, వీణ తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడిగా న్యాలపట్ల రాజు



**ప్రజాపక్షం/కరీంనగర్ :** భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) కరీంనగర్ జిల్లా కార్యవర్గ సభ్యుడిగా నగరానికి చెందిన న్యాలపట్ల రాజు ఎన్నికైనట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. నగరంలోని కట్టారాంపూర్ కు చెందిన రాజు గత 30 సంవత్సరాలకు పైగా సిపిఐలో పనిచేస్తున్నారని, ప్రస్తుతం సిపిఐ నగర సహాయ కార్యదర్శిగా కొనసాగుతున్నారని పేర్కొన్నారు. పార్టీ నిర్మాణ దృష్ట్యా, జిల్లా వ్యాప్తంగా పార్టీని బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషించడం కోసం రాజును జిల్లా కార్యవర్గంలోకి తీసుకున్నామని వివరించారు. పార్టీ బలోపేతం కోసం కృషి చేయడానికి జిల్లా కార్యవర్గంలో చోటు కల్పించినందుకు జిల్లా పార్టీ నాయకత్వానికి న్యాలపట్ల రాజు కృతజ్ఞతలు తెలిపారు.

## రైస్ మిల్లులో తనిఖీ



**ప్రజాపక్షం/వేములవాడ:** వేములవాడ రూరల్ మండలం మర్రిపల్లిలోని మహాలక్ష్మీ రైస్ మిల్లులో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రాల నుంచి రైస్ మిల్లుకు వచ్చిన లారీలు, ధాన్యం నిల్వలు పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చే లారీలను ఎప్పటికప్పుడు దించుకోవాలని, ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. పరిశీలనలో రుద్రంగి తహసీల్దార్ పుష్పలత, ఎంపీడీఓ నటరాజ్, చందుర్తి ఎంపీఓ ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

## స్వేచ్ఛగా ఓటింగ్‌లో మైక్రో అబ్జర్వర్ల పాత్ర ప్రధానం

ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఓటింగ్ జరగడంలో మైక్రో అబ్జర్వర్ల పాత్ర ప్రధానమని ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ తెలిపారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో శనివారం మైక్రో అబ్జర్వర్ల శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించగా, ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్, జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు రవి కుమార్ తో కలిసి హాజరై మాట్లాడారు. మైక్రో అబ్జర్వర్లు పోలింగ్ కు ముందు, పోలింగ్ ముగిసిన తర్వాత నిశితంగా పరిశీలించి, ఎన్నికలు జరిగిన తీరును పర్యవేక్షించి, అట్టి నివేదికను ఎన్నికల సాధారణ పరిశీలకులకు సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు.మైక్రో అబ్జర్వర్లకు కేటాయించిన పోలింగ్ కేంద్రంలోని పోలింగ్ సరళినీ, ప్రతి అంశాన్ని నిశితంగా పరిశీలించాలని, వారి విధులను పటిష్టంగా నిర్వహిస్తునే పోలింగ్ టీంలతో స్నేహపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు.పోలింగ్ ప్రక్రియ సజావుగా సాగుతోందా లేదా, ఎక్కడైనా ఏమైనా సమస్యలు ఉన్నాయా, ఎన్నికల నియమావళి అమలు, తదితర విషయాలను సూక్ష్మంగా పరిశీలించాలని ఆదేశించారు. ఎవరైనా నిబంధనలను అతిక్రమిస్తే సాధారణ పరిశీలకుల దృష్టికి వెంటనే తీసుకురావాలన్నారు.ఈ సమావేశంలో డీఆర్డీఓ శేషాద్రి, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ నిఖిత, డీపీఓ షరీఫుద్దిన్, జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీ రాజం, ఎల్డీఎం మల్లికార్జున రావు, మైక్రో అబ్జర్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడం బాధాకరం

ఎంపి రఘునందన్‌రావు



**ప్రజాపక్షం/సిద్ధిపేట:** అంబేద్కర్ అందించిన రాజ్యాంగ స్ఫూర్తిని,భారత ప్రజాస్వామ్య వ్యవస్థను పరిహాసం చేసే విధంగా గ్రామపంచాయతీ ఎన్నికల్లో వేలం పాట ద్వారా ఎన్నుకోవటం బాధకరమని మెదక్ ఎంపి రఘునందన్‌రావు అన్నారు. పంచాయతీ ఎన్నికల్లో బలవంతపు ఏకగ్రీవాలతో ప్రజాస్వామాన్ని పరిహసం చేస్తున్నారని విమర్శించారు. శనివారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని విఎఆర్ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుండి ఎమ్మెల్యేలకు నిధులు ఇవ్వటం లేదని, గ్రామాల అభివృద్ధికి కేంద్రం నుండి నిధులు వస్తున్నాయన్నారు. 15వ ఫైనాన్స్ నిధులు నేరుగా గ్రామపంచాయతీ అకౌంట్‌లో జమచేస్తున్నట్లు తెలిపారు. ఓటర్లు ఆలోచించి నిధులు తెచ్చే అభివృద్ధి చేసే అభ్యర్థులను గెలిపించుకోవాలన్నారు. గ్రామాల్లో బిజెపి బలపర్చిన అభ్యర్థులను గెలిపిస్తే అయా గ్రామాలకు 25 లక్షల ఎంపి నిధులు, సిఎస్ఆర్ నిధులు కేటాయించి అభివృద్ధి చేస్తానని హామీనిచ్చారు. సిద్దిపేట జిల్లాలో ముగ్గురు బిఆర్ఎస్ ఎమ్మెల్యేలను గెలిపిస్తే ఒకరు విఐపి బ్రేక్ దర్శానాల వలే ప్రజలకు దర్శనమిస్తారన్నారు. మరోకరు రోజు పేపర్లో తన ఫోటో కనబడకపోతే బాధపడే వ్యక్తి ,మరోకరు హైదరాబాద్‌లో ఉండి తన వ్యాపారాలకే పరిమితమైనారని విమర్శించారు. కేంద్రం ఇచ్చిన నిధులతో గ్రామాల్లో అభివృద్ధి, అంగన్‌వాడీలు, ఆరోగ్యకేంద్రాలు, గ్రామపంచాయతీ భవనాలు నిర్మాణాలు అవుతున్నాయన్నారు. ప్రతి గ్రామానికి సోలార్ లైట్లు అందించనున్నట్లు తెలిపారు.

## పడితే పరలోకానికే..



**ప్రజాపక్షం/ముత్తారం :** ప్రమాదకరంగా కల్వర్టు డ్రైనేజీపై ఏర్పడిన గొయ్యి ఉండడంతో ఎవరైనా చూడకుండా రాత్రి వేళలో ఆ గుంతలో పడ్డట్టయితే గాయపడడమే కాకుండా పరలోకానికి అన్నట్టుగా ఉంది ఆ భారీ గుంతపెద్దపల్లి జిల్లాముత్తారం మండలం ఓడేడు గ్రామంలోని 5వ వార్డుకు వెళ్లే దారి ప్రమాదకరంగా మారింది. డ్రైనేజీ మీద నిర్మించిన రోడ్డు ఒకవైపు కూలి పెద్ద గొయ్యి ఏర్పడింది. దీంతో ఈ వార్డుకు వెళ్లే వాహనదారులు నానా ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఈ దారి గుండా వచ్చే కార్లు, ద్విచక్ర వాహనాలు ఈ డ్రైనేజీలో పడి వాహనాలు దెబ్బతినడంతోపాటు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరమ్మత్తులు చేపట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు.

## ఫైనాన్స్ మేనేజర్‌ను సన్మానించిన ఎఐటియుసి నాయకులు



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** సింగరేణి ఆర్జీ వన్ ఏరియా లోని ఆడిట్ డిపార్ట్మెంట్ లో డిప్యూటీ ఫైనాన్స్ మేనేజర్ గా పని చేస్తున్న పాకాల మోహన్ రావు ను జైపూర్ పవర్ ప్లాంట్ కు బదిలీ ఐన సందర్భంగా శనివారం సింగరేణి ఆర్జీ వన్ కార్యాలయం లో సింగరేణి గుర్తింపు సంఘం ఏఐటియుసి నాయకులు పూల గుచ్చం అందించి శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి ఆర్జీ వన్ బ్రాంచి కార్యదర్శి ఆరెల్లి పోషం, అర్జీ వన్ జి.ఎం.ఆఫీస్ ఏఐటియుసి డిపార్ట్మెంట్ కార్యదర్శి ఇజ్జగిరి రాజు తో పాటు సిబ్బంది బి.పద్మ, జి. సుజిత్ కుమార్, వినోద్ కుమార్ పాల్గొనడం జరిగింది.

## విద్యార్థులకు ఉద్యోగ నియామక పత్రాలు అందజేత



**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** సమికృత జిల్లా కలెక్టర్ నందు శుక్రవారం పెద్దపెల్లి టాస్క్ రీజనల్ సెంటర్ ఆధ్వర్యంలో నిన్న నిర్వహించిన మెగా జాబ్ మేళా కార్యక్రమంలో గాయత్రి డిగ్రీ మరియు పీజీ కళాశాల నుండి ఐదుగురు విద్యార్థినులు డి.స్రవంతి, సానియా తరణం, కే.శశాంక, కే. మానస వీరికి టాటా ఎలక్ట్రానిక్స్ లోను మరియు నాజరిన్ సుల్తానా ఆప్టికల్ హెల్త్ సొల్యూషన్స్ మరియు టాటా ఎలక్ట్రానిక్స్ కంపెనీలో ఉద్యోగాలు సాధించారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష కు విద్యార్థులు కృతజ్ఞతలు చెప్పారు. ఉద్యోగ నియమక పత్రాలను అందుకున్న విద్యార్థినులను గాయత్రి విద్యాసంస్థల అధినేత అల్లెంకి శ్రీనివాస్ ప్రిన్సిపల్ జే .రవీందర్ మరియు ఉపాధ్యాయ బృందం అభినందించారు.

## 14న ఆల్ఫోర్స్ మ్యాథ్స్ ఒలింపియాడ్

ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి నరేందర్ రెడ్డి



**ప్రజాపక్షం/కరీంనగర్:** శ్రీనివాస రామానుజన్ స్ఫూర్తితో ఈనెల 14న అల్ఫోర్స్ మ్యాథ్ ఒలింపియాడ్ (అమాట్ 2025) నిర్వహిస్తున్నట్లు అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి తెలిపారు. స్థానిక వావిలాలపల్లిలోని కేంద్ర కార్యాలయంలో శనివారం అమాట్2025 వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామానుజన్ జయంతిని పురస్కరించుకుని 3 నుంచి 10వ తరగతి చదివే సిబిఎస్ఇ, స్టేట్, ఐసిఎస్ఇ విద్యార్థులకు ఈ పరీక్ష నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. 14న ఉదయం 10 నుంచి 11 గంటల వరకు పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. 100 మార్కులకు నిర్వహించే ఈ పరీక్షలో ప్రతి సరైన జవాబుకు 4 మార్కులు, తప్పు జవాబుకు మైనస్ 1 మార్కు ఉంటుందని వివరించారు. ప్రతి తరగతిలో మొదటి 20 స్థానాల్లో నిలిచిన వారికి ప్రశంసా పత్రాలు, బహుమతులు అందజేస్తామన్నారు. మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు వరుసగా రూ. 5000, 3000, 2000 నగదు బహుమతులతో పాటు జ్ఞాపికలు అందిస్తామని తెలిపారు. విజేతలకు ఈనెల 22న రామానుజన్ జయంతి వేడుకల్లో బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఈనెల 12లోగా పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 92469 34441, 92469 34456, 93982 30614 నంబర్లలో సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల సిబ్బంది, గణిత శాస్త్ర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఈశ్వరాచారి కుటుంబానికి రూ. కోటి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** బీసీ రిజర్వేషన్ల కోసం హైదరాబాద్‌లో ఆత్మాహుతి చేసుకున్న ఈశ్వరాచారి కుటుంబానికి ప్రభుత్వం రూ. 1కోటి ఎక్స్ గ్రేషియా చెల్లించాలని బీసీ జేఏసీ పెద్దపల్లి జిల్లా చైర్‌పర్సన్ దాసరి ఉషా డిమాండ్ చేశారు. శనివారం పెద్దపల్లి జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్ కోయ శ్రీహర్షను కలిసి బీసీల పట్ల జరుగుతున్న సామాజిక దాడులను వెంటనే నిలిపివేయాలని కోరుతూ వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ఇటీవల నల్గొండ జిల్లా కేంద్రంలో జనరల్ స్థానంలో పోటీకి నామినేషన్ వేసిన బీసీ అభ్యర్థి భర్త పట్ల జరిగిన అనాగరిక సంఘటన సభ్య సమాజానికి సిగ్గుచేటు అన్నారు. అంతే కాకుండా బీసీ రిజర్వేషన్లను కోరుతూ ఈశ్వరాచారి ఆత్మబలిదానం తీవ్రంగా కలచి వేసిందన్నారు. ఇది ముమ్మాటికి ఆత్మహత్య కాదు.. ప్రభుత్వం చేసిన హత్యేనని ఆమె ఆరోపించారు. ప్రభుత్వం ఈ ఘటనకు బాధ్యత వహిస్తూ ఈశ్వరాచారి కుటుంబానికి కోటి రూపాయల ఎక్స్ గ్రేషియాతో పాటుగా వారి కుటుంబ సభ్యుల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలన్నారు. వారి పిల్లలకు పీజీ వరకూ ప్రభుత్వ ఖర్చులతో విద్యాభ్యాసం చేయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీసీ రిజర్వేషన్ల పేరిట కల్లబొల్లి కబుర్లు చెబుతూ కాలం వెళ్లదీస్తున్నారని మండిపడ్డారు. ఇందుకు గాను బీసీ బిడ్డలు ఇంటికొకరు ఉద్యమ బాట పట్టాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ జేఏసీ వైస్ చైర్మన్ కొండి సతీష్, జిల్లా కన్వీనర్లు సలేంద్ర కొమురయ్య, సిరవేని స్వప్న, శ్రీనివాస్, రవి, విశ్వకర్మ జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



## హోంగార్డ్‌ల పనితీరు ప్రశంసనీయం

ఎస్పి మహేష్ బి.గితే




**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** హోంగార్డుల పనితీరు ప్రశంసనీయమని, విధి నిర్వహణలో హోంగార్డుల త్యాగాలు మరువలేనివని జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలోని పరేడ్ మైదానంలో శనివారం 63వ హోంగార్డు రైసింగ్ డే వేడుకల సందర్భంగా హోంగార్డ్ సిబ్బంది పరేడ్ నిర్వహించారు. ఈపరేడ్ కి జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ముఖ్య అతిథిగా హాజరై గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ హోంగార్డులు పోలీస్ శాఖలో అంతర్గత భాగమని, పోలీసులతో పాటే నిరంతరం తమ సేవలను అందిస్తున్నారని,ప్రతి పోలీస్ స్టేషన్లో పోలీసు సిబ్బందితో పాటు విధులు నిర్వహిస్తున్నారని, క్లిష్ట పరిస్థితులలో కూడా వివిధ బందోబస్తు విధుల్లో చాలా సమర్థవంతంగా విధులు నిర్వహిస్తున్నార న్నారు.హోమ్ గార్డ్స్ అధికారులు,సిబ్బంది ఎవరికైన సమస్యలు ఉంటే నేరుగా తనని సంప్రదించవచ్చని,రాష్ట్ర పోలీస్ శాఖ సిబ్బంది కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు.విధి నిర్వహణ సమయంలో అప్రమత్తంగా ఉండాలని,హోమ్ గార్డ్ సిబ్బంది ప్రతి డ్యూటీని బాధ్యతగా నిర్వహించే వారి క్రమశిక్షణ, సేవాస్ఫూర్తి పోలీస్ శాఖకు గర్వకారణం అన్నారు. విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన హోంగార్డులకు ప్రశంస పత్రాలు, మెమోంటోస్ అందజేశారు. ఈకార్యక్రమంలో అదనపు ఎస్పీ చంద్రయ్య, డిఎస్పీ నాగేంద్రచారి, సి.ఐ లు కృష్ణ, మొగిలి, నాగేశ్వరరావు, రవి, ఆర్.ఐ లు మధుకర్, యాదగిరి, రమేష్, ఎస్.ఐ లు సిబ్బంది పాల్గొన్నారు.

# రీల్



## 'ఇట్స్ ఓకే గురు' ప్రీరిలీజ్ వేడుక

సాయి చరణ్, ఉష్రశీ హీరో హీరోయిన్స్‌గా నటిస్తున్న చిత్రం 'ఇట్స్ ఓకే గురు'. మణికంఠ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని క్రాంతి ప్రసాద్ నిర్మిస్తున్నారు. ఈ సినిమా డిసెంబర్ 12 రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ ప్రీరిలీజ్ ఈవెంట్ హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించారు.డైరెక్టర్ మెహర్ రమేష్ మాట్లాడుతూ.. నేను ఇట్లు శ్రావణి సుబ్రహ్మణ్యం సినిమాకి పూరి జగన్నాథ్ దగ్గర అసిస్టెంట్‌గా పని చేశాను. బడ్జెట్‌తో సంబంధం లేకుండా సబ్జెక్ట్ నచ్చి చేసిన సినిమా అది. ఆ సినిమా తర్వాత రవితేజ, పూరి జగన్నాథ్ మళ్లీ వెనక్కి తిరిగి చూసుకోలేదు. ఈ సినిమా చూస్తుంటే నాకు మంచి సబ్జెక్ట్ ఉన్నట్టు అనిపిస్తుంది. డైరెక్టర్ మణికంఠ, చిన్న సినిమాల్లో చాలా అద్భుతంగా ఆడుతున్నాయి. ఈ సినిమా కూడా చాలా పెద్ద విజయం సాధించాలని కోరుకుంటున్నాను. ఇందులో ఒక సాంగ్ నాకు చాలా నచ్చింది. మణికంఠ తీసిన కొత్తపెళ్లికూతురు షార్ట్ ఫిలిం నాకు చాలా ఇష్టం. ఈ సినిమాని కూడా చాలా కష్టపడి మంచి సబ్జెక్ట్ రాసుకొని తీశాడు. మేము కలిసి త్వరలోనే ఒక వెబ్ సిరీస్ కూడా చేయాలని ఉంది. ఈ సినిమా హీరో చరణ్‌లో చాలా మంచి ఈజ్ ఉంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో మ్యూజిక్ డైరెక్టర్ మోహిత్, డైరెక్టర్ మణికంఠ, ప్రొడ్యూసర్ క్రాంతి ప్రసాద్, హీరో సాయి చరణ్, హీరోయిన్ ఉష్రశీ, ఈస్ట్ వెస్ట్ సీఈవో రాజీవ్ తదితరులు పాల్గొన్నారు.



## ఈ సంక్రాంతికి నారి నారి నడుమ మురారి

శర్వా హీరోగా నటిస్తున్న ఫీల్‌గుడ్ ఫ్యామిలీ ఎంటర్టైనర్ 'నారి నారి నడుమ మురారి'. సామజవరగమనతో బ్లాక్‌బస్టర్ డెబ్యు చేసిన రామ్ అబ్బరాజు దర్శకత్వం వహిస్తున్నారు. ఎకె.ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్‌పై రామ బ్రహ్మం సుంకర నిర్మించిన ఈ చిత్రంలో సంయుక్త, సాక్షి వైద్య కథానాయికలుగా నటించారు. ఇప్పటివరకు విడుదలైన ప్రతి ప్రమోషనల్ మెటీరియల్ ప్రేక్షకులలో బజ్ క్రియేట్ చేసింది. 'నారి నారి నడుమ మురారి' 2026లో ప్రపంచ వ్యాప్తంగా సంక్రాంతికి థియేటర్లలోకి రానుంది. ఇది తెలుగు సినిమా రిలీజెస్‌కి బిగ్గెస్ట్ సీజన్. ఈ సినిమా పూర్తి ఫ్యామిలీ ఎంటర్టైన్మెంట్ కావడంతో సంక్రాంతి విడుదలకు ప్లాన్ చేస్తున్నారు.

## 'పోలీస్ కంప్లెయింట్' షూటింగ్ పూర్తి



గ్లామర్ పాత్రలతో హీరోయిన్‌గా కెరీర్ స్టార్ట్ చేసిన వరలక్ష్మి శరత్ కుమార్.. లేడీ విలన్ పాత్రలకు కేరాఫ్ అడ్రస్‌గానూ పేరు తెచ్చుకుంది. వరలక్ష్మి శరత్ కుమార్ నవీన్ చంద్ర ప్రధాన పాత్రల్లో దర్శకుడు సంజీవ్ మేగోటి రూపొందిస్తున్న 'పోలీస్ కంప్లెయింట్' మూవీ షూటింగ్ పూర్తిచేసుకుంది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటోంది. ఈ సినిమాలో వరలక్ష్మి పవర్ఫుల్ పాత్రలో కనిపించనుంది, తొలిసారి పూర్తిగా వినోదాత్మకమైన రోల్‌లో నటించడం ప్రత్యేక ఆకర్షణ అని, సూపర్ స్టార్ కృష్ణపై చిత్రీకరించిన ప్రత్యేక గీతం సినిమాకే హైలైట్‌గా నిలుస్తుందని నిర్మాతలు తెలిపారు. ఎంఎస్‌కె ప్రమిద శ్రీ ఫిలిమ్స్ బ్యానర్‌పై రూపొందుతున్న ఈ చిత్రాన్ని బాల కృష్ణ మహరాణా నిర్మిస్తుండగా, అఘోర (తెలుగుతమిళం), ఆస్త్ర, పౌరుషం, రాఘవ రెడ్డి, ఆదిపర్వం వంటి విభిన్న చిత్రాలను రూపొందించిన దర్శకుడు సంజీవ్ మేగోటి దర్శకత్వం వహిస్తున్నారు.

## 28న 'అమరకావ్యం' విడుదల




ధనుష్, కృతి సనన్ హీరో హీరోయిన్సుగా ఆనంద్ ఎల్.రాయ్ దర్శకత్వంలో భూషణ్ కుమార్ నిర్మించిన చిత్రం 'తేరే ఇష్క్ మై'. ఈ సినిమాను అమరకావ్యం పేరుతో తెలుగులో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ సినిమాకు సంబంధించిన ట్రైలర్ థియేటర్లలో ప్రదర్శించబడుతోంది. హీరో హీరోయిన్ మధ్య ప్రేమ, కొన్ని పరిస్థితుల్లో హీరో ప్రేమను కోల్పోవటం, ఆ బాధ నుంచి బయటకు రావటం వంటి ఫీలింగ్స్‌ను ట్రైలర్‌లో చాలా చక్కగా చూపించారు. కథలోని డెప్త్, ప్రేమలోని తెలియని బాధలను కూడా ప్రేక్షకులు మెచ్చే రీతిలో తెరకెక్కించారు. కథను సినిమాగా తెరకెక్కించటంలో తన ప్రత్యేకతను చాటే దర్శకుడు ఆనంద్ ఎల్.రాయ్ శైలి ఇందులో స్పష్టంగా తెలుస్తోంది. సినిమాలోని ఎమోషనల్ డెప్త్ తన రైటింగ్ స్టైల్‌లో ఆయన ఆవిష్కరించారు. గుల్షన్ కుమార్, టి సిరీస్, కలర్ ఎల్లో సమర్పణలో రూపొందిన తేరే ఇష్క్ మై సినిమాను ఆనంద్ ఎల్.రాయ్, హిమాన్షు శర్మ, భూషణ్ కుమార్, కృష్ణ కుమార్ నిర్మించారు. హిమాన్షు శర్మ, నీరజ్ యాదవ్ సినిమా రైటర్స్, ఆస్కార్ విన్నర్ ఏ.ఆర్.రెహ్మాన్ సంగీతం సమకూర్చగా ఇర్షద్ కమిల్ సాహిత్యాన్ని అందించారు. నవంబర్ 28 నుంచి ఈ సినిమా హిందీ, తమిళ, తెలుగు భాషల్లో ప్రపంచ విడుదల కానుంది.

## స్పెషల్ సాంగ్‌లో..



విజనరీ సుబాస్కరన్ నేతృత్వంలోని లైకా ప్రొడక్షన్స్ బ్యానర్‌పై సన్ సంజయ్ దర్శకత్వంలో యాక్షన్ అడ్వెంచర్ సినిమాగా నిర్మిస్తున్నారు చిత్రం సిగ్మా. ఇందులో సందీప్ కిషన్ హీరోగా నటిస్తున్నారు. షూటింగ్ ముగింపు దశకు చేరుకుంది. ఫరియా అబ్దుల్లా, రాజు సుందరం, అన్బు థాసన్, యోగ్ జాపీ, సంపత్ రాజ్, కిరణ్ కొండా, మగలక్ష్మి సుదర్శనన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రంలో హీరోయిన్ కేథరీన్ థ్రెసా, సందీప్ కిషన్‌తో కలిసి ఓ స్పెషల్ డ్యాన్స్ చేయనుంది. ఎస్.థమన్ పవర్‌ఫుల్ ట్రాక్‌ను కంపోజ్ చేశారు. ఇది సినిమాకి ఒక హైలైట్‌గా ఉంటుందని నిర్మాతలు భావిస్తున్నారు. దీనికోసం భారీ సెట్ వేసి ఈ పాటలో సందీప్ కిషన్, కేథరీన్ థ్రెసాపై చిత్రీకరిస్తున్నారు. సిగ్మాలో సందీప్ కిషన్ను ఇంతకు ముందు ఎప్పుడూ చూడని యాక్షన్ పెర్సోనాలో కనిపించనున్నారు ఇటీవల విడుదలైన ఫస్ట్‌లుక్ పోస్టర్‌కు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. తనదైన దారిలో నడిచే 'సిగ్మా' అనే మావెరిక్ హీరో చుట్టూ కథ తిరుగుతుంది. అతని పట్టుదల, సహనం, ఎవరూ ఊహించని పద్ధతుల్లో ఎదగడం థ్రిల్‌ను ఇస్తుంది. యంగ్ డైనమిక్ దర్శకుడు జేసన్ సంజయ్ సెన్సిబిలిటీలతో రూపొందుతున్న ఈ చిత్రం ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందించబోతోంది. ఈ చిత్రానికి సినిమాటోగ్రాఫర్ కృష్ణన్ వసంత్, ఎడిటర్ ప్రవీణ్ కె.ఎల్, ఆర్ట్ డైరెక్టర్ బెంజమిన్ ఎం. తమిళం, తెలుగులో ఏకకాలంలో చిత్రీకరించబడిన ఈ మల్టీ లింగ్వెల్ ప్రాజెక్ట్, చెన్నై, తలకోన అడవులు, థాయిలాండ్‌లోని అద్భుతమైన ప్రదేశాలలో షూటింగ్ జరుపుకుంది. పోస్ట్‌ప్రొడక్షన్ పనులు కూడా ఒకేసారి జరుగుతున్నాయి. ఈ చిత్రం 2026 వేసవిలో విడుదల కానుంది.

## ప్యాషన్ ఉన్న దర్శకులంతా ఫేమ్ కాలేరు

### నిర్మాత కెఎల్ దామోదర ప్రసాద్



ప్రముఖ కథానాయిక జెనీలియా ప్రధాన పాత్రలో రూపొందిన 'కథ' చిత్రంతో విమర్శకుల ప్రశంసలు అందుకున్న దర్శకుడు శ్రీనివాస్ మన్నె, కొంత విరామం తరువాత ఆయన దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ఈషా'. ఇటీవల రాజు వెడ్స్ రాంబాయి చిత్రంతో సూపర్హిట్ కొట్టిన అఖిల్రాజ్తో పాటు త్రిగుణ్ హీరోలుగా నటిస్తున్న ఈ చిత్రంలో హెబ్బాపటేల్ కథానాయిక. 12న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా 'ఈషా' చిత్ర నిర్మాత కేఎల్ దామోదర ప్రసాద్ మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు. ప్రొడ్యూసర్‌గా నాకు కొంత గ్యాప్ వచ్చింది. నా గత సినిమా ఫాదర్ చిట్టి ఉమా కార్తీక్ ఆశించినంతగా ఆదరణ పొందలేదు. ఆ సినిమా మంచి కంటెంట్ తో చేసినా ప్రేక్షకులకు రీచ్ కాలేదు. కొందరు టైటిల్ బ్యాడ్ అని చెప్పారు. అయితే మంచి కథల కోసం ప్రయత్నిస్తూనే ఉన్నాం. ఆ టైమ్ లో డైరెక్టర్ శ్రీనివాస్ మన్నె నేను ఒక సబ్జెక్ట్ ఫైనలైజ్ చేసుకుని దాని మీద వర్కవుట్ చేశాం. ఒక మిడిల్ రేంజ్ హీరో కోసం ప్రయత్నించాం. ఆ ప్రాజెక్ట్ ముందుకు వెళ్లలేదు. అదే టైమ్ లో శ్రీనివాస్ మన్నె 'ఈషా' కథ గురించి చెప్పారు. ఈ కథ ఇంట్రెస్టింగ్‌గా అనిపించి ఈ ప్రాజెక్ట్ చేశాను. 'ఈషా' సినిమాకు ప్రతీది తనే దగ్గరుండి శ్రీనివాస్ మన్నె చూసుకున్నారు. ఆయన ప్రతిభపై నాకు నమ్మకం ఉంది. పైగా సినిమా అంటే ప్యాషన్ ఉన్న డైరెక్టర్. చాలా కష్టపడతాడు. ఆయనకు తగినంత పేరు రాలేదని నా నమ్మకం. ఇండస్ట్రీలో కష్టపడి, ప్యాషన్ ఉన్న దర్శకులంతా ఫేమ్ కాలేరు. 'ఈషా' సినిమాను శ్రీనివాస్ బాగా తెరకెక్కించాడు. నేను ఈ మూవీ పోస్ట్ ప్రొడక్షన్ టైమ్ లో రెండు మూడు సార్లు చూశాను. చాలా బాగుంది. ప్రేక్షకులకు తప్పకుండా కనెక్ట్ అవుతుందనే నమ్మకం కలిగింది అన్నారు.

## ఆహా ఒటిటిలో 'ధూల్ పేట్ పోలీస్ స్టేషన్'



సరికొత్త కంటెంట్‌తో ఆడియెన్స్ థ్రిల్ చేస్తున్న ఆహా ఒటిటిలో మరో ఎగ్జైటింగ్ క్రైమ్ థ్రిల్లర్ వెబ్ సిరీస్ 'ధూల్ పేట్ పోలీస్ స్టేషన్'ను స్ట్రీమింగ్‌కు తీసుకొచ్చింది. ఈ సిరీస్‌లో మొత్తం 50 ఎపిసోడ్స్ ఉన్నాయి. ప్రతి శుక్రవారం రాత్రి 7 గంటలకు కొత్త ఎపిసోడ్ స్ట్రీమింగ్ కానుంది. తెలుగుతో పాటు తమిళ భాషల్లో 'ధూల్ పేట్ పోలీస్ స్టేషన్' సిరీస్ అందుబాటులో ఉంది. ఈ వెబ్ సిరీస్‌కు జెస్విని దర్శకత్వం వహించారు. అశ్విన్, శ్రీతు, పదిని కుమార్, గురు, ప్రీతి శర్మ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ సిరీస్ కు అశ్వతన్ మ్యూజిక్ అందించారు. ధూల్ పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒకే రాత్రి మూడు హత్యలు జరిగితే ఆ కేసును ఇద్దరు పవర్ ఫుల్ పోలీస్ ఆఫీసర్స్ ఎలా సాల్వ్ చేశారనేది ఈ సిరీస్‌లో ఆసక్తికరంగా తెరకెక్కించారు. నగరంలో ఒకే రాత్రి జరిగిన 3 హత్యల కేస్ సాల్వ్ చేసేందుకు రంగంలోకి దిగిన ఎసిపి అశ్విన్ నేరస్తులను పట్టుకున్నాడా లేదా? ఈ కేసుల విచారణ ఎలాంటి మలుపులు తిరిగింది అనేది 'ధూల్ పేట్ పోలీస్ స్టేషన్' సిరీస్‌లో చూడాలి.

## 'రిసోనెన్స్' విద్యాసంస్థపై చర్యలు తీసుకోవాలి

### అనధికార పరీక్షను నిర్వహిస్తే అడ్డుకుంటాం

ప్రజాపక్షం/హైదరాబాద్: విద్యాశాఖ నిబంధనలకు విరుద్ధంగా డిసెంబర్ 14న జరగనున్న మెగా రిసో ఫాస్ట్ (టాలెంట్ టెస్ట్)ను రద్దు చేయాలని, 'రిసోనెన్స్' విద్యాసంస్థపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) హైదరాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో హైదరాబాద్ జిల్లా విద్యాశాఖాధికారి (డిఇఒ) రోహిణికు ఎఐవైఎఫ్ బృందం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి నెర్లకంటి శ్రీకాంత్ మాట్లాడుతూ.. విద్యాహక్కు చట్టం ప్రకారం విద్యార్థులకు ఎటువంటి టాలెంట్, మెరిట్, స్కాలర్ షిప్ టెస్టులను విద్యా వ్యాపారంగా నిర్వహించొద్దని ఆదేశాలు ఉన్నా, కేవలం వ్యాపారమే ధ్యేయంగా కార్పొరేట్ విద్యాసంస్థలు వ్యవహరిస్తున్నాయని ధ్వజమెత్తారు. 5, 10వ తరగతి విద్యార్థులకు ఈ పరీక్షను నిర్వహిస్తున్నారని, అయితే ఈ పరీక్ష రాయడానికి 300 రూపాయలను ఎంట్రన్స్ ఫీజు రూపంలో వసూళ్లు చేయడాన్ని వారు వ్యతిరేకించారు. డిసెంబర్ 14వ తేదీన ఈ పరీక్షను రిసోనెన్స్ జూనియర్ కళాశాలల్లో, గుర్తింపు లేని 'రిసోనెన్స్' పాఠశాలల్లో నిర్వహించనున్నారని, ఈ పరీక్షను ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో అడ్డుకుంటామని వారు హెచ్చరించారు. అదేవిధంగా 'రిసోనెన్స్' విద్యాసంస్థకు నిజంగా విద్యార్థులు వారి తల్లిదండ్రుల పట్ల చిత్తశుద్ధి ఉంటే ఉచితంగా నిర్వహించొచ్చుకదా అని ప్రశ్నించారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఆలోచించాలని రిసోనెన్స్ లాంటి మోసపూరిత విద్యాసంస్థల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రిసోనెన్స్ టాలెంట్ టెస్ట్‌కు



సిబిఐ మాజీ జాయింట్ డైరెక్టర్ జేడీ. లక్ష్మీ నారాయణ ప్రమోట్ చేయడం సిగ్గుచేటని, మరి ఈ విద్యాసంస్థల్లో పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులు ఉచితంగా అభ్యసించడానికి లక్ష్మీ నారాయణ హామీ ఇవ్వగలడా అని వారు డిమాండ్ చేశారు.
ఈ వినతి కార్యక్రమంలో ఎఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు టి.సత్య ప్రసాద్, నేతలు అనీల్ కుమార్, అరుణ్ పాల్గొన్నారు.

### డిఇఒ వివరణ..

రీసోనెన్స్ విద్యాసంస్థ నిర్వహిస్తున్న టాలెంట్ టెస్‌కు ఎలాంటి అనుమతులు లేవని, తల్లిదండ్రులు మోసపోవద్దని వారు అన్నారు. విద్యాహక్కు చట్టం ప్రకారం ఎటువంటి టాలెంట్, మెరిట్, స్కాలర్ షిప్ టెస్టులు నిర్వహించొద్దని ఆదేశాలు ఉన్నాయని, వాటిని భేఖాతారు చేస్తే ఎటువంటి విద్యాసంస్థకైనా కఠిన చర్యలు ఉంటాయని అన్నారు. ఈ అనధికార పరీక్ష నిర్వహిస్తున్న రిసోనెన్స్ విద్యాసంస్థకు నోటీసులు జారీ చేస్తామని అన్నారు.

## ఒడిశా సిఎంతో మంత్రి వాకిటి భేటీ



ప్రజాపక్షం/హైదరాబాద్: హైదరాబాద్ భారత్ ఫ్యూచర్ సిటీలో ఈనెల 8,9 తేదీల్లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న తెలంగాణ రైజింగ్ 2047 గ్లోబల్ సమ్మిట్‌కు హాజరవ్వాలని.. ఒడిశా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ ని క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ప్రత్యేకంగా ఆహ్వానించారు. భువనేశ్వర్ లో ఈ రోజు సచివాలయం లో సిఎం మోహన్ చరణ్ మాఝీ ని మంత్రి శ్రీహరి కలిశారు. ఈ భేటీలో రాష్ట్ర ప్రభుత్వం.. ప్రత్యేకంగా ముద్రించిన గ్లోబల్ సమ్మిట్ ఆహ్వాన పత్రికను ఒడిశా ముఖ్యమంత్రికి అందజేశారు. 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వృద్ధే లక్ష్యంగా తెలంగాణ భవిష్యత్తు సంకల్పంతో ముందుకు సాగుతుందని మంత్రి వాకిటి శ్రీహరి వివరించారు. దీనికి అనుగుణంగా అన్ని రంగాల వృద్ధి లక్ష్యాలు, భవిష్యత్తులో అనుసరించే ప్రణాళికలను విశ్లేషించేలా తెలంగాణ రైజింగ్2047 విజన్ డాక్యుమెంట్‌ను రూపొందించినట్లు మంత్రి వివరించారు. నీతి అయోగ్ సలహాలు సూచనలతో పాటు.. వివిధ రంగాల నిపుణుల ఆలోచనల మేరకు తయారు చేసిన ఈ విజన్ డాక్యుమెంట్‌ను గ్లోబల్ సమ్మిట్‌లో ఆవిష్కరించనున్నట్లు మంత్రి వాకిటి శ్రీహరి ఒడిశా సీఎం మోహన్ చరణ్ మాఝీ కి వివరించారు.
ఈ సందర్భంగా ఒడిశా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ మాట్లాడుతూ .. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కి ఆహ్వానించినందుకు తెలంగాణ ముఖ్యమంత్రికి, స్వయంగా ఒడిశాకి వచ్చి తనకు ఆహ్వానపత్రాన్ని అందచేసిన మంత్రి శ్రీహరికి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఒడిశా ముఖ్యమంత్రికి జ్ఞాపికను అందజేశారు మంత్రి వాకిటి శ్రీహరి.

## 5 నుంచి 14 వరకు యూరోపియన్ ఫిల్మ్ ఫెస్టివల్




హైదరాబాద్: ప్రపంచ ప్రఖ్యాత యూరోపియన్ యూనియన్ ఫిల్మ్ ఫెస్టివల్ (EUFF) 2025 హైదరాబాద్లో ప్రారంభమైంది. ప్రసాద్ ల్యాబ్స్ ప్రివ్యూ థియేటర్‌లో జరిగిన ఈ ప్రారంభోత్సవానికి సినీ ప్రముఖులు, సాంస్కృతికవేత్తలు, యూరోపియన్ యూనియన్ ప్రతినిధులు హాజరైయ్యారు యూరోపియన్ సినిమాను భారత ప్రేక్షకులకు పరిచయం చేస్తూ ఈ ఫెస్టివల్ 50 ఏళ్ల ప్రయాణం పూర్తి చేసుకుంది. హైదరాబాద్‌లో ఈ స్థాయి ఫెస్టివల్ను నిరంతరం నిర్వహించడంలో సారథి స్టూడియోస్ మద్దతు ఎంతో కీలకం అని నిర్వాహకులు వెల్లడించారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి సారథి స్టూడియోస్ ప్రైవేట్ లిమిటెడ్ చైర్మన్ ఎంఎస్ఆర్వి ప్రసాద్, ఈయు ప్రతినిధి బృందం, హైదరాబాద్ ఫిల్మ్ క్లబ్ అధ్యక్షుడు కేవీ రావు, ప్రముఖ దర్శకుడు ఇంద్రగంటి మోహనకృష్ణ, డైరెక్టర్ మౌద్ మీక్వావు, ఇండియన్ బ్యాంక్ జోనల్ మేనేజర్ కె.శ్రీనివాస్ తదితరులు హాజరయ్యారు. ఈ యు డెలిగేషన్ సెకండ్ సెక్రటరీలో రెంజో పర్రుల్లి మాట్లాడుతూ.. గత ఏడాది హైదరాబాద్లో ఫెస్టివల్కు వచ్చిన సానుకూల స్పందన మమ్మల్ని మరోసారి ఇక్కడికి వచ్చేలా చేసింది. ఈసారి 23 యూరోపియన్ సినిమాలను ప్రదర్శిస్తున్నాం. కథల పట్ల, చిత్రసృష్టి పట్ల హైదరాబాద్ నగరానికి ఉన్న ప్రేమ ప్రత్యేకం. ఇండో యూరోపియన్ సాంస్కృతిక సంభాషణను మరింతగా బలోపేతం చేయడం మా ముఖ్య లక్ష్యం, అని తెలిపారు. డిసెంబర్ 5 నుంచి 14 వరకు హైదరాబాద్‌లోని మూడు వేదికల్లో ప్రదర్శనలు జరుగనున్నాయి. ప్రసాద్ ల్యాబ్స్ ప్రివ్యూ థియేటర్, శ్రీ సారథి స్టూడియోస్, అలియెన్స్ ఫ్రాన్‌సైజ్‌లో ఈ యూరోపియన్ సినిమాలు ప్రదర్శిస్తున్నారు.

## ధరలపై పరిమితి

(మొదటి పేజీ తరువాయి)

సమీక్ష జరిపిన అనంతరం ఈ ప్రకటన వెలువడింది. ఎయిర్‌లైన్స్, ట్రావెల్ ప్లాట్ ఫామ్స్‌పై ప్రభుత్వం పూర్తి స్థాయిలో దృష్టిపెట్టడంతో ఎప్పటికప్పుడు ధరలపై పర్యవేక్షణ ఉంటుందని అధికారులు వెల్లడించారు. కరోనా సమయంలోనూ కేంద్రం ఇలా ధరల పరిమితిని విధించింది. మరోవైపు ఎలాంటి జాప్యం లేకుండా పెండింగ్‌లో ఉన్న రీఫండ్‌లను వెంటనే చెల్లించాలని మంత్రిత్వ శాఖ ఆదేశించింది. రద్దయిన, ఆలస్యమవుతోన్న విమాన సర్వీసులకు సంబంధించి రీఫండ ప్రక్రియను ఆదివారం రాత్రి 8 గంటల కల్లా పూర్తి చేయాలని స్పష్టం చేసింది. రద్దు కారణంగా ఇప్పటికే ప్రభావితమైన ప్రయాణికులపై రీ షెడ్యూలింగ్ ఛార్జీలు విధించకూడదని తన ఆదేశాల్లో పేర్కొంది. ప్రయాణికుల లగేజీలను 48 గంటల్లో ఎవరివి వారికి అప్పగించాలని వెల్లడించింది. ఈ రీఫండ ప్రక్రియలో జాప్యం చేసినా లేక ఆదేశాలను బేఖాతరు చేసినా చర్యలు తప్పవని హెచ్చరించింది.

## సామాన్యుల కోసమే

(మొదటి పేజీ తరువాయి)

అడగగా సూర్యకాంత్ మాట్లాడుతూ రాజ్యాంగబద్ధమైన అధికారాల విభజన తత్వాన్ని ప్రస్తావించారు. రాజ్యాంగం న్యాయవ్యవస్థ, శాసనసభ, కార్యనిర్వాహక వ్యవస్థ యొక్క సంబంధిత పాత్రలను అందంగా నిర్వచించిందని, అతి వ్యాప్తి లేదని నిర్ధారించుకుంటున్నదని చెప్పారు. 'నా మొదటి ప్రాధాన్యత అంచనా వేయదగిన కాలక్రమం, పెండింగ్‌లో ఉన్న కేసులన్నింటిపై జాతీయ న్యాయవిధానం ఆధారిత ముందస్తు నిర్ణయం. అది ఎప్పటికీ జరుగదు. వ్యాజ్యం నిరంతర ప్రక్రియ కాబట్టి అది జరుగదు. న్యాయవ్యవస్థపై ప్రజలు నమ్మకం, విశ్వాసాన్ని ఉండాలి' అని సిజెఐ పేర్కొన్నారు. కేసులు నమోదు చేయబడతాయని, మన పాత కేసులను పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. దానికోసం శక్తివంతమైన గేమ్‌ఛేంజర్లలో ఒకటిగా మధ్యవర్తిత్వాన్ని అన్వేషించాల్సిన అవసరం ఉందని సూర్యకాంత్ చెప్పారు. కొన్ని వ్యాజ్యాల ప్రాధాన్యత సహా సుప్రీం కోర్టులో కొన్ని సంస్కరణలు రానున్నాయని సిజెఐ తెలిపారు. సుప్రీంకోర్టు సామాన్యుల కోసం ఉద్దేశించబడినదని నేను బలమైన సందేశాన్ని పంపించాలని అనుకుంటున్నానని సూర్యకాంత్ స్పష్టం చేశారు. సాధారణ లిటిగెంట్లు ఎవరైనప్పటికీ సుప్రీం కోర్టులో తగినంత ప్రాధాన్యత, సమయం కూడా ఉంటుందన్నారు. జాబితా చేయాల్సిన విషయాలకు తాను కొంత ప్రాధాన్యత ఇస్తున్నానని, అయితే తాను ఒక్కడినే దీన్ని అంతా చేయలేనని, సుప్రీంకోర్టుల జడ్జిలందరూ దీనికి సంబంధించి పూర్తి సహకారం అందించినప్పుడే ఇది సాధ్యమవుతుందని సూర్యకాంత్ స్పష్టం చేశారు. డిజిటల్ అరెస్ట్, సైబర్ నేరాలకు సంబంధించి న్యాయవ్యవస్థ సరికొత్త సవాళ్లను ఎదుర్కొంటోందని సిజెఐ సూర్యకాంత్ తెలిపారు. మానవ వనరుల గరిష్ఠ వినియోగం, న్యాయమైన మూల్యాంకనం గురించి మాట్లాడుతూ సంస్థలో యోగ్యతకు గుర్తింపు తప్పక ఉండాలని అభిప్రాయాన్ని వ్యక్తీకరించారు. న్యాయవ్యవస్థలో వైవిధ్యం గురించి అడిగినప్పుడు భారత న్యాయవ్యవస్థలో సమాజం అభివృద్ధి చెందిన విధానం, దేశం ముందుకు సాగిన విధానంలో అక్కడ ఒక నమూనా మార్పు ఉందన్నారు. కమ్యూనిటీ, ప్రాంతీయ ప్రాతినిధ్యాన్ని నిర్ధారించడానికి, వివిధ ప్రాంతాలలో న్యాయమూర్తులను తీసుకురావడానికి ఇప్పుడు ప్రయత్నం జరుగుతోందని సిజెఐ చెప్పారు. న్యాయ స్వాతంత్ర్యం గురించి మనం మాట్లాడేటప్పుడు రాజ్యాంగ బద్ధమైన అధికారాల విభజన అనే ప్రాథమిక సూత్రాన్ని గుర్తించుకోవాలని సూచించారు.
'ఇప్పుడు నేను న్యాయం పొందడం గురించి మాట్లాడేటప్పుడు వ్యాజ్యాల ఖర్చును ఎలా తగ్గించాలో, విషయాలను నిర్ణయించడానికి సమేతుకమైన కాలక్రమాన్ని ఎలా సూచించాలో నిర్ధారించడం నా మొదటి ప్రాధాన్యత' అని ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ వివరించారు. తాను చాలా ఆశావాద వ్యక్తినని, భారత ప్రజాస్వామ్యం, న్యాయం అందించే వ్యవస్థ రెండింటికీ చాలా ఉజ్వల భవిష్యత్తు ఉందని తాను విశ్వసిస్తున్నానన్నారు. అందుకు కారణాలు చాలా స్పష్టంగా ఉన్నాయన్నారు. 'మొదటిది భారత ప్రజలు రాజ్యాంగ సూత్రాల పట్ల సంపూర్ణ నిబద్ధతను కలిగి ఉన్నారు. రెండవది, భారత ప్రజలు చట్టపాలనకు కట్టుబడి ఉన్నారు. ఇక మూడవది భారత ప్రజలు ప్రజాస్వామ్యానికి కట్టుబడి ఉన్నారు' అని సిజెఐ విపులీకరించారు.

## 'శాంతి' భారం రష్యాదే

(మొదటి పేజీ తరువాయి)

కోరారు. ఫ్లోరిడాలో రెండు రోజుల చర్చలు నిర్మాణాత్మకంగా జరిగాయని చెప్పారు. ఉక్రేన్‌లో యుద్ధ ముగింపు చర్యలన్నీ రష్యా సంసిద్ధతమైనే ఆధారపడి ఉంటాయని, రష్యా నిర్ణయం ఆధారంగానే సైన్యాలను వెనక్కు మళ్ళించడం, సైనికుల మరణాలు ఆపడం ఆధారపడి ఉంటాయని పేర్కొన్నారు. ఈ చర్చల్లో శాంతి ఒప్పందంతోపాటు తదనంతర భద్రతా చట్రం గురించి కూడా ప్రతినిధులు ఒక అంగీకారానికి వచ్చారు. శాంతిని నిలబెట్టడానికి ఎదురయ్యే ఆటంకాలు అడ్డుకోవడానికి సమకూర్చుకోవాల్సిన సామర్థ్యం గురించి కూడా చర్చించారు. అసలు మాస్కో చర్చల్లో ఏం జరిగిందో తెలుసుకోవాలనుకుంటున్నానని, యుద్ధాన్ని కొనసాగించడానికి పుతిన్ ఇంకా ఎలాంటి ఎత్తులు వేస్తున్నారో తెలుసుకోవాల్సిన అవసరం ఉందని ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్స్కీ విమర్శించారు. ట్రంప్ ప్రణాళిక రష్యాకు అనుకూలంగా ఉందని ఉక్రేన్ వాదించడంతో జెనీవాలో కొన్ని మార్పులు చేర్పులు చేశారు. కానీ భూభాగాలను స్వాధీనం చేసే విషయంపై వివాదం మాత్రం పరిష్కారం కాలేదు. ఉక్రేన్‌లోని ఐదోవంతు భూభాగం ప్రస్తుతం రష్యా అధీనంలో ఉంది. అంటే డాన్‌బాస్, డోనెట్స్క్, లూహాన్స్క్ ప్రాంతాలలో భూభాగంలో రష్యా సేనలు ఉన్నాయి.

### ఉక్రేన్ వైదొలగకపోతే...

ఉక్రేన్ సైన్యాలు గనుక ఈ వారంలో డాన్‌బాస్ ప్రాంతం నుండి వెనక్కు వెళ్ళకపోతే ఆ ప్రాంతాన్ని తామే బలప్రయోగంతో విముక్తి చేస్తామని రష్యా అధ్యక్షుడు పుతిన్ చెప్పారు. భారత్ పర్యటన సందర్భంగా 'ఇండియా టుడే'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో గురువారం పుతిన్ మాట్లాడుతూ, ''ఉక్రేన్‌లో యుద్ధ పరిష్కారానికి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రతిపాదిత ప్రణాళికపై ఏకాభిప్రాయం సాధించేందుకు చాలా హృదయపూర్వకంగా ప్రయత్నాలు చేస్తున్నారని, కానీ అందంత సులభమైన పని కాదని అన్నారు. ఈ విషయంలో ఏకాభిప్రాయం కుదరని అంశాలు కూడా ఉన్నాయని అన్నారు. కానీ మాస్కోలో చర్చలు ఎంతో ఉపయుక్తంగా జరిగాయన్నారు. ట్రంప్ ప్రతిపాదించిన ప్రణాళిక అలాస్కాలో ఇంతకుముందు తామిద్దరిమధ్యా జరిగిన చర్చలలో కుదిరిన ఒప్పందం ఆధారంగా రూపొందించారన్నారు. 28 అంశాల ట్రంప్ ప్రణాళికను నాలుగు ప్యాకేజీలుగా విభజించి క్షుణ్ణంగా చర్చించాలని తాము విట్‌కాఫ్‌కు ప్రతిపాదించామన్నారు.
''డాన్‌బాస్ నుండి దళాలను ఉపసంహరించాలని,దీనివల్ల ఘర్షణను నివారించవచ్చునని చెప్పాం,ఆ ప్రాంత ప్రజలు మీతో కలిసి జీవించడానికి ఇష్టపడరని కూడా చెప్పాం, వారు ప్రజాభిప్రాయ సేకరణ చేసి ఓటు వేశారు, రష్యాతో కలిసి ఉండటానికి నిర్ణయించుకున్నారు. కానీ ఉక్రేన్ ఘర్షణకే ఇష్టపడుతోంది, వారు ఆ ప్రాంతాలను ఖాళీచేసి వెళ్ళిపోతే ఘర్షణ ఉండదు, లేకపోతే స్వాత్స్ సహా డాన్‌బాస్, నోవోరోసియా ప్రాంతాలను సైనిక లేదా ఇతర మార్గాల ద్వారా విముక్తి చేస్తాం''అని పుతిన్ చెప్పారు.

### ఉక్రేన్‌లో 29 ప్రాంతాలపై దాడులు

ఉక్రేన్‌లో సాయుధ దళాల దినోత్సవం సందర్భంగా శనివారం తెల్లారకముందే రష్యా సైన్యాలు క్షిపణులు, డ్రోన్లతో దాడి చేశాయి. 653 డ్రోన్లు, 51 క్షిపణులతో మొత్తం 29 ప్రాంతాలపై రష్యా దాడిచేయడంతో దేశం అంతటా గగనతలాన్ని అప్రమత్తం చేశారు. ఐతే 585 డ్రోన్లను ఉక్రేన్ సైన్యాలు కూల్చివేయడమో, తటస్థీకరించడమో చేశాయి.ఈ దాడుల్లో ఎనిమిదిమంది గాయపడ్డారని ఉక్రేన్ హోంమంత్రి ఐహోర్ క్లైమెంకో చెప్పారు. కీవ్‌ప్రాంతంలో ముగ్గురు గాయపడ్డారు. తమ ఇంధన కేంద్రాలే ప్రధాన లక్ష్యంగా రష్యా దాడులు చేస్తోందని జెలెన్స్కీ విమర్శించారు. తమ గగనతల దళాలు 116 రష్యా డ్రోన్లను కూల్చివేశాయని ఉక్రేన్ రక్షణమంత్రిత్వశాఖ ప్రకటించింది. ఐతే తమదేశంపై కూడా ఉక్రేన్ దాడులు చేసిందని రష్యా టెలిగ్రామ్ న్యూస్ ఛానల్ ఆస్ట్రా పేర్కొంది. దీనిపై ఉక్రేన్ స్పందించలేదు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com